గురువారం
17-1-2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 202
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



బుధవారం రాజ్‌భవన్‌లో ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తో ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో సీఎం కేసీఆర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి ఉన్నారు.

ప్రొటెం స్పీకర్‌గా అహ్మద్‌ఖాన్ ప్రమాణ స్వీకారం

- అభినందించిన గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్
- ప్రొటెం స్పీకర్‌కు స్వీటు తినిపించిన ముఖ్యమంత్రి

2

ముగ్గురు ఎమ్మెల్సీలపై వేటు

- పార్టీ ఫిరాయించడంతో అనర్హులుగా ప్రకటించిన మండలి చైర్మన్
- మండలిలో ఖాళీ అయిన ఏడుస్థానాలు
- మార్చిలో ఎన్నికలు జరిగే అవకాశం 2
- మే నెలాఖరునాటికి మొత్తం 16 స్థానాలు ఖాళీ



బ్రెగ్జిట్‌కు బ్రిటన్ పార్లమెంట్‌లో చుక్కెదురు

- ప్రధాని థెరిసా మే ప్రతిపాదించిన ఒప్పందాన్ని అడ్డుకున్న ఎంపీలు 4
- ప్రభుత్వంపై అవిశ్వాసం ప్రవేశపెట్టిన ప్రతిపక్షం

నేటినుంచి అసెంబ్లీ

ప్రొటెం స్పీకర్ అధ్యక్షతన కొలువుదీరనున్న సభ

- తొలుత సీఎం, తర్వాత మహిళాసభ్యుల ప్రమాణం
- నేడు స్పీకర్ పదవికి నామినేషన్.. 18న ఎన్నిక
- 19న గవర్నర్ ప్రసంగం.. 20న ధన్యవాద తీర్మానం
- నేటినుంచి అసెంబ్లీ పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండో అసెంబ్లీ తొలిసారిగా గురువారం కొలువుదీరుతున్నది. ఈ సమావేశాలు 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అసెంబ్లీ సమావేశాల నిర్వహణ కోసం బుధవారం రాజ్‌భవన్‌లో సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తో గవర్నర్ నరసింహన్ ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేయించారు. గురువారం ఉదయం 11.30 గంటలకు ముంతాజ్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన అసెంబ్లీ సమావేశమవుతుంది. అంతకు ముందు ఉదయం 11 గంటలకు గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతోపాటు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అమరవీరులకు నివాళులు అర్పిస్తారు. అక్కడి నుంచే అసెంబ్లీకి తరలివెళ్తారు. 11.05 గంటల నుంచి అసెంబ్లీలో జరిగే కార్యక్రమాల్లో సీఎం కేసీఆర్ పాల్గొంటారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తర్వాత ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ప్రమాణం చేయిస్తారు. ముందుగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, తర్వాత మహిళాసభ్యులు ప్రమాణం స్వీకరిస్తారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న అక్షరమాల ఆధారంగా మిగతాసభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారు. అనంతరం సభ్యులందరికీ జూబ్లీహాల్‌లో ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో



బుధవారం రాత్రి విద్యుత్ దీపాల వెలుగులో అసెంబ్లీ

ఉదయం 11 గంటలకు గన్‌పార్క్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యేలు

స్పీకర్ ఏకగ్రీవం కోసం సహకరించండి

- ఉత్తమ్, అసద్, లక్ష్మణ్‌లతో ఫోన్‌లో మాట్లాడిన సీఎం కేసీఆర్
- సీఎం ప్రతిపాదనకు ఎంఐఎం, బీజేపీ అంగీకారం
- నేడు నిర్ణయం ప్రకటిస్తామన్న పీసీసీ అధ్యక్షుడు

2

కలిసి నడుద్దాం



- కేంద్రం కర్రపెత్తనంతో రాష్ట్రాలకు అన్యాయం
- గుణాత్మక మార్పే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్
- ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో మరోమాట లేదు
- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు
- ఫెడరల్ ఫ్రంట్‌లో చేరికపై వైఎస్ జగన్‌తో కేటీఆర్ భేటీ
- సీఎం కేసీఆర్ త్వరలో ఏపీకి వెళ్లి మరోసారి చర్చిస్తారని వెల్లడి

బుధవారం హైదరాబాద్‌లో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో సమావేశమైన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

- ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం
- హక్కుల కోసం రాష్ట్రాలు ఒకే వేదిక మీదకు రావాలి
- వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా జాతీయ రాజకీయాలు ఉండాలని, కానీ కేంద్ర ప్రభుత్వం అధికారాలను తనవద్ద పెట్టుకొని రాష్ట్రాలను ఇబ్బంది పెడుతున్నదని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో గుణాత్మక మార్పే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని, సమాఖ్య స్ఫూర్తితో ఏడాదికాలంగా పలు రాష్ట్రాల్లో పర్యటించి వివిధ రాజకీయ పక్షాలతో సమావేశమై చర్చించారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డితో సమావేశమై ఫ్రంట్‌లో చేరికపై చర్చించామన్నారు. ఇవి ప్రాథమిక చర్చలేనని, త్వరలో సీఎం కేసీఆర్ ఏపీకి వెళ్లి వైఎస్ జగన్‌తో సమావేశం అవుతారని వెల్లడించారు. భావసారూప్యం ఉన్న నేతలంతా తమతో కలిసి వస్తారనే నమ్మకం ఉన్నదన్నారు. టీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ సీఎం

మిగతా 2వ పేజీలో

కన్నడ సర్కార్‌లో కలకలం

- ప్రభుత్వానికి ఇద్దరు ఇండిపెండెంట్ల మద్దతు ఉపసంహరణ 5
- భయమేమీ లేదు.. ఇది బీజేపీ కుట్ర అంటున్న సీఎం కుమారస్వామి
- ప్రభుత్వం మైనారిటీలో పడిందన్న బీజేపీ



చంద్రుడిపై మొలకెత్తిన పత్తి విత్తనం

జాబిల్లిపై పంటలు పండించడానికి మార్గం సుగమం 4

మూడో విడుతకు నోటిఫికేషన్

- 'పంచాయతీ' నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- తొలిరోజు సర్పంచ్ పదవులకు 1,729 నామినేషన్లు
- వార్డు సభ్యులకు 3,561 నామినేషన్లు దాఖలు
- 4,116 పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో అఖరి విడుత(మూడో) నామినేషన్ల ప్రక్రియకు నోటిఫికేషన్ బుధవారం విడుదలైంది. మూడో విడుతలో భాగంగా 30 జిల్లాల్లో 166 మండలాల పరిధిలో 4,116 గ్రామాలు, 36,729 వార్డులకు శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. తొలిరోజైన బుధవారం

మిగతా 9వ పేజీలో



బుధవారం రాజ్‌భవన్‌లో ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణంచేసిన ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో గవర్నర్ నరసింహన్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి కూడా ఉన్నారు.





ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణంచేసిన ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను ఆలింగనం చేసుకొని, స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో గవర్నర్ నరసింహన్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు తదితరులు కూడా ఉన్నారు.

ప్రొటెం స్పీకర్‌గా అహ్మద్‌ఖాన్ ప్రమాణం

- అభినందించిన గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్,నమస్తే తెలంగాణ: అసెంబ్లీలో సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ప్రొటెం స్పీకర్‌గా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ నరసింహన్ రాజ్‌భవన్‌లో అహ్మద్‌ఖాన్‌తో ప్రమాణం చేయించారు. మాతృభాష ఉర్దూలో ఆయన ప్రమాణంచేశారు. ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌కు గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ప్రొటెం స్పీకర్‌కు సీఎం కేసీఆర్ స్వీట్ తినిపించారు. శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌రావు, హోంమంత్రి మహమూద్‌అలీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మండలిలో ప్రభుత్వ విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ జాఫ్రీ, టీఆర్‌ఎస్ ఎంపీ బీ వినోద్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు జే సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేలు సయ్యద్ పాషాఖాద్రీ, మహ్మద్ మోజంఖాన్, కౌసర్ మొహినుద్దీన్, అహ్మద్ బలాల, వీ శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు తదితరులు ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను అభినందించారు.

రెండువారాల్లో ఎంసెట్ నోటిఫికేషన్

ఎంసెట్ కమిటీ సమావేశంలో దరఖాస్తుల స్వీకరణ తేదీల నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఇంజినీరింగ్, అగ్రికల్చరల్ కాలేజీల్లో సీట్లభర్తీకి మే మూడు నుంచి తొమ్మిది వరకు నిర్వహించే ఆన్‌లైన్ ఎంసెట్ ప్రవేశపరీక్షల కోసం జేఎన్టీయూహెచ్ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. రెం డువారాల్లో ఎంసెట్-2019 నోటిఫికేషన్ జారీ అవుతుందని, పార్లమెంట్ ఎన్నికలకు, జాతీయ స్థాయి పలురకాల ప్రవేశ పరీక్షలకు ఆటంకం ఎదురుకాకుండా పరీక్షలను సజావుగా నిర్వహిం చే ప్రయత్నం చేస్తున్నామని ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ యాదయ్య తెలిపారు. పరీక్షల నిర్వహణపై త్వరలోనే ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఎంసెట్-2019 కమిటీ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో దరఖాస్తుల స్వీకరణ తేదీలతోపాటు సర్వీస్ ప్రొవైడర్, పరీక్షల నిర్వహణలో మార్పులుచేర్పులపైనా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయని అన్నారు. ఆన్‌లైన్ పరీక్షలను మరింత పకడ్బందీగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 5.59 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం ఏకాదశి రాత్రి 10.36 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: కృత్తిక మధ్యాహ్నం 1.41 వరకు, తదుపరి రోహిణి, అమృతఘడియలు: ఉదయం 11.21 నుంచి మధ్యాహ్నం 12.57 వరకు, తిరిగి రాత్రి 11.10 నుంచి 12.46 వరకు, రాహుకాలం మధ్యాహ్నం 1.49 నుంచి 3.13 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.01 నుంచి సాయంత్రం 4.30 వరకు, వర్జ్యం: తె. 1.57 నుంచి 3.39 వరకు.

కలిసి నడుద్దాం

మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ నేతృత్వంలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రాల హక్కులను కాపాడటానికి, ఏపీకి ప్రత్యేక హోదా సాధించడానికి ప్రాంతీయ పార్టీలన్నీ ఒకే వేదిక మీదికి రావడం ఎంతో అవసరమన్నారు. తమ రాష్ట్ర ఎంపీలకు తెలంగాణ ఎంపీలు తోడైతే సంఖ్య పెరుగుతుందని, ప్రత్యేక హోదా డిమాండ్‌కు బలం పెరుగుతుందని చెప్పారు. త్వరలో సీఎం కేసీఆర్‌తో సమావేశమై మరింత విస్తృతంగా చర్చిస్తామన్నారు. ఫెడరల్ ఫ్రంట్‌లో కలిసే అంశంపై వైసీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో చర్చలు జరుపాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు, ఇతర నాయకులకు సూచించారు. ఈ నేపథ్యంలో బుధవారం కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో వైఎస్ జగన్‌తో సమావేశమై ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై చర్చించింది. ఈ సమావేశం గంటకుపైగా సాగింది. అనంతరం కేటీఆర్, జగన్ సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేంద్రం అధికారాలను తన వద్ద పెట్టుకొని, రాష్ట్రాలపై నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నదని విమర్శించారు. ఈ వైఖరి మారాలని, దేశంలో గుణాత్మక మార్పు రావాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ సమాఖ్య స్ఫూర్తితో జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో భాగంగా ఇప్పటికే పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, తమిళనాడు ప్రతిపక్షనేత, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం అజిత్ జోగి తదితరులను సంప్రదించారని, తన పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారని గుర్తుచేశారు.



బుధవారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో మీడియాతో మాట్లాడుతున్న వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి. చిత్రంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, ఎంపీలు వినోద్‌కుమార్, జోగినిపల్లి సంతోష్‌కుమార్, మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి పార్థసారథి, మాజీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

ఇందులో భాగంగానే సీఎం కేసీఆర్ మంగళవారం వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఫోన్‌చేసి ఫెడరల్ ఫ్రంట్ ఆలోచన, ప్రయత్నం గురించి వివరించారన్నారు. తమ పార్టీ ప్రతినిధి బృందం కలుస్తుందని చెప్పగా, బుధవారం రమ్మని జగన్ ఆహ్వానించారని తెలిపారు. ఈ మేరకు వచ్చి వైసీపీ బృందంతో ఫ్రంట్ లక్ష్యాలు, ఉద్దేశాలు చర్చించామన్నారు. తమ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా జాతీయ రాజకీయాలు, రాజకీయ వ్యవస్థ ఉండాలనే ఆలోచన ఉన్న వారందరూ తమతో కలుస్తారనే నమ్మకం తమకు ఉన్నదన్నారు. వైసీపీతో ప్రస్తుతం జరిగినవి ప్రాథమిక చర్చలేనన్నారు. సీఎం కేసీఆర్ గతంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి ముఖ్యమంత్రులు, ప్రధాన రాజకీయ పార్టీల అధ్యక్షులతో సంప్రదించినట్టే.. త్వరలో స్వయంగా ఏపీకి వెళ్లి వైఎస్ జగన్‌తో కూర్చొని మిగిలిన అన్ని విషయాల గురించి మాట్లాడుతారని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదాపై మీడియా అడిగిన ప్రశ్నకు కేటీఆర్ సమాధానమిస్తూ.. ఏపీకి ప్రత్యేక హోదాపై టీఆర్‌ఎస్ వైఖరిని పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌సహా రాజ్యసభలో పార్లమెంటరీ పార్టీ నాయకులు కే కేశవరావు, లోక్‌సభలో ఎంపీ కవిత, ఇతర నాయకులు పలు వేదికల మీద స్పష్టంగా చెప్పామన్నారు. ప్రధానమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కేంద్రాన్ని కోరామని గుర్తుచేశారు. ఈ విషయంలో రెండో అభిప్రాయంగానీ, రెండో ఆలోచన కానీ లేదన్నారు.

రాష్ట్రాలన్నీ ఏకం కావాలి: వైఎస్ జగన్

రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవాలంటే దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని ఎత్తిచూపడంతోపాటు అన్ని రాష్ట్రాలను ఏకంచేసి భవిష్యత్తులో మళ్లీ అన్యాయం జరుగకుండా చూసే వేదికను సిద్ధం చేయడానికి సీఎం కేసీఆర్ చేస్తున్న ప్రయత్నం హర్షణీయమన్నారు. కేసీఆర్ ప్రతిపాదిత ఫెడరల్ ఫ్రంట్ స్వాగతించదగ్గ విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన ప్రత్యేక హోదా హామీకే దిక్కు లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవాలంటే.. సంఖ్యాపరంగా చూసినప్పుడు ఒక్కో రాష్ట్రం పరిధిలోని ఎంపీలు సరిపోరని, కాబట్టి అన్ని రాష్ట్రాలు కలువాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం 25 మంది ఎంపీలతో డిమాండ్ చేస్తే పట్టించుకోవడం లేదని, తమకు 17 మంది తెలంగాణ ఎంపీలు తోడై 42 మంది ఎంపీలు ప్రశ్నించగలిగితే ఏపీకి మేలు జరుగుతుందన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని 42 మంది చెప్పగలిగితే పరిస్థితి మెరుగవుతుందని చెప్పారు. రాష్ట్రాల హక్కులు కాపాడాలంటే ఎంపీల సంఖ్యాబలం పెరుగాలన్నారు. అన్నీ ఒక్కతాటిపైకి వస్తే కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రాలకు అన్యాయం చేయడానికి వెనకడుగు వేసే పరిస్థితి వస్తుందన్నారు. కేసీఆర్ ప్రతిపాదించిన ఫ్రంట్‌తో రాష్ట్ర ప్రభుత్వాలు కలిసివచ్చి ఎంపీల పరంగా సంఖ్యను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. కేటీఆర్ వచ్చి ఇదే విషయాన్ని తమకు తెలిపారన్నారు. కేసీఆర్ తనతో ఫోన్‌లో మాట్లాడారని, ఈ విషయంపై ఆయన త్వరలో స్వయంగా ఏపీకి వస్తారన్నారు. ప్రస్తుతం జరిగినవి ప్రాథమిక చర్చలు మాత్రమేనని, కేసీఆర్ వచ్చిన తర్వాత ఇంకా చర్చలు జరుగుతాయని స్పష్టంచేశారు. కేటీఆర్ వెంట టీఆర్‌ఎస్ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, జోగినిపల్లి సంతోష్‌కుమార్, మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల శ్రవణ్‌రెడ్డి ఉన్నారు. వైసీపీ ప్రతినిధి బృందంలో ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ మంత్రి పార్థసారథి తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం

ఫెడరల్ ఫ్రంట్‌పై చర్చించేందుకు వెళ్లిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు లోటస్‌పాండ్‌లో వైసీపీ ప్రతినిధి బృందం ఘనస్వాగతం పలికింది. ఆ పార్టీ ఎంపీలు విజయసాయిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పార్థసారథి తదితర నేతలు వారికి పలికి లోపలికి తీసుకెళ్లారు. చర్చల అనంతరం రెండు పార్టీల నాయకులు కలిసి భోజనం చేశారు.

జగన్ ఇంటిముందు ఏపీ ఇంటెలిజెన్స్ నిఘా!

తెలంగాణ రాష్ట్రంలో.. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో జరుగుతున్న పరిణామాలపై అమితాసక్తి ప్రదర్శించే ఏపీ ప్రభుత్వ పెద్దలు వైసీపీ, టీఆర్‌ఎస్ పార్టీల నాయకుల సమావేశంపైనా ఆరాలు తీసినట్టు తెలిసింది. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై చర్చించేందుకు టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లిన విషయం తెలిసిందే. రెండు పార్టీల నేతలు ఏయే విషయాలపై చర్చించారో తెలుసుకొనేందుకు ఏపీ ఇంటెలిజెన్స్ పోలీసులు జగన్ ఇంటిదగ్గర హడావుడి చేసినట్టు సమాచారం. జగన్ ఇంటికి ఎవరెవరు వచ్చారు? ఎంతసేపు భేటీ కొనసాగింది? ఏయే విషయాలు ప్రస్తావనకు వచ్చాయి? వంటి విషయాలను తెలుసుకునేందుకే వారు ఇక్కడికి వచ్చినట్టు తెలిసింది. సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఏపీ సీఎం చంద్రబాబుకు, ఇతర ప్రభుత్వ పెద్దలకు చేరవేసినట్టు సమాచారం.

'రైతుబంధు' దేశానికి అవసరం

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్వీట్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రైతాంగానికి అండగా నిలిచేందుకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం దేశానికి కూడా అవసరమని ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అభిప్రాయపడ్డారు. బీజేపీయేతర, కాంగ్రెసేతర ప్రభుత్వమైన టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న వినూత్నమైన రైతుబంధు ద్వారా రైతాంగానికి లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతుబంధు పథకాన్ని కేంద్రప్రభుత్వం అమలుచేయబోతున్నదని ఇటీవల పత్రికల్లో వచ్చిన వార్తపై అసదుద్దీన్ బుధవారం ట్విట్టర్‌లో స్పందించారు.

ముగ్గురు ఎమ్మెల్సీలపై వేటు

పార్టీ ఫిరాయించడంతో అనర్హులుగా ప్రకటించిన మండలి చైర్మన్

ఏడుస్థానాలు ఖాళీ.. మే నెలాఖరునాటికి మొత్తం 16 స్థానాలు ఖాళీ.. మార్చిలో ఎన్నికలు!



ఎమ్మెల్సీలు రాములునాయక్, ఆర్ భూపతిరెడ్డి, కే యాదవరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటు న్న ముగ్గురు ఎమ్మెల్సీలపై వేటు పడింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలు రాములు నాయక్, కే యాదవరెడ్డి, ఆర్ భూపతిరెడ్డిపై అనర్హత వేటువేస్తూ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై అనర్హత వేటువేస్తూ బుధవారం మండలి కార్యదర్శి నర్సింహాచార్యులు బులిటెన్ విడుదలచేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీఆర్‌ఎస్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్సీలు రాములునాయక్, కే యాదవరెడ్డి, ఆర్ భూపతిరెడ్డి, కొండా మురళి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, భూపతిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయగా, మిగిలిన ముగ్గురు ఆ పార్టీ తరపున ప్రచారంచేశారు. ఈ నేపథ్యంలో వీరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు టీఆర్‌ఎస్ ఫిర్యాదుచేసింది. దీంతో వీరికి చైర్మన్ నోటీసులు జారీచేయగా, కొండా మురళి తన పదవికి రాజీనామాచేశారు. మిగిలిన ముగ్గురు తమ వాదనలు వినిపించడానికి మరికొంత సమయం కోరారు. వారికి సమయం ఇచ్చి వారి వాదనలు విన్నారు. టీఆర్‌ఎస్ తరపున వాదనలు వినిపించారు. సాక్ష్యాలను సమర్పించారు. ఈ నేపథ్యంలో ముగ్గురిపై వేటు పడింది. ప్రస్తుతం మండలిలో ఏడుస్థానాలు ఖాళీ కాగా, మార్చి నెలాఖరునాటికి మరో ఎనిమిది, మే నెలలో ఒక స్థానం ఖాళీకానున్నాయి. ఎమ్మెల్సీలుగా ఉన్న పట్నం నరేందర్‌రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా ఎన్నికకావడంతో రాజీనామాచేశారు. కొండా మురళి కూడా ఎమ్మెల్సీ పదవికి రాజీనామాచేశారు. ముగ్గురిపై అనర్హత వేటు పడింది. మొత్తంగా ఏడు స్థానాలకు మార్చిలో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. వీరిలో మైనంపల్లి, యాదవరెడ్డి ఎమ్మెల్యేల కోటాలో, పట్నం నరేందర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, భూపతిరెడ్డి, కొండా మురళి స్థానిక సంస్థల కోటా, రాములునాయక్ గవర్నర్ కోటాలో నామినేట్ అయ్యారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్‌తోపాటు పాతూరి సుధాకర్‌రెడ్డి, పూల రవీందర్, మహమూద్ అలీ, సలీం, షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సంతోష్‌కుమార్ పదవీకాలం మార్చితో, ప్రభాకర్ పదవీకాలం మే నెలలో ముగియనున్నది. ఇలా మే నెలాఖరునాటికి 16 ఎమ్మెల్సీస్థానాలు ఖాళీ కానున్నాయి.

హైకోర్టులో కొత్త లా చాంబర్స్

- పాత భవనాల కూల్చివేతకు అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ హైకోర్టు ప్రాంగణంలో నూతన లా చాంబర్స్ (న్యాయవాదుల కార్యాలయాలు) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. చాంబర్స్ నిర్మించాల్సిన స్థలంలో ఉన్న పాత భవనాలను తొలిగించేందుకు అనుమతులు మంజూరుచేసింది. హైకోర్టు ప్రాంగణంలోని ఐ బ్లాక్ భవనాన్ని తొలిగించడానికి టెండర్లు పిలిచేందుకు వీలుగా ఆ భవనం విలువను నిర్ధారిస్తూ న్యాయశాఖ కార్యదర్శి వీ నిరంజన్‌రావు బుధవారం ఉత్తర్వులు విడుదలచేశారు. ఐ బ్లాక్ భవనాన్ని తొలిగించడంతోపాటు ఇతర చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రార్‌కు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం హైకోర్టులో న్యాయవాదులకు కార్యాలయాలు ప్రత్యేకంగా లేవు. కొద్దిమంది సీనియర్లకు ఉన్నా.. అవి ఇరుకుగా ఉన్నాయి. కొత్తగా నిర్మించే లా చాంబర్లను నామమాత్రపు అద్దెతో న్యాయవాదులకు కేటాయించనున్నారు.



గురువారం నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటంతో బందోబస్తులో పాల్గొన్న పోలీసులు



గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని పూలతో అలంకరించిన దృశ్యం

నేటినుంచి అసెంబ్లీ

మొదటిపేజీ తరువాయి...

భోజనాలు ఏర్పాటుచేసింది.

నేడు స్పీకర్ పదవికి నామినేషన్

అసెంబ్లీ స్పీకర్ ఎన్నికకు గురువారం నామినేషన్లు దాఖలుచేయాలని శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు నోటిఫికేషన్ జారీచేశారు. స్పీకర్‌గా పోటీచేయాలనుకొనే సభ్యులు గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. 18న స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారు. ఒకే నామినేషన్ దాఖలైతే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటిస్తారు. స్పీకర్ అభ్యర్థి ఎంపికపై సీఎం కేసీఆర్ గురువారం నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. ఆ నిర్ణయం ప్రకారం టీఆర్‌ఎస్ నుంచి స్పీకర్ అభ్యర్థి నామినేషన్ దాఖలుచేస్తారు. ఈ ఎన్నిక ఏకగ్రీమయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. గవర్నర్ నరసింహన్ 19న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీ, కౌన్సిల్‌లో వేర్వేరుగా చర్చ జరుగుతుంది. ఈ చర్చను అసెంబ్లీలో సీనియర్ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ ప్రారంభిస్తారు. ప్రశాంత్‌రెడ్డి తదితరులు మాట్లాడుతారని తెలిసింది. తర్వాత గవర్నర్ ప్రసంగానికి అసెంబ్లీ, కౌన్సిల్ ధనవ్యాదాలు తెలుపుతూ తీర్మానం చేయనున్నాయి.

సభలు.. ర్యాలీలు రద్దు

శాసనసభ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీ, కౌన్సిల్‌హాల్ చుట్టూ నాలుగు కిలోమీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు విధిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు గురువారం ఉదయం 6 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించవద్దని కోరారు.

స్పీకర్‌ను ఏకగ్రీవం చేద్దాం

సహకరించాలని ప్రతిపక్షాలకు సీఎం కేసీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ స్పీకర్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు సహకరించాలని ప్రతిపక్ష పార్టీలకు సీఎం కేసీఆర్ విజ్ఞప్తిచేశారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో బుధవారం సాయంత్రం సీఎం కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ప్రతిపాదించగా, ఎంఐఎం, బీజేపీ అధ్యక్షులు వెంటనే అంగీకారం తెలిపారు. పార్టీలో చర్చించి గురువారం ఉదయం నిర్ణయం ప్రకటిస్తామని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ బదులిచ్చారు.

గురువారం(17)	ఉదయం 11 గంటలకు	గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యేలు
	ఉదయం 11.30 గంటలకు	ప్రొటెం స్పీకర్ అధ్యక్షతన అసెంబ్లీ సమావేశం ముఖ్యమంత్రి, తర్వాత మహిళాసభ్యుల ప్రమాణం అక్షరమాల ఆధారంగా మిగతా సభ్యుల ప్రమాణం
	ఉదయం 10.30 నుంచి	స్పీకర్ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ
శుక్రవారం(18)		అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక
శనివారం(19)		ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం
ఆదివారం(20)		గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై అసెంబ్లీ, కౌన్సిల్‌లో వేర్వేరుగా చర్చ..ఆమోదం



గంగాజల సేకరణకు పాదయాత్రగా బయలుదేరిన మెస్రం వంశీయులు



గంగా జలం సేకరణ మార్గాలపై చర్చిస్తున్న మెస్రం వంశీయులు

వచ్చేనెల 4న నాగోబా జాతర

పవిత్ర గంగాజల సేకరణకు బయలుదేరిన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఫిబ్రవరి 4న నాగోబాకు నిర్వహించే మహాపూజలకుగాను పవిత్రమైన గోదావరి నది హస్తలమడుగులోని గంగాజలాన్ని సేకరించేందుకు మెస్రం వంశీయులు బుధవారం సాయంత్రం బయలుదేరారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్ గ్రామంలోని పురాతన నాగోబా ఆలయంలో సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం కటోడ హనుమంత్‌రావ్ ఆధ్వర్యంలో దాదాపు వంద మందికిపైగా మెస్రం వంశీయులు గంగాజల సేకరణకు పాదయాత్రగా బయలు దేరారు. వీరు రాత్రి మండలంలోని ముత్నూర్ గ్రామానికి చేరుకొని అక్కడే బసచేశారు. 17న ఉట్నూర్ మండలం సాలేవాడ, 18న నార్నూర్ మండలం జామ్డ, 19న జైనూర్ మండలం జామ్‌గూడ, 20న గౌరి, 21న డబోలి, 22న సిర్పూర్ మండలం దేవుడ్‌పల్లి, 23న జన్నారం మండలం ఇస్లాంపూర్, 24న కలమడుగు, 25న గోదావరి నదికి ప్రత్యేక పూజలు చేసి, హస్తలమడుగు పవిత్రమైన గంగాజలాన్ని సేకరిస్తారు. తిరుగు ప్రయాణంలో 31న ఇంద్రవెల్లి మండలం ఇంద్రాదేవి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం కెస్లాపూర్ మర్రి చెట్లకు చేరుకుంటారు. మూడు రోజులు అక్కడే బసచేస్తారు. ఫిబ్రవరి 4న నాగోబాకు గంగాజలంతో మహాపూజలు నిర్వహిస్తారు. బుధవారం నాటి కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్, మెస్రం వంశీయులు చిన్నుపటేల్, బాధిరావ్ పటేల్, లింబారావ్, కటోడ హనుమంత్‌రావ్, పర్ధాంజీ పాండురంగ్, తుకుడోజీ, మెస్రం మనోహర్, కోశరావ్, నాగోరావ్, గణపతి, దాదారావ్, తిరుపతి, సోనేరావ్, దేవ్‌రావ్, నాగ్‌నాథ్, తుకారామ్, శేఖర్‌బాబు, ఆనంద్‌రావ్, సీతారామ్, ధర్ము తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలు జాతరలో శివసత్తుల పూనకాలు

మల్లన్న నామస్మరణలో ఐనవోలు

భక్తజనంతో పోటెత్తిన జనజాతర

ఐనవోలు: శైవక్షేత్రాల్లో సుప్రసిద్ధమైన ఐనవోలు మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలకేంద్రంలో ఈ నెల 13న ధ్వజారోహణతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలకు.. భోగి, సంక్రాంతి పండుగ రోజుల్లో భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచేగాక రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆచారం ప్రకారం ఒగ్గుపూజారులు పట్నాలు వేసి స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన బోనం వండి నైవేద్యాలను భక్తులు సమర్పించారు. డప్పుచప్పుళ్లతో శివసత్తులు రాగా, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మార్నేని వంశీయులు నిర్వహించే దేవుడి రథాన్ని స్థానిక ఎంపీపీ మార్నేని రవీందర్‌రావు ఇంటినుంచి తీసుకొచ్చారు. ఆలయం చుట్టూ రథాన్ని ఊరేగించగా భక్తులు దర్శించుకున్నారు.

ఎల్లమ్మ ఆలయం వద్ద పూజలు

మల్లికార్జునస్వామి జాతరకు వచ్చిన భక్తులు అనంతరం ఎల్లమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి దేవాలయం పడమర వైపు ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో బోనాలు సమర్పించారు. భారీ క్యూలైన్ ఉండడంతో స్వామి వారి దర్శనానికి సుమారుగా ఐదు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సేవాల సంస్థల ప్రతినిధులు, వలంటీర్లు, ఆలయ కమిటీ సభ్యులు సేవలందించారు. ఆలయ ఈవో నాగేశ్వర్‌రావు, ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం మార్నేని, బండ్లు కట్టిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో కొమురెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ సేవెల్లి సంపత్‌కుమార్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ శిల్పం అత్యద్భుతం

- భారతీయ శిల్పాలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలు
- న్యూయార్క్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్స్ సీనియర్ క్యూరేటర్ జాన్ గై
- నృత్త రత్నావళిపై హన్మకొండలో జాతీయసదస్సు ప్రారంభం



బుధవారం హన్మకొండలో మాట్లాడుతున్న న్యూయార్క్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్స్ సీనియర్ క్యూరేటర్ జాన్ గై. చిత్రంలో మద్రాస్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ మాజీ డైరెక్టర్ నాగస్వామి, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కన్వీనర్ బీవీ పాపారావు తదితరులు

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ/నిట్‌క్యాంపస్(వరంగల్): భారతీయ శిల్పాల్లో సంస్కృతి సంప్రదాయాలు దాగున్నాయని, కాకతీయుల శిల్ప సంపద అత్యద్భుతమని అమెరికాలోని న్యూయార్క్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్స్ సీనియర్ క్యూరేటర్ డాక్టర్ జాన్ గై కొనియాడారు. జాయపసేనాని రచించిన 'నృత్త రత్నావళి' గ్రంథంపై బుధవారం హన్మకొండ నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో 'నృత్త రత్నావళిపై శాస్త్ర ప్రయోగం' అనే పేరుతో రెండురోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సును జాన్ గై ప్రారంభించి మాట్లాడారు. భారత్‌లో తొలి శతాబ్దం నుంచే అద్భుత శిల్పసంపద రూపుదిద్దుకున్నదని, అవి భారతీయ మూలాల గొప్పదనాన్ని ప్రపంచానికి తెలియజేశాయని పేర్కొన్నారు. దేశంలోని ప్రముఖ ఆలయాల నిర్మాణం, శిల్పసౌందర్యాల రీతులను, కాకతీయుల నుంచి విజయనగర కాలం వరకు మలిచిన శిల్పాలు, చిత్రలేఖనాల ప్రత్యేకతను వివరించారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కన్వీనర్ బీవీ పాపారావు మాట్లాడుతూ ట్రస్ట్ తరపున ఏటా జనవరిలో నిర్వహించే సదస్సుల ద్వారా కాకతీయ చారిత్రాత్మక ప్రాశస్త్యంపై అనేక పరిశోధనా అంశాలను వెలుగులోకి తీసుకొస్తున్నామన్నారు. మద్రాస్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ మాజీ డైరెక్టర్ నాగస్వామి మాట్లాడుతూ అద్భుత శిల్ప సంపద కలిగిన రామప్ప ఆలయానికి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు సాధించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. రామప్పపై ప్రత్యేక పుస్తకం తీసుకొస్తున్నట్టు తెలిపారు.

సీఎం కేసీఆర్ పూనుకుంటేనే మన సంపదకు ఖ్యాతి

తెలంగాణ చారిత్రక, వారసత్వ సంపదకు జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి దక్కాలంటే ప్రభుత్వమే పూనుకోవాలని, సీఎం కేసీఆర్ రంగంలోకి దిగితేనే సాధ్యమవుతుందని రాష్ట్ర పురావస్తుశాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ఎస్ రంగాచార్యులు అన్నారు. 1956లో తెలంగాణ నుంచి ఎనిమిది మాన్యుమెంట్స్ మాత్రమే జాతీయ పురావస్తుశాఖ పరిధిలోకి వెళ్లాయని అప్పటినుంచి ఇప్పటివరకు పెద్దగా పురోగతిలేదని చెప్పారు. ఏఎస్ఏ పరిధిలో ఎక్కువ మాన్యుమెంట్స్ ఉంటే మన వారసత్వ కట్టడాలకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని, పర్యాటక రంగం బాగా విస్తరిస్తుందని చెప్పారు. తెలంగాణలో కాకతీయులు, చాళుక్యులు, శాతవాహనులు, రాష్ట్రకూటులు, కుతుబ్‌షాహీల పాలనాకాలంలో నిర్మించిన అనేక కట్టడాలను భవిష్యత్‌తరాలకు అందివాల్సి ఉన్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడువేల చారిత్రక కట్టడాలను గుర్తించామని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే కాకతీయుల కట్టడాలు 150 కన్నా ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ నివేదికను ప్రభుత్వానికి ఇచ్చామని, ఇందులో కనీసం 50 కట్టడాలైనా ఏఎస్ఐ పరిధిలోకి వెళ్లేందుకు అర్హమైనవని చెప్పామన్నారు. ప్రపంచంలోనే పురాతన కట్టడాలు, నిర్మాణాలను పరిరక్షించే సంస్థగా ఏఎస్ఐకి మంచి గుర్తింపు ఉన్నదని, కానీ దాని పరిధిలో తెలంగాణ కట్టడాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. మరోవైపు హైదరాబాద్ సర్కిల్‌ను మినీ సర్కిల్‌గా చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇదే జరిగితే మన వారసత్వ సంపద మసకబారే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ వంటి కళాపోషకులు కలుగజేసుకుంటేనే దీనిని అడ్డుకోవచ్చని చెప్పారు.

రామప్పకు ప్రపంచ వారసత్వ హోదా సాధిస్తాం

రామప్పకు ప్రపంచ వారసత్వ హోదా సాధించడమే తమ లక్ష్యమని ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం పాండురంగారావు పేర్కొన్నారు. ఇందుకోసం తాము 1980వ దశకం నుంచి కృషిచేస్తున్నామన్నారు. ఈ జాతీయసదస్సు కూడా అందులో భాగమేనని చెప్పారు. రామప్పలో ప్రస్తుతం ఉన్న నందీశ్వరుడు ఒకప్పుడు రామప్ప గుడిలోపల ఉండేదని, తాము పూనుకొని ప్రత్యేకంగా నంది మంటపాన్ని నిర్మించామని గుర్తుచేశారు. సమీప భవిష్యత్‌లో రామప్పను ప్రపంచ వారసత్వ కట్టడంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ మేరకు కాఫీటేబుల్ బుక్స్, డాక్యుమెంట్స్, ఫొటోలు, లిటరేచర్ వంటివి సమకూరుస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్ హెడ్ డాక్టర్ అద్వైతవాదిని, హిస్టరీ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, పర్యాటకశాఖ అధికారి ఎం శివాజీ తదితరులు పాల్గొన్నారు.



కనుమ సందర్భంగా బుధవారం తిరుమలలో పార్వేట ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పేరిణి.. సర్వజన జీవన ప్రతిరూపం


- ఈ నృత్యంతో నాకు 35 ఏండ్ల అనుబంధం
- చిదంబరంలో 10వేల మంది చేతులెత్తి మొక్కారు
- మన వారసత్వ సంపద గురించి భవిష్యత్ తరాలకు నేర్పాలి
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో పద్మభూషణ్ డాక్టర్ ఆర్ నాగస్వామి

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'కాకతీయుల కాలంలో పుట్టిన అపురూప నృత్యం పేరిణి. దీనితో నాది 35 ఏండ్ల అనుబంధం. కాకతీయ శిల్ప, నృత్య కళలు జీవంపోసుకున్న గడ్డమీద కాలుమోపడం సంతోషంగా ఉంది' అన్నారు మద్రాస్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ మాజీ డైరెక్టర్ ఆర్ నాగస్వామి. 'నృత్త రత్నావళి'పై హన్మకొండలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆయన తమిళనాడు నుంచి వచ్చారు. ఈ సందర్భంగా నమస్తే తెలంగాణతో మాట్లాడారు. ఆయన పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే..

చప్పట్లతో శివుడికి అభిషేకం

కాకతీయ మహారాజు గణపతిదేవుడి గజసర్వసైన్యాధ్యక్షుడు జాయపసేనాని రాసిన నృత్త రత్నావళిలో పేరిణి నృత్యం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 1982లో నృత్తరత్నావళి మాన్యుస్క్రిప్ట్‌ను చదివా. 1984లో చిదంబరంలోని ఆలయంలో పేరిణి శివతాండవ రూపక పునఃసృష్టికర్త నటరాజ రామకృష్ణ తన శిష్యులతో కలిసి 'పేరిణి-ఆంధ్రనాట్యం' పేరుతో ప్రదర్శన ఇచ్చారు. పూర్తికాగానే దాదాపు పదివేల మంది ప్రేక్షకులు ఒక్కసారిగా నిలబడి 'హర హర మహాదేవ..శంభోశంకర' అంటూ చేతులెత్తి మొక్కి తన్వయత్వానికి లోనయ్యారు. చప్పట్లతో ఆ మహాశివుడికి అభిషేకం చేశారు. దేశీయ నృత్యరీతికి లభించిన అరుదైన ప్రశంస అది. అప్పటి నుంచి నేను పేరిణిపై అధ్యయనం ప్రారంభించా. 35 ఏండ్ల నిరీక్షణ తర్వాత పేరిణి పుట్టిన పుణ్యభూమికి రాగలిగాను.

ఎవరీ నాగస్వామి?



డాక్టర్ ఆర్ నాగస్వామి తమిళనాడు పురావస్తుశాఖలో డైరెక్టర్‌గా పనిచేశారు. నాట్యకారుడు కూడా. దేశ చారిత్రక, వారసత్వ, శిల్పరీతులపై పరిశోధనలు చేశా రు. 1986లో తమిళనాడు కుంభకోణం సమీపంలోని పత్తూరు దేవాలయంలోని నటరాజ విగ్రహాన్ని లండన్‌కు చెందిన ఆయిల్ కంపెనీ అధినేత స్మగ్లర్ల సాయంతో దొంగిలించి తీసుకుపోయారు.నాగస్వామి లండన్ హై కోర్టులో అనేక ఏండ్లు పోరాడి ఆ విగ్రహాన్ని స్వదేశానికి తెప్పించారు. అమెరికా, జర్మనీ, నార్వే, ఫ్రాన్స్, బ్రిటన్ తదితర దేశాల్లో పర్యటించి భారతీయ శిల్పం, శాస్త్రీయత, వారసత్వ ప్రాధాన్యతపై సెమినార్లు నిర్వహించారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం గత ఏడాది పద్మభూషణ్‌తో సత్కరించింది.

ఓరుగల్లుకే పరిమితం కాదు

శిల్పాలు, ఆలయాలు అప్పటి ప్రజల జీవన శైలిని ప్రతిబింబిస్తాయి. పేరిణి కేవలం నృత్యం మాత్రమే కాదు. అది కాకతీయుల జీవనప్రతిబింబం. జాయపసేనాని తన నృత్త రత్నావళిలో పేరిణి స్థానికతకు సంబంధించిన అంశం కాదని, అందులో కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా భాగస్వామ్యం ఉందని చెప్పారు. పేరిణి సంగీత వాయిద్య కళాకారులు గౌడదేశం (బెంగాల్) వచ్చారని, ప్రత్యేకించి తమిళనాడు నుంచి మృదంగ విద్వాంసులు వచ్చారని నృత్త రత్నావళి చెప్తున్నది. సంగీతం, ఆహార్యం ఇలా ప్రతి అంశంలో సార్వజనీన ప్రజల జీవన ప్రతిరూపం ఉండే దేశీ నృత్యం ఇది. కాకతీయ సామ్రాజ్యంలోని కళాసాంస్కృతిక రంగాల జీవధార మహాగొప్పది అనడానికి ఇదే నిదర్శనం.

వారస్వతమే వారధి కావాలి

ఒక ప్రాంత చారిత్రక, సంస్కృతిక జీవన విధానాన్ని తరాలు పుణికిపుచ్చుకోవాలి. తమ వారసత్వంపై పట్టు, ప్రేమ ఉన్న ప్రాంతాల్లో చరిత్ర వారధిలా జీవనదిలా ప్రవహిస్తుంది. మనకు ఆ స్పృహ చాలా తక్కువ. ఇప్పటికైనా మేల్కోవాలి.



ఖమ్మంలో ఏర్పాటుచేసిన శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కంటి వెలుగు

కంటివెలుగు @ కోటి 29 లక్షలు

- 20,13,268 మందికి కండ్లద్దాలు పంపిణీ
- 7,749 గ్రామాల్లో కంటి వైద్యశిబిరాలు పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంధత్వరహిత తెలంగాణ సాధనదిశగా.. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సూచన మేరకు రాష్ట్రంలోని అన్నివర్గాలవారి కోసం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ కంటివెలుగు కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా కోటి 29 లక్షల మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 7,749 గ్రామాల్లో, మున్సిపాలిటీల పరిధిలోని 633 వార్డుల్లో వైద్యశిబిరాల నిర్వహణ పూర్తయింది. ఇప్పటివరకు కంటి వైద్యశిబిరాల్లో1,29,42,902 మందికి కంటిపరీక్షలు చేయగా.. 20,13,268 మందికి కండ్లద్దాలు అందజేశారు. కాగా, బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 82,550 మందికి కంటి పరీక్షలు చేశారు. మెదక్ జిల్లాలో 1,583 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు.

కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	బుధవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	82,550	1,29,42,902
రీడింగ్ అద్దాలుపొందినవారు	6,432	20,13,268
ప్రత్యేకఅద్దాలకు ప్రతిపాదన	5,930	15,53,001
కంటిసమస్యలపై రెఫరల్	5,048	8,13,249
కంటి సమస్యలు లేనివారు	65,140	85,63,384

కనులపండువగా గుడి సంబురాలు



వేయిస్తంభాల దేవాలయంలో జరిగిన వేడుకలకు హాజరైన ప్రజలు

వేయిస్తంభాల ఆలయంలో ఘనంగా వేడుకలు

రెడ్డికాలనీ(వరంగల్): వరంగల్‌లోని చారిత్రక రుద్రేశ్వర స్వామి వేయిస్తంభాల దేవాలయంలో బుధవారం గుడి సంబురాలు కనులపండువగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సలహాదారు పాపారావు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి రామచంద్రు తెజావత్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వేయిస్తంభాల గుడి ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ నృత్య కళాకారిణి దీపికారెడ్డి బృందం.. తమ ప్రదర్శన ద్వారా అందరినీ ఆకట్టుకున్నారు. కళాకారిణి దీపికారెడ్డి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను నృత్యప్రదర్శన ద్వారా వెల్లడించారని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన పరంపం ఫౌండేషన్, లైఫ్‌కేర్ ఫౌండేషన్, ఎస్సార్ విద్యాసంస్థలను వారు అభినందించారు. దీపికారెడ్డి బృందాన్ని అతిథులుగా ఘనంగా సత్కరించారు.

చంద్రుడిపై మొలకెత్తిన పత్తి విత్తనం

జాబిల్లిపై పంటలు పండించడానికి మార్గం సుగమం



బీజింగ్, జనవరి 16: మొదటిసారిగా చంద్రుడిపై పత్తి విత్తనం మొలకెత్తింది. దీంతో చంద్రుడిపై పంటలు పండించి మనుష్యులకు అనుకూలమైన వాతావరణాన్ని అభివృద్ధి చేయాలన్న శాస్త్రవేత్తల ప్రయత్నాలకు ఊపిరి ఊదినట్లు అయ్యింది. ఇటీవల చైనా చంద్రుడి ఆవలి భాగంపైకి 'చేంజ్ 4 ప్రోబ్'ను పంపిన విషయం తెలిసిందే. చైనా శాస్త్రవేత్తలు ఈ ప్రోబ్‌ను పంపడానికి ముందే అందులో కొన్ని రకాల విత్తనాలను (పత్తి, ఆలుగడ్డ తదితర విత్తనాలు) అమర్చారు. ఈ ప్రోబ్ చంద్రుడి ఆవలి భాగంపై దిగిన తర్వాత ఈ విత్తనాలను అక్కడ వదిలేసింది. ఇందులో చాలా విత్తనాలు విఫలమైనప్పటికీ పత్తి వితనం మాత్రం మొలకెత్తింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను ప్రోబ్ పంపడంతో శాస్త్రవేత్తల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. చైనాలోని చాంగ్‌కింగ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ చంద్రుడిపై పత్తి విత్తనం మొలకెత్తడం అద్భుతమని చెప్పారు. అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములు తమకు కావాల్సిన ఆహారాన్ని అక్కడే పండించుకొని తినడానికి దారులు పడ్డాయని పేర్కొన్నారు.

మూడోవంతు ఐరాస సిబ్బందికి

తప్పని లైంగిక వేధింపులు



ఐక్యరాజ్యసమితి: ఐరాస సిబ్బందిలో మూడోవంతు మంది లైంగిక వేధింపులకు గురవుతున్నారని డెల్లాయిట్ అనే సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ సర్వే నిర్ధారించింది. ప్రపంచ వ్యాప్తంగా లైంగిక వేధింపులు, దాడులకు వ్యతిరేకంగా 'మీటూ (నేనూ బాధితురాలినే)' ఉద్యమం ఊపందుకున్న నేపథ్యంలో ఈ సర్వే నిర్వహించారు. వారిలో 21.7 శాతం మంది తమకు ఇష్టం లేకున్నా శృంగారభరితమైన వ్యాఖ్యలను వినాల్సి వచ్చిందని చెప్పారని ఐరాస మంగళవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. 14.2 శాతం మంది తమ కదలికలు, ధరించే దుస్తులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసేవారని చెప్పారు. 13 శాతం మంది చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నట్లు తెలిపింది. 10.1 శాతం మంది తోటివారిని తాకి వారిని అసౌకర్యానికి గురి చేశారని పేర్కొన్నారు. ఐరాస, దాని అనుబంధ సంస్థలకు చెందిన 30,364 మందితో డెల్లాయిట్ సర్వే నిర్వహించింది.

అభ్యంతరాలు బేఖాతరు చేస్తూ

జస్టిస్ సంజీవ్ ఖన్నాకు పదోన్నతి

సుప్రీంకోర్టుకు మరో ఇద్దరు జడ్జీలు.. 28కి పెరిగిన న్యాయమూర్తులు



సంజీవ్‌ఖన్నా

న్యూఢిల్లీ: పలు అభ్యంతరాలను, పలువురు జడ్జీల సీనియారిటీని బేఖాతరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టు జడ్జి సంజీవ్ ఖన్నాకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించింది. కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ దినేశ్ మహేశ్వరితోపాటు జస్టిస్ సంజీవ్‌ఖన్నాను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నియమించారని తెలుపుతూ బుధవారం సాయంత్రం ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఇద్దరి నియామకంతో సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య 28కి పెరుగగా, మరో మూడు ఖాళీలున్నాయి. ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ దినేశ్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలకు పదోన్నతి కల్పించాలని ఈ నెల 11న కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. జస్టిస్ ఖన్నాకు పదోన్నతి కల్పించాలన్న ప్రతిపాదనను బార్ కౌన్సిల్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆయనకన్నా సీనియర్లుగా ఉన్న జడ్జీలను ఇది అవమానించడమేనని, వారి నైతిక స్థైర్యం దెబ్బతింటుందని పేర్కొంది. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ కూడా ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ కొలీజియంలోని ఇతర న్యాయమూర్తులకు ఒక లేఖ రాశారు. జడ్జీల సీనియారిటీ లిస్టులో జస్టిస్ ఖన్నా 33వ స్థానంలో ఉన్నారు.

డీజీపీల ఎంపికపై సవరణలకు నో

- ఐదు రాష్ట్ర ప్రభుత్వాల పిటిషన్లను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: రాష్ట్రాల డీజీపీల నియామకంపై ఐదు రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది. పోలీసులపై రాజకీయ, కార్యనిర్వాహక జోక్యం నిరోధానికి.. డీజీపీ కనీస పదవీకాలం రెండేండ్లుగా నిర్దేశించడంతోపాటు పలు సంస్కరణలు తేవాలని 2006న, డీజీపీ ఎంపిక ప్రక్రియపై గతేడాది జూలై 3న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో సవరణలు చేయాలని పంజాబ్, పశ్చిమబెంగాల్, కేరళ, బీహార్, హర్యానా ప్రభుత్వాలు న్యాయస్థానాన్ని అభ్యర్థించాయి. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్‌లు ఎల్ నాగేశ్వర్‌రావు, ఎస్కే కౌల్‌లతో కూడినధర్మాసనం..రాజకీయ, కార్యనిర్వాహక వర్గం జోక్యం నివారణ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం డీజీపీల పదవీకాలం, ఎంపికపై మార్గదర్శకాలు జారీ చేశామని పేర్కొంది.

'బ్రెగ్జిట్'కు చుక్కెదురు

- ప్రధాని థెరెసా మే ప్రతిపాదించిన ఒప్పందాన్ని అడ్డుకున్న ఎంపీలు
- ప్రభుత్వంపై అవిశ్వాసం ప్రవేశపెట్టిన ప్రతిపక్షం



థెరెసా మే

లండన్, జనవరి 16: బ్రెగ్జిట్ ఒప్పందం విషయంలో బ్రిటన్ ప్రధాని థెరెసా మే ఘోర అవమానాన్ని ఎదుర్కొన్నారు. బ్రెగ్జిట్‌పై ఆమె ప్రతిపాదించిన ఒప్పంద పత్రం పార్లమెంట్‌లో వీగిపోయింది. థెరెసా సొంత పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులే ఆమె ప్రతిపాదించిన ఒప్పందానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఒప్పందం ఆమోదం పొందడానికి 230 ఓట్లు కావాల్సి ఉండగా, 432 ఓట్లు వ్యతిరేకంగా 202 ఓట్లు అనుకూలంగా వచ్చాయి. ఆధునిక చరిత్రలో ఓ బ్రిటన్ ప్రధాని ఇంత పెద్ద ఓటమిని ఎదుర్కోవడం ఇదే మొదటిసారి. ఈ పరిణామం జరిగిన నిమిషాల వ్యవధిలోనే ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. దిగువ సభలో లేబర్ పార్టీ నాయకుడు జెరిమీ కార్బిన్ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి ఇతర ప్రతిపక్ష సభ్యులు మద్దతు తెలిపారు. బ్రెగ్జిట్‌పై థెరెసా మే ఓటమి పెద్ద విపత్తు వంటిదని కార్బిన్ పేర్కొన్నారు. ఆమె రూపొందించిన బ్రెగ్జిట్ ఒప్పందం అత్యంత లోపభూయిష్టమైనదని, బ్రిటన్‌ను గుడ్డిగా చీకటిలోకి నడిపించేదిగా ఉందని విమర్శించారు. 28 సభ్య దేశాలున్న ఐరోపా యూనియన్ (ఈయూ) నుంచి వైదొలిగేందుకు వచ్చే మార్చి 29 వరకు బ్రిటన్‌కు గడువు ఉంది. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలిగే అంశంపై మరోసారి రిఫరెండం నిర్వహించాలని కొందరు ఎంపీలు కోరుతుండగా, ఐరోపాతో సన్నిహిత సంబంధాలు ఉండాల్సిందేనని మరికొందరు కోరుతున్నారు. బ్రెగ్జిట్‌ను ఆపివేయాలని లేదా ఎటువంటి ఒప్పందం లేకుండానే వైదొలగాలని మరికొందరు సూచిస్తున్నారు. గత నెలలో సొంత పార్టీ (కన్జర్వేటివ్)లోనే అవిశ్వాసాన్ని ఎదుర్కొన్న ప్రధాని థెరెసా మే బ్రెగ్జిట్‌కు సంబంధించి ఓ ప్రత్యామ్నాయ ప్రణాళికతో పార్లమెంట్‌కు వస్తానని చెప్పారు. బ్రెగ్జిట్‌ను సమర్థిస్తున్న కన్జర్వేటివ్ ఎంపీలు ప్రధాని రూపొందించిన ఒప్పందాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నారు. అదే సమయంలో కరుడుగట్టిన వామపక్షవాది అయిన కార్బిన్ నేతృత్వంలో లేబర్‌పార్టీ ప్రభుత్వం ఏర్పడటం కూడా తమకు ఇష్టం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో థెరెసా మే అవిశ్వాస తీర్మానం నుంచి గట్టెక్కవచ్చని బ్రిటన్ మీడియా పేర్కొంది.



తులిప్ సిద్దిక్

ప్రసవ సమయం దగ్గరకు వచ్చిన లేబర్ పార్టీ ఎంపీ తులిప్ సిద్దిక్ (36) డాక్టర్ల సలహాలను బేఖాతరు చేస్తూ పార్లమెంట్‌కు వచ్చి బ్రెగ్జిట్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై కూడా ఓటు వేసేందుకు మరోసారి పార్లమెంట్‌కు వస్తానని ఆమె చెప్పారు. బుధవారం ఉదయం సిజేరియన్ ఆపరేషన్ ద్వారా ఆమె ప్రసవానికి వైద్యులు ఏర్పాటు చేయగా, ఓటు వేసేంత వరకు ఆగాల్సిందేనని ఆమె తేల్చి చెప్పారు.

అమిత్‌షా సూచన మేరకే

ప్రశాంత్ కిషోర్‌కు జేడీయూలో చోటు: నితీశ్

పాట్నా, జనవరి 16: బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఒకటికి రెండుసార్లు సూచించినందునే ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌కు తమ పార్టీలో చేర్చుకున్నామని జనతాదళ్ (యూ) నాయకుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ వెల్లడించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో పార్టీలోకొచ్చిన ప్రశాంత్ కిషోర్‌కు స్వల్ప వ్యవధిలోనే పార్టీ ఉపాధ్యక్ష పదవిని కట్టబెట్టారు. ప్రశాంత్‌ను మీ రాజకీయ వారసునిగా పరిగణిస్తారా అన్న విలేకరుల ప్రశ్నకు నితీశ్ పై విధంగా సమాధానమిచ్చారు. ప్రశాంత్ తమకు కొత్త కాదని, 2015లో కూడా తమతో కలిసి పనిచేశారని గుర్తు చేశారు.

అమిత్‌షాకు స్వైన్‌ఫ్లూ: బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాకు స్వైన్‌ఫ్లూ సోకినట్టు ఢిల్లీలోని ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. చికిత్స నిమిత్తం ఆయనను బుధవారం సాయంత్రం ఎయిమ్స్‌లో చేరారు. తనకు స్వైన్‌ఫ్లూ సోకిందని, చికిత్స కొనసాగుతున్నదని, త్వరలోనే కోలుకోగలనని ఆశాభావం వ్యక్తం చేస్తూ అమిత్‌షా ట్వీట్ చేశారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆర్టీసీ బస్సు

రోడ్డు ప్రమాదంలో

నలుగురు దుర్మరణం

మహారాష్ట్రలో దారుణం

నాగ్‌పూర్: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రాష్ట్ర ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో నలుగురు మరణించారు. ఈ దుర్ఘటన బుధవారం ఉదయం గడ్చిరోలి జిల్లాలోని గురిపల్లి గ్రామం సమీపంలో చోటుచేసుకుంది. ఎక్కువ మంది పాఠశాల విద్యార్థులతో ప్రయాణిస్తున్న బస్సు గురిపల్లి గ్రామం సమీపంలోకి చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొన్నది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న వారిలో నలుగురు మరణించగా, అందులో ఓ విద్యార్థి ఉన్నాడు. గాయపడిన వారిని సమీప దవాఖానకు తరలించారు.

కెన్యాలో ఉగ్రదాడి.. 15 మంది మృతి

నైరోబి: కెన్యా రాజధాని నైరోబిలోని ఓ హోటల్‌పై ఉగ్రవాదులు దాడి చేయడంతో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దుసిత్‌డీ2 హోటల్‌లో చోటుచేసుకుంది. మంగళవారం నలుగురు ఉగ్రవాదులు హోటల్ బయట ఉన్న పార్కింగ్ స్థలంలో బాంబులు విసిరారు. అనంతరం ఓ ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఉగ్రవాదుల దాడి విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఆ హోటల్‌ను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఉగ్రవాదులకు మధ్య మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఎదురుకాల్పులు జరిగాయి. హోటల్‌లో ఉన్న వారిలో దాదాపు 100 మందిని పోలీసులు రక్షించారు.

నటుడు బ్రహ్మానందంకు అస్వస్థత



సినిమా డెస్క్: ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం ఆదివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన ముంబైలోని ఏహెచ్‌ఐ (ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్)కు తరలించినట్టు ఆయన సన్నిహితులు వెల్లడించారు. సోమవారం డాక్టర్ రమాకాంత్ పాండా ఆధ్వర్యంలో బ్రహ్మానందంకు హార్ట్ సర్జరీ చేసినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఆయన కోలుకొంటున్నారు. బ్రహ్మానందం త్వరగా కోలుకోవాలని అభిమానులు ట్వీట్లు చేస్తున్నారు. కుటుంబసభ్యులు ప్రస్తుతం ఆయన వెంటే ఉన్నారు.

ఇంటర్న్‌షిప్ చేస్తేనే మెడికల్ కౌన్సిల్‌లో ఎంట్రీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఎంబీబీఎస్ అభ్యసిస్తున్నవారికి ఏడాది కాలంపాటు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి అని, ఆ సర్టిఫికెట్ లేనివారికి మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేయకుండా నియంత్రించనున్నట్టు తెలంగాణ వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ రమేశ్‌రెడ్డి స్పష్టంచేశారు. కొందరు ఇంటర్న్‌షిప్ చేయకుండానే సర్టిఫికెట్లు పొందుతున్నట్టు తమకు సమాచారం అందిందని, వారిపై చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు.

ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫిబ్రవరి 1నుంచి 20 వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి. హాల్‌టికెట్లను ఇంటర్‌బోర్డు కాలేజీలవారీగా జారీచేస్తున్నది. దాదాపు నాలుగు లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు బోర్డు అధికారులు తెలిపారు. మాన్యువల్ ప్రశ్నపత్రానికి స్వస్తిపలికి.. ఆన్‌లైన్ ప్రశ్నపత్రం విధానాన్ని అమలుచేస్తున్నారు. పరీక్ష ముగిసిన గంటలోపే మార్కులను బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.


నకిలీ వార్తలను గుర్తించేందుకు ప్రయోగం

ఫేక్-ఓ-మీటర్‌ను తయారుచేసిన ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ పరిశోధకులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సోషల్ మీడియాలో నకిలీవార్తల ప్రచారాన్ని నియంత్రించడానికి ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, గ్రామెనర్ అనే డాటా విజువలైజేషన్ స్టార్టప్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఫేక్-ఓ-మీటర్ అనే సాధనాన్ని కనిపెట్టినట్టు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ వాసుదేవవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కలర్‌కోడ్ ద్వారా ట్వీట్స్, న్యూస్, ఆర్టికల్స్ ప్రామాణికతను ఈ పేక్-ఓ-మీటర్ గుర్తిస్తుందన్నారు. దీనిద్వారా స్పానిష్, చైనీస్ భాషల్లోనూ నకిలీవార్తలను గుర్తించవచ్చని పేర్కొన్నారు.

మొదలి నాగభూషణశర్మ అస్తమయం

- చిన్నబోయిన రంగస్థలం
- సేవలను గుర్తుచేసుకొన్న కళాభిమానులు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/తెలుగు యూనివర్సిటీ: ప్రముఖ రంగస్థలనటుడు, దర్శకుడు, నాటకకర్త, అధ్యాపకుడు, విమర్శకుడు, పరిశోధకుడు ప్రొఫెసర్ మొదలి నాగభూషణశర్మ బుధవారం తెనాలిలో కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. గుంటూరు జిల్లా ధూలిపూడి గ్రామానికి చెందిన కామేశ్వరమ్మ, సుబ్రహ్మణ్యశర్మ దంపతులకు 1936, జూలై 24న నాగభూషణశర్మ జన్మించారు. తండ్రి సుబ్రహ్మణ్యశర్మ నాటక రచయిత, ప్రయోక్త, కథారచయిత కావడంతో.. ఆయన స్ఫూర్తితో తండ్రి బాటలో నడిచారు. కళాశాల రోజుల్లోనే బందరులో కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్రను పోషించి ప్రసిద్ధుడయ్యారు. శర్మ తొలిసారిగా రచించిన 'అన్వేషణ' 1954లో భారతిలో ప్రచురితమైంది. ఉస్మానియా నుంచి ఎంఏ ఇంగ్లిష్ సాహిత్య పట్టభద్రుడైన శర్మ.. అమెరికా ఇల్లినాయిస్ వర్సిటీలో నాటక దర్శకత్వంలో ఎంఎఫ్‌ఏ పట్టా పొందారు. నాటకమే ప్రధానాంశంగా డాక్టరేట్ అందుకొన్నారు. ఓయూలో ఇంగ్లిష్, నాటక శాఖల్లో ఆచార్యుడిగా పనిచేశారు. ఈయన రాసిన నవల, నాటక సాహిత్యానికి చెందిన అనేక పరిశోధనాత్మక వ్యాసాలు పలు పత్రికల్లో అచ్చయ్యాయి. దివిజిట్, కింగ్ ఈడిపస్, హయవదన, తుగ్లక్, మృచ్ఛకటిక, వెయిటింగ్ ఫర్ గోడో.. తదితర నాటకాలకు దర్శకత్వం వహించి హైదరాబాద్ డ్రమాటిక్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. అడ్డదారి, పెళ్ళికి పదినిమిషాల ముందు, మదనకామరాజు కథ, ప్రజానాయకుడు ప్రకాశం వంటి స్వతంత్ర నాటకాలను, యాంటిగని, మాక్‌బెత్, ఎనిమీ ఆఫ్ ది పీపుల్, ఎంపరర్ జోన్స్, కాయితంపులి, హయవదన, సాంబశివ ప్రహసనం వంటి పాశ్చాత్య, భారతీయ ప్రముఖ నాటకాలను స్వేచ్ఛానువాదం చేశారు.

శర్మ మృతి నాటక రంగానికి తీరని లోటు

తెలుగు సాహిత్యం, నాటకరంగం, రచన, దర్శకత్వం, విమర్శ, పరిశోధనలో ప్రామాణిక జీవితాన్ని విలువలతో గడిపిన ఉత్తముడు మొదలి నాగభూషణశర్మ అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి కొనియాడారు. ఆయన మరణం తెలుగు నాటకరంగానికి తీరని లోటని అన్నారు. రసరంజని సంస్థకు 26 ఏండ్లు కార్యనిర్వాహక అధ్యక్షులుగా పనిచేసి వ్యవస్థగా రూపకల్పన చేసిన ఆయనకు రసరంజని అధ్యక్షుడిగా కృతజ్ఞతలు తెలుపుకోవడం నాబాధ్యత. ఆయన ప్రతిభ నాటకరంగంలో జ్యోతిలా వెలుగుతుందని కొనియాడారు.

సంచార విజ్ఞాన సర్వస్వం

నాటక ప్రయోక్త ఆచార్య మొదలి నాగభూషణశర్మ మృతి పట్ల తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. సంస్కృతం, తెలుగు, ఆంగ్లభాషల్లో అపారమైన పాండిత్యం కలిగిన సంచార విజ్ఞాన సర్వస్వం అనదగిన వ్యక్తి అని కొనియాడారు. విషయ పరిజ్ఞానం పెరుగుదలకు మౌలిక పరిశోధన అత్యంత అవసరమని హితబోధ చేసిన గొప్ప పరిశోధనావేత్త అన్నారు. టీయూకి ఆయన సేవలు అనిర్వచనీయమైనవని అన్నారు.

సురభి సమాజాలకు ఆత్మబంధువు

నాటకరంగంలో నటుడిగా, రచయితగా, దర్శకుడిగా, ప్రయోక్తగా, అధ్యాపకుడిగా, కళావిమర్శకుడిగా, నాటక, నృత్య, జానపద కళా పరిశోధకుడిగా, సాహితీవేత్తగా బహుముఖ ప్రతిభతో అర్ధ శతాబ్దానికి పైగా తెలుగు సాంస్కృతికరంగ వికాసానికి మొదలి నాగభూషణశర్మ అందించిన సేవలు అనితర సాధ్యమైనవని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య తెలిపారు. సురభి నాటక సమాజాలకు ఆత్మబంధువుగా, సురభి సంస్థ జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి పొందడానికి తనవంతు విశేష సేవలందించారని కొనియాడారు.

సుందిళ్ల మోటర్లు సిద్ధం

- 25న ఒకటి.. వచ్చేనెల 25న మరో మోటర్ డ్రైరన్
- ఏప్రిల్‌లో వెటరన్ నిర్వహించేలా ఏర్పాట్లు
- శరవేగంగా కాళేశ్వరం ప్రాజెక్టు పనులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ జీవధార కాళేశ్వరం ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే వానకాలం వరకు ఆయకట్టుకు నీరందించేలా పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈ నెల ప్రారంభంలోనే ప్రాజెక్టును పరిశీలించి.. పనుల్లో వేగంపెంచాలని ఆదేశాలిచ్చారు. ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న సుందిళ్ల బరాజ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. పంప్‌హౌస్‌లో రెండు మోటర్ల బిగింపు కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఇందులో ఒక మోటర్ డ్రైరన్‌ను ఈ నెల 25న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు. వచ్చేనెల 25న మరో మోటరు డ్రైరన్ చేయాలని నిర్ణయించారు. ఏప్రిల్‌లో వెటరన్ ఉండే అవకాశం ఉన్నదని ఇంజినీరింగ్ అధికారులు చెప్తున్నారు. సుందిళ్ల బరాజ్ ఎర్త్‌వర్క్స్‌లో సైడ్‌బండ్స్ పనుల్లో లక్ష క్యూబిక్ మీటర్ల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు మూడు షిఫ్టుల్లో పనులు చేయిస్తున్నారు. వచ్చేనెలకల్లా ఈ పనులు పూర్తి చేయనున్నారు. బరాజ్‌కు మొత్తం 74 గేట్లు బిగించగా.. అన్నింటినీ లిఫ్ట్‌చేసి వరదలు వచ్చినప్పుడు నీళ్లను కిందకు వదిలేలా సిద్ధంగా ఉంచారు. వంతెనపై 74 స్లాబ్‌లకుగాను 61 స్లాబులు పూర్తిచేశారు. అన్నారం పంప్‌హౌస్‌లో 8 మోటర్లలో ఇప్పటికే నాలుగింటిని బిగించారు. మిగిలిన నాలుగు మోటర్లు వచ్చేనెలలోపు బిగించేందుకు సిద్ధంచేశారు. మేడిగడ్డ పనులు రికార్డు సృష్టిస్తున్నాయి. మేడిగడ్డ బరాజ్ మట్టిపనులు చివరిదశకు చేరుకున్నాయి. 54.44 లక్షల క్యూబిక్ మీటర్లకుగాను ఇప్పటికే 53.27 లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. 17.89 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనుల్లో.. మూడున్నర లక్షల క్యూబిక్ మీటర్ల పనులు మాత్రమే చేయాల్సి ఉన్నది. ఈ పనులతోపాటుగా సైడ్‌బండ్స్, రివిట్‌మెంట్ పనుల్లో వేగంపెంచారు. ఏప్రిల్ నాటికి మొత్తం మూడు బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు సిద్ధంచేసి, కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బరాజ్ వరకు నీటిని ఎత్తిపోస్తామని తెలిపారు.

సుస్థిర వ్యవసాయానికి

పరిశోధనలు అవసరం

- రాష్ట్ర వ్యవసాయశాఖకు ఈపీటీఆర్‌ఐ సూచనలు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: వాతావరణ మార్పులను తట్టుకునేలా సుస్థిర వ్యవసాయానికి తగిన అన్ని పరిశోధనలూ చేయాల్సిన అవసరం ఉన్నదని పర్యావరణ రక్షణ, శిక్షణా పరిశోధన సంస్థ (ఈపీటీఆర్‌ఐ) స్పష్టం చేసింది. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, విపరీతంగా రసాయనిక ఎరువుల వినియోగం యాసంగి పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని గుర్తించింది. రసాయనిక ఎరువుల స్థానంలో బయోఫెర్టిలైజర్స్ వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణశాఖ తెలంగాణలో వాతావరణమార్పులపై కార్యాచరణ నివేదికను సమర్పించడంతోపాటు, రాష్ట వ్యవసాయశాఖకు పలు సూచనలు ఇచ్చింది. రైతులందరికీ సకాలంలో పంట రుణాలు అందించాలని, ఈ సౌకర్యం కౌలు రైతులకూ అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది. నష్టం వాటిల్లిన ప్రతిపంటకు బీమా కింద పరిహారం వచ్చేలా రైతుల్లో చైతన్యం తేవాలని పేర్కొంది. పంటల సాగు విధానంలో మార్పులు తేవాలని సూచించింది. ఎరువులు, పురుగుల మందులు ఎక్కువగా వినియోగించడంతోనే భూసారం దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేసింది.

సీఎల్పీ నేతగా భట్టి?

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష నేతగా మల్లు భట్టివిక్రమార్కను ఎన్నుకునేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు బుధవారం రాత్రి హైదరాబాద్‌లో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కోర్‌కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల అభిప్రాయాలను అధిష్ఠానం తెలుసుకున్నది. ఈ మేరకు సీఎల్పీ నేతను ఎన్నుకునేందుకు ఒక అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. సీఎల్పీ నేతగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు పేర్లు పరిశీలనకు వచ్చినట్టు సమాచారం.

టీడీఎల్పీ ఎన్నిక కూడా నేడే..: అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో గెలిచిన టీడీపీ కూడా ఎల్పీ సమావేశాన్ని గురువారం నిర్వహిస్తుంది. ఈ సమావేశంలో టీడీఎల్పీ నేతను కూడా ఎన్నుకోనుంది.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
మంచిర్యాల	10.0	27.3
ఆసిఫాబాద్	10.0	27.3
ఆదిలాబాద్	10.0	27.3
మెదక్	10.9	32.7
సిద్దిపేట	10.9	34.3
నాగర్‌కర్నూల్	10.9	34.6
వికారాబాద్	11.4	29.1
సంగారెడ్డి	11.7	33.5
మహబూబ్‌నగర్	11.8	34.6
నిర్మల్	12.0	28.0
కామారెడ్డి	12.0	28.0
మహబూబాబాద్	12.4	35.5
యాదాద్రి	12.5	34.6
పెద్దపల్లి	12.6	29.6
జనగామ	12.9	32.8
కరీంనగర్	13.0	34.0
సూర్యాపేట	13.0	29.0
జగిత్యాల	13.0	32.0
జయశంకర్	13.0	31.0
జోగుళాంబ గద్వాల	13.7	32.9
రంగారెడ్డి	14.0	31.0
వరంగల్ రూరల్	14.0	30.0
వరంగల్ అర్బన్	14.5	28.0
వనపర్తి	14.5	34.6
హైదరాబాద్	15.0	30.1
మేడ్చల్ మల్కాజిగిరి	15.0	30.1
నిజామాబాద్	15.6	29.5
భద్రాద్రి కొత్తగూడెం	17.0	32.0
నల్లగొండ	17.4	30.4
ఖమ్మం	18.0	31.0
రాజన్న సిరిసిల్ల	23.0	30.0

కొనసాగుతున్న


చలి తీవ్రత

మరో రెండ్రోజులు పొడివాతావరణమే

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉత్తర, ఆగ్నేయ దిశనుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురు, శుక్రవారాల్లో పొడివాతావరణమే ఉండే అవకాశం ఉన్నట్టు చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రిపూట పొగమంచు కురిసే అవకాశం ఉన్నదన్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతల్లోనూ స్వల్పంగా పెరుగుదల నమోదయ్యే అవకాశం ఉన్నదని చెప్పారు. బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. హైదరాబాద్‌లో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఆవులు, బర్రెల అభివృద్ధి కోసం బ్రెజిల్‌తో ఒప్పందం

- సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం బదిలీకి అవకాశం
- పెరుగనున్న పాల ఉత్పత్తి..11 లక్షల పాడి రైతులకు మేలు



బుధవారం పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఆవులు, బర్రెల అభివృద్ధిపై అవగాహన ఒప్పందం చేసుకుంటున్న తెలంగాణ రాష్ట్రం, బ్రెజిల్ దేశానికి చెందిన ప్రతినిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆవులు, బర్రెల అభివృద్ధి కోసం రాష్ట్ర పశుసంవర్ధకశాఖ బ్రెజిల్ దేశానికి చెందిన 'ఎంబ్రాఫ అమజానియా ఓరియంటల్, పీఏ సంస్థతో బుధవారం ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. బ్రెజిల్ 1908 నుంచి భారతదేశానికి చెందిన ఉత్తమ జాతులైన గిర్, సాహీవాల్, కంక్రేజ్, ఒంగోలు జాతి పశువులు రోజుకు 75లీటర్లు, ముర్రా జాతి బర్రెలు 45 లీటర్లు పాలు ఇచ్చే విధంగా జన్యుపరంగా అభివృద్ధి చేసింది. ఈ ఒప్పందం ప్రకారం మేలైన జాతులకు సంబంధించిన ఘనీకృత వీర్యం, దానికి సంబంధించిన ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం బదిలీ చేసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా రాష్ట్రంలోని 11 లక్షల మంది పాడి రైతులు లాభం పొందనున్నారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. ఈ సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సంచాలకుడు డాక్టర్ డీ వెంకటేశ్వర్లు, బ్రెజిల్ ప్రతినిధులు డాక్టర్ టార్సీసియో క్రుజ్‌మెస్కీటా, బ్రెజిల్ పశుసంవర్ధకశాఖ ప్రతినిధి జోస్ రిబామార్ ఎఫ్ మెర్క్యూస్, బఫెలో పరిశోధన, అభివృద్ధి సంస్థ సాంకేతిక డైరెక్టర్ గిల్హెర్మే మిన్సెస్, అంకుశ్ సంస్థ ప్రతినిధి బీ వేణుగోపాల్, వ్యవసాయ, పశుసంవర్ధక ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాన్యుడికి 'డబ్బుల్ ధమాకా'!

- ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రెట్టింపు చేసే దిశగా కేంద్రం కసరత్తు
- రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపు
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కమలనాథుల వ్యూహం
- ఉద్యోగులు, మధ్య తరగతి లక్ష్యంగా పావులు



న్యూఢిల్లీ, జనవరి 16: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా రెండోసారి అధికారపగ్గాలు చేపట్టాలన్న కసితో ఉన్న బీజేపీ తన అమ్ములపొదిలో నుంచి మరో అస్త్రాన్ని తీసింది. ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజల్ని ఆకర్షించేందుకు 'డబుల్ బొనాంజా' ప్రకటించనున్నది. ప్రస్తుతం ఏటా రూ.2.5 లక్షలు ఉన్న ఆదాయం పన్ను (ఐటీ) మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచనున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఈ అంశాన్ని ప్రస్తావించే అవకాశం ఉంది. 2018లో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నప్పుడు ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలపై జైట్లీ ఏ వరాల జల్లు కురిపించలేదు. రవాణా, వైద్యం ఖర్చుల్లో రూ.40వేల వరకు మినహాయింపు నిచ్చారు. 2017లో కింది శ్లాబ్‌లో పన్ను రేటును మాత్రం తగ్గించారు. అప్పటివరకు రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల శ్లాబ్‌కు 10% పన్ను ఉండగా, దాన్ని ఐదు శాతానికి తగ్గించారు. రూ.2.5 లక్షల లోపు వార్షికాదాయం గల వారికి ఐటీ నుంచి మినహాయింపునిచ్చారు. ప్రస్తుతం రూ.5లక్షల నుంచి రూ.10లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారికి 20%, రూ.10 లక్షల వార్షిక ఆదాయం దాటిన వారికి 30% పన్ను విధిస్తున్నారు. ఐటీ మినహాయింపుపై కేంద్రం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం ఉందని ఉన్నతాధికార వర్గాలు తెలిపాయి.

ఈబీసీ రిజర్వేషన్ల కోసం..
విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు పెంపు!

- 2019-20 విద్యా సంవత్సరం నుంచి 10 శాతం రిజర్వేషన్ అమలు
- కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడి
- జార్ఖండ్‌లోనూ ఈబీసీ కోటా ప్రారంభం



న్యూఢిల్లీ/రాంచీ: జనరల్ క్యాటగిరీకి చెందిన ఆర్థికంగా వెనుకబడిన వారికి(ఈబీసీ) రిజర్వేషన్లు కల్పించడానికి తీసుకొచ్చిన బిల్లు చట్టంగా మారడంతో ఇక దాని అమలు దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నది. 2019 నుంచి అమలు చేయనున్నామని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ మంగళవారం మీడియాకు తెలిపారు. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లను పెంచనున్నామన్నారు. తన శాఖ ఉన్నతాధికారులు, యూజీసీ, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అధికారులతో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 'ఈ రిజర్వేషన్ల అమలుతో ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు ఆటకం కలుగకుండా ఉండేందుకు వర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థల్లో 25% సీట్లను పెంచాలని నిర్ణయించాం. తద్వారా ఎవరికీ అన్యాయం జరుగదు. దేశంలోని 900 యూనివర్సిటీలు, 40వేల కళాశాలల్లో రిజర్వేషన్లు అమలు చేయనున్నాం' అని అన్నారు. 25% సీట్ల పెంపుతో మొత్తం సీట్ల సంఖ్య ఎంత వరకు చేరుకుంటుందన్న విషయాన్ని త్వరలో చెబుతామన్నారు. 'ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ల అమలు ప్రక్రియను త్వరలో ప్రకటిస్తాం. కళాశాలలు, యూనివర్సిటీలు కూడా ఈ రిజర్వేషన్లను తమ ప్రవేశాల ప్రక్రియలో పొందుపర్చాలి' అనిసూచించారు. ఈ 10 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈబీసీలకు విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని జార్ఖండ్ సీఎం రఘుబర్ దాస్ ప్రకటించారు. 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తీసుకొచ్చిన చట్టానికి అనుగుణంగా తాము చర్యలు చేపట్టామని తెలిపారు.

50 కోట్ల జామీనాపై
విడుదలైన రాజేంద్ర బోత్రా

అమెరికా హెల్త్‌కేర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత సంతతి వ్యక్తి



హూస్టన్, జనవరి 16: అమెరికా హెల్త్ కేర్ కుంభకోణంలో నిందితుడిగా ఉన్న భారత సంతతి వ్యక్తి డాక్టర్ రాజేంద్ర బోత్రా రూ.50 కోట్ల జామీనాపై విడుదలయ్యాడు. రూ.3300 కోట్ల హెల్త్ కేర్ కుంభకోణంలో రాజేంద్రతోపాటు మరో ఐదుగురు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అంతేగాక రాజేంద్ర విపరీతంగా మాదకద్రవ్యాలను విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భారీ మొత్తంలో నగదును దాచిపెట్టినట్లు కూడా ఆయనపై కేసు నమోదైంది. ఆయనను విడుదల చేయవద్దంటూ పలువురు కోర్టును కోరినా.. న్యాయమూర్తి మాత్రం విముక్తి కల్పించారు. రాజేంద్ర జామీనుపై విడుదలైనప్పటికీ జీపీఎస్ ద్వారా ఆయన కదలికలను నిత్యం పోలీసులు పర్యవేక్షిస్తారు. రాజేంద్రకు భారత ప్రభుత్వం 1999లో పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది.

జనజాతర

- అట్టహాసంగా ప్రారంభమైన కుంభమేళా
- 2 రోజుల్లో 2.2 కోట్ల మంది పుణ్యస్నానాలు
- అఖారాలు, నాగ సాధువులు, స్వామిజీల సందడి



పవిత్రస్నానాలు చేసేందుకు కుంభమేళాకు తరలివస్తున్న సాధువులు

జనసంద్రంగా మారిన త్రివేణి సంగమం

ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్), జనవరి 16: ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుక కుంభమేళా మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా అట్టహాసంగా ప్రారంభమైంది. నాగ సాధువుల ఓంకార నాదం, సాధుసంతుల నృత్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆధ్యాత్మిక నగరి అలహాబాద్ (ప్రయాగ్‌రాజ్) హోరెత్తింది. 'హర్ హర్ గంగే' నినాదాలతో దద్దరిల్లింది. కోట్ల మంది భక్తుల రాకతో గంగా, యమున, సరస్వతి నదుల సంగమ స్థానమైన పావన త్రివేణి సంగమం కిటకిటలాడింది. దారులన్నీ జనసంద్రాన్ని తలపించాయి. స్వామీజీల నుంచి సాధారణ భక్తుల వరకూ అంతా అక్కడికే క్యూ కట్టారు. పుణ్య స్నానాలు ఆచరించి భక్తిపారవశ్యంలో మునిగి తేలుతున్నారు. కాషాయ ధ్వజాలతో నగర వీధులన్నీ సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఈ నెల 15న మొదలైన ఈ జన జాతర మార్చి 4 వరకు సుమారు 50 రోజులు సాగనున్నది. కుంభమేళాకు వచ్చే భక్తజనం కోసం సంగమం వద్ద 'కుంభ్‌నగరి' పేరుతో ప్రత్యేక కుటీరాలు నిర్మించారు.

భక్తులను చూసి 'చలి' భయపడింది!

గడ్డ కట్టే చలిని సైతం లెక్కచేయకుండా సూర్యోదయానికి ముందే మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా తొలి రోజు మంగళవారం రికార్డు స్థాయిలో భక్తులు త్రివేణి సంగమంలో షాహీ (రాజయోగ) పుణ్యస్నానాలు చేశారు. మంగళ, బుధవారాల్లో మొత్తం 2.2 కోట్ల మంది స్నానమాచరించినట్లు అంచనా. ప్రఖ్యాతిగాంచిన 13 అఖారాల సాధువులు (శైవ-7, వైష్ణవ-3, ఉదాసిన-2, సిక్కు-1) తమ భక్తజన బృందం తో వేలాదిగా తరలివచ్చి స్నానం చేశారు. వాయిద్యాల హోరు లో నృత్యాలతో ఆయుధాలు ప్రదర్శిస్తూ సందడి చేశారు. త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేసేందుకు ఒక్కో అఖారాకు యూపీ సర్కార్ 45 నిమిషాలు కేటాయించింది. పురాతన, అతి పెద్ద అఖారా జునా అఖారా తొలి స్నానం ఆచరించింది. బుధవారం సుమారు కోటి మందికిపైగా భక్తులు స్నానాలు చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా జునా అఖారా అధ్యక్షుడు మహంత్ హరిగిరి మాట్లాడుతూ.. 'మకర సంక్రాంతి పర్వదినం మాకు ఎంతో పవిత్రమైంది. ఇక్కడి నుంచి చలి తగ్గి భానుడి ప్రకాశం పెరుగుతుంది. ప్రకృతి సరికొత్త శోభను సంతరించుకుంటుంది. భగవంతుడి ఆశీస్సులు అందరికీ లభిస్తాయి' అని పేర్కొన్నారు.

350 ఏండ్ల తర్వాత 'ప్రయాగ్‌రాజ్'లో..

శతాబ్దాల తర్వాత ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా నిర్వహించడం గర్వకారణమని యూపీ దేవాదాయ మంత్రి లక్ష్మినారాయణ్ చౌధరీ చెప్పారు. '350 ఏండ్ల క్రితం హిందూ సనాతన ధర్మానికి, సంస్కృతికి ప్రయాగ కేంద్రంగా ఉండేది. కానీ, ఆ తర్వాత నాటి పాలకులు ఈ నగరం పేరు అలహాబాద్‌గా మార్చారు. కానీ, గత ఏడాది యూపీ సీఎం అలహాబాద్ పేరును ప్రయాగ్‌రాజ్ అని మార్చారు. వేదాల్లోనూ ప్రయాగ ప్రస్తావన ఉంది. కుంభమేళాను ప్రపంచంలోనే అతి పెద్ద సాంస్కృతిక, వారసత్వ వేడుకగా 2017లో యునెస్కో గుర్తించింది' అని అన్నారు. ఈ జాతరను తిలకించేందుకు 172 దేశాల ప్రతినిధులు హాజరవుతారని మంత్రి చెప్పారు.

అసాధారణ ఏర్పాట్లు

కుంభమేళాకు యూపీ సర్కారు అసాధారణ ఏర్పాట్లు చేసింది. భారీ స్థాయిలో పోలీసు బలగాల్ని నియమించింది. వెయ్యికి పైగా సీసీటీవీ కెమెరాలు, 40వేల ఎల్‌ఈడీ లైట్లు, 11వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో 'స్వచ్ఛ కుంభ్' దళాన్ని ఏర్పాటు చేసింది. సుమారు లక్షకుపైగా తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించింది. 20వేలకు పైగా చెత్తను సేకరించే డబ్బాలు, 2వేల మందితో స్వచ్ఛ పదాతిదళాన్ని నియమించింది. శతాబ్దాల అనంతరం తొలిసారిగా అలహాబాద్ కోటలోని అక్షయ్ వత్ వృక్షం, సరస్వతి కూప్ (బావి)ని దర్శించుకునేందుకు అనుమతించారు. ఇందులో సరస్వతి నది జలాలు కనిపిస్తాయని భక్తులు విశ్వసిస్తారు.

అర్ధ కుంభమేళా కాదు.. కుంభ్/కుంభమేళా



గతంలో 12 ఏండ్లకోసారి జరిగే మేళాను కుంభమేళాగా పిలిచేవారు. ఆరేండ్లకోసారి జరిగే వేడుకను అర్ధ కుంభమేళాగా వ్యవహరించేవారు. అయితే, యూపీ సీఎం ఆదిత్యనాథ్ వీటికి సరికొత్త పేర్లు పెట్టారు. 12 ఏండ్లకోసారి జరిగే కుంభమేళాను మహాకుంభమేళాగా, ఆరేండ్లకోసారి జరిగే అర్ధ కుంభమేళాను కుంభ్/కుంభమేళాగా ప్రకటించారు. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లోనూ కుంభమేళాగానే పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న వేడుక అర్ధ కుంభమేళా. 2013లో త్రివేణిసంగమంలో మహాకుంభమేళా జరిగింది. ప్రపంచంలోనే ఇది గొప్ప ఆధ్యాత్మిక వేడుకని, తన జీవితంలో ఇంతమందిని ఒకేసారి, ఒకే వేదికపై చూడలేదని జర్మనీకి చెందిన మాన్యూల్ మాథ్యూస్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు.


ట్రాన్స్‌జెండర్స్‌కు తొలిసారిగా అవకాశం



లక్ష్మీనారాయణ్ త్రిపాఠి

కుంభమేళా చరిత్రలో తొలిసారి ట్రాన్స్‌జెండర్స్ (లింగమార్పిడి చేయించుకున్న వ్యక్తుల)కు ప్రాతినిధ్యం వహిస్తున్న 'కిన్నెర అఖారా'కు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించడంతోపాటు, స్నానాలకూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కిన్నెర అఖారా అధ్యక్షుడు మహామండలేశ్వర్ లక్ష్మినారాయణ్ త్రిపాఠి ఉబ్బ తబ్బిబయ్యారు. 'ఇది మా చరిత్రలోనే సువర్ణాధ్యాయం. ట్రాన్స్‌జెండర్, స్వలింగ సంపర్కులకు అనుకూలంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తర్వాత మాకు దక్కిన గొప్ప గౌరవం ఇది. మాకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించేందుకు అంగీకరించిన జునా అఖారాకు కృతజ్ఞతలు' అని చెప్పారు. సుమారు 20 లక్షల మంది ట్రాన్స్‌జెండర్లు పవిత్ర స్నానాలు చేస్తారని అంచనా.

ఖండాలు దాటి.. సాధువుగా మారి..



శ్రావణ్‌గిరి

ఆధ్యాత్మికతకు ఖండాలు అడ్డుకావని నిరూపించాడు ఆస్ట్రేలియా సాధువు శ్రావణ్ గిరి. సన్యాసిగా మారాక తన పేరును శ్రావణ్‌గిరిగా మార్చుకున్నారు. ప్రతి కుంభమేళాకు ఆయన తప్పకుండా భారత్‌కు వచ్చి నెలలపాటు ఇక్కడే ఉంటాడు. 1998లో తొలిసారి భారత్‌కు వచ్చినప్పుడు ఇక్కడి ఆధ్యాత్మిక వాతావరణం నచ్చి అనూహ్యంగా ఆయన సాధువుగా మారాడు. గుజరాత్‌లోని గిర్నార్ కొండల్లో కొలువైన దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నాక పూర్తిగా ఆధ్యాత్మికత బాటపట్టాడు. అనంతరం హిమాలయాలకు వెళ్లి కొంతకాలం గురువు మార్గదర్శకత్వంలో తపస్సు చేశాడు. ఆ తర్వాత జునా అఖారాలో సభ్యుడయ్యాడు. ఆస్ట్రేలియాలో తన ఇంటి ఆవరణలోని కుటీరంలో శ్రావణ్‌గిరి సాధు జీవితం గడుపుతుంటారు.

కుంభమేళాకు రూ.4,200 కోట్లు కేటాయించిన యూపీ సర్కార్

కుంభమేళా నిర్వహణకు యూపీ సర్కారు రికార్డు స్థాయిలో రూ.4,200 కోట్లు కేటాయించింది. 2013లో జరిగిన మహాకుంభమేళాకు కేటాయించిన మొత్తంతో పోలిస్తే ఇది మూడు రెట్లు ఎక్కువ. 'మహ కుంభమేళాకు గత సర్కార్ రూ.1,300 కోట్లు కేటాయించింది. కానీ, యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ ఏకంగా రూ.4,200 కోట్లు విడుదల చేశారు. గతంలో త్రివేణి సంగమం ఒడ్డున 3,953 ఎకరాల్లో భక్తులకు వసతి, ఇతర ఏర్పాట్లు చేయగా, ఈ దఫా 7,907 హెక్టార్లలో సకల వసతులు కల్పించాం' అని యూపీ ఆర్థికమంత్రి రాజేశ్ అగర్వాల్ చెప్పారు. మరోవైపు కుంభమేళాకు హిందీయేతర రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో వారి కోసం రైల్వేశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రైళ్ల రాకపోకల వివరాల్ని గుజరాతీ, మరాఠీ, కన్నడ, తమిళం, మలయాళం, ఇంగ్లిష్ భాషల్లో తెలియజేయనున్నట్లు ప్రకటించింది. తెలుగు, ఒరియా, బెంగాలీ భాషలను కూడా త్వరలో ఈ జాబితాలో చేర్చనున్నట్లు తెలిపింది.

ప్రత్యేక అలంకరణలో నాగసాధువులు

నాగ సాధువులు కుంభమేళా సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించుకుంటారు. ఈ అలంకరణ కొత్త పెళ్లి కూతురు తరహాలో ఉంటుంది. దీన్ని '17 శింగర్' అని పిలుస్తారు. నాగ సాధువులు మకర సంక్రాంతి (జనవరి 15), పౌష్ పూర్ణిమా (జనవరి 21), మౌని అమావాస్య (ఫిబ్రవరి 4), వసంత పంచమి (ఫిబ్రవరి 10), మాఘ పూర్ణిమ (ఫిబ్రవరి 19), మహాశివరాత్రి (మార్చి 4) పర్వదినాల్లో ప్రత్యేకంగా షాహీ స్నానాలు చేస్తారు. ఈ సందర్భాల్లో ప్రత్యేకంగా అలంకరించుకుంటారు. ఇది ఆధ్యాత్మికంగా, భౌతికంగా తమను తాము శుద్ధి చేసుకోవడమని వారు భావిస్తారు. ఆ తర్వాత ఒళ్లంతా బూడిద రాసుకోవడంతో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. షాహీ స్నానాలకు ముందు రోజు నాగ సాధువులు తమ దైవాన్ని ప్రార్థిస్తూ రాత్రంతా పూజలు చేస్తారు.

కన్నడ సర్కార్‌లో
కలకలం





- ప్రభుత్వానికి ఇద్దరు ఇండిపెండెంట్ల మద్దతు ఉపసంహరణ
- ఇది బీజేపీ కుట్ర.. భయమేమీ లేదంటున్న సీఎం కుమారస్వామి
- నేడు సీఎల్పీ అత్యవరసర భేటీ
- ప్రభుత్వం మైనారిటీలో పడిపోయిందన్న బీజేపీ



బెంగళూరు/న్యూఢిల్లీ: కర్ణాటకలోని ఏడు నెలల కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ సర్కార్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఇద్దరు స్వతంత్ర సభ్యులు ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నట్టు బుధవారం ప్రకటించారు. దీంతో ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేకున్నా.. ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా గోడ దూకేందుకు సిద్ధమన్న వార్తల నేపథ్యంలో కన్నడ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. రాణెబెన్నూర్ నుంచి ఎన్నికైన ఆర్ శంకర్, మూల్‌బగల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హెచ్‌నాగేశ్ కుమారస్వామి సర్కార్‌కు మద్దతును ఉపసంహరిస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నదని సీఎం హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడగలమన్న ఆయన విశ్వాసం చేశారు. బడ్జెట్ ప్రతిపాదనల సిద్ధం చేయడంలో తలమునకలై ఉన్న కుమారస్వామి తాను ప్రధాని మోదీని కలిసినట్టు, నలుగురు కాంగ్రెస్ మంత్రులు రాజీనామా చేసినట్టు వచ్చిన వార్తలను తోసిపుచ్చారు. కాంగ్రెస్-జేడీఎస్ సంబంధాలు పటిష్ఠమని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని స్పష్టం చేశారు. 'ప్రధానిని కలిసే ఆలోచన లేదు. కాంగ్రెస్ మంత్రులు రాజీనామా చేయడం లేదు. కాంగ్రెస్ లేదా జేడీఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలెవరూ బీజేపీలో చేరబోవడం లేదు' అని కుమారస్వామి అన్నారు. ముంబై వెళ్లిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తనతో చర్చిస్తూనే ఉన్నారని తెలిపారు. మరోవైపు తమపై వచ్చిన ఆరోపణలన్నింటినీ బీజేపీ తోసిపుచ్చింది. అంతర్గత కలహాలతో కాంగ్రెస్-జేడీఎస్ కూటమి ప్రభుత్వం కుప్పకూలే స్థితికి చేరిందని, వారికి మెజారిటీ లేదని బీజేపీ ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు అన్నారు.

నేడు సీఎల్పీ భేటీ

కర్ణాటకలో బీజేపీ తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బేరసారాలకు దిగిందన్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ గురువారం సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేసింది. సీఎల్పీ నేత సిద్ధరామయ్య అధ్యక్షతన గురువారం సాయంత్రం 3.30 గంటలకు సీఎల్పీ సమావేశం జరుగుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దరామయ్య చిక్కమగలూరులో విలేకరులతో మాట్లాడుతూ, 'వారికి (బీజేపీకి) ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదు. యెడ్యూరప్పకు వయస్సు పెరిగింది కానీ ఆయనకు మెదడు లేదు' అని మండిపడ్డారు. సోమవారం రాత్రి నుంచి తిష్టవేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ మనుగడపై గురువారం కల్లా ఒక స్పష్టత వస్తుందన్నారు. కాగా 104 మంది బీజేపీ ఎమ్మెల్యేలు బస చేసిన రిసార్ట్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం ధర్నాకు దిగారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మధ్యప్రదేశ్ ప్రభుత్వంలోనూ సంక్షోభం!

న్యూఢిల్లీ: కర్ణాటకలోని కుమారస్వామి ప్రభుత్వం కూల్చివేతకు బీజేపీ ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణల నేపథ్యంలో కమలనాథులు మధ్యప్రదేశ్‌లోని తమ సర్కార్‌కు కూడా ముప్పు తలపెట్టారని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. 15 ఏండ్లు మధ్యప్రదేశ్‌ను ఏలిన బీజేపీ ఇటీవలి ఎన్నికల్లో స్వల్ప తేడాతో అధికారాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే. 230 మంది సభ్యులున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీలో బీజేపీకి 109 మంది ఎమ్మెల్యేలున్నారు. 114 మంది సభ్యులున్న కాంగ్రెస్ నలుగురు ఇండిపెండెంట్లు, ఇద్దరు బీఎస్పీ, ఒక ఎస్పీ ఎమ్మెల్యే మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 'బీజేపీ ముందు తమ ఇంటిని కాపాడుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం గురించి వారికి చింత అక్కరలేదు' అని సీఎం కమల్‌నాథ్ హెచ్చరించారు.

శబరిమలపై
వారి వైఖరి సిగ్గుచేటు

- నాణేనికి రెండు ముఖాలు ఎల్డీఎఫ్, యూడీఎఫ్
- కేరళ పర్యటనలో ప్రధాని మోదీ విమర్శలు



అనంత పద్మనాభస్వామిని దర్శించుకొని వస్తున్న ప్రధాని మోదీ, కేరళ గవర్నర్ సదాశివం

కొల్లం: శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై కేరళలోని అధికార ఎల్డీఎఫ్, ప్రతిపక్ష యూడీఎఫ్ కూటములు అనుసరించిన వైఖరిని ప్రధాని నరేంద్రమోదీ దుయ్యబట్టారు. సీపీఎం నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం అనుసరించిన వైఖరి అత్యంత సిగ్గుచేటన్నారు. మహిళలు, బాలికల విషయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ద్వంద్వ విధానాలను అనుసరిస్తున్నదన్నారు. అవినీతి, కులతత్వం, మతోన్మాదం విషయంలో ఈ రెండు కూటములు నాణానికి రెండు ముఖాలవంటివని ధ్వజమెత్తారు. కొల్లంలోని 66వ నంబర్ జాతీయ రహదారిపై నిర్మించిన బైపాస్‌ను ప్రారంభించాక ప్రధాని మంగళవారం బీజేపీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌లను విమర్శించిన మోదీ, రెండు ప్రత్యర్థి కూటముల తాలూకు అవినీతికి, మతోన్మాదానికి కేరళ బందీగా మారిందని విమర్శించారు. శబరిమలపై కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేయాలని ఆయన సవాలు చేశారు. అంతకుముందు ప్రధాని తిరువనంతపురంలోని శతాబ్దాల పురాతనమైన పద్మనాభస్వామి ఆలయాన్ని దర్శించారు. కేరళ పర్యటనకు ముందు ప్రధాని ఒడిశాలో రూ.1550 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

మోదీ నీది హిట్లర్ సంస్కృతి: సీపీఎం

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తున్నందుకు ప్రధాని తమ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని సీపీఎం ప్రధాని వ్యాఖ్యలను తిప్పికొట్టింది. ప్రధాని మోదీ మనుస్మృతి లేదా ఆరెస్సెస్ ప్రమాణాలను కాకుండా తాను ప్రమాణం చేసిన భారత రాజ్యాంగాన్ని చదువాలని హితవు చెప్పింది. దేవ సంస్కృతి, చరిత్ర గురించి తమకు బోధించడం ఆపాలని హెచ్చరించింది.'మోదీ.. నీది హిట్లర్ సంస్కృతి. నీలోని ద్వేషంతో దేవుడు ప్రేమించే రాష్ట్రంలో కలతలు రేపకు' అని సీపీఎం ట్వీట్ చేసింది.

అయ్యప్పను దర్శించుకున్న కోడలిపై అత్త దాడి

శబరిమల ఆలయంలోకి వెళ్లిన కనకదుర్గకు అత్తవారింట్లో దెబ్బలు



గాయపడిన కనకదుర్గ

తిరువనంతపురం: శబరిమల ఆలయంలోకి ప్రవేశించిన తొలి 50 ఏండ్లలోపు మహిళగా చరిత్ర తిరగరాసిన కనకదుర్గకు అత్తవారింట్లో అవమానకర స్వాగతం లభించింది. ఈ నెల 2న అయ్యప్పను దర్శించుకున్న తర్వాత ప్రాణాలు తీస్తామన్న బెదిరింపుల నేపథ్యంలో ఇంతకాలం పోలీసు భద్రతలో కనకదుర్గ (42) ఉన్నారు. మంగళవారం ఉదయం ఆమె ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోకి రావడం సహించలేని కనకదుర్గ అత్త ఆమెపై దాడి చేసింది. తలకు తీవ్ర గాయమైన కనకదుర్గను దవాఖానకు తరలించారు. 'పోలీసు సంరక్షణలో ఉదయం 7.00 గంటలకు ఇంటికెళ్లాను. నేను వచ్చానని తెలియగానే మా అత్తగారు ఓ కర్ర తీసుకొని వచ్చి నన్ను కొట్టడం మొదలుపెట్టారు. నేను ఇంతకాలం ఇతరులతో వివాహేతర సంబంధం పెట్టుకొని వచ్చానని దూషించారు. పది పన్నెండుసార్లు నన్ను కొట్టారు. నేను వారిని ఎదిరించలేదు. నన్ను బయటకు తోసేసి తలుపులు వేసుకున్నారు' అని కనకదుర్గ మీడియాతో చెప్పారు. పోలీసులు తమ ఇంటి వెలుపల కాపలా ఉన్నారని, కానీ ఇంటిలోపల తనపై దాడి జరిగిందని తెలిపారు. కాలేజీ లెక్చరర్ బిందూతో కలిసి కనకదుర్గ ఈ నెలారంభంలో అయ్యప్పను దర్శించుకున్న తొలి 50 ఏండ్లలోపు వయస్సున్న మహిళలుగా వార్తల్లోకెక్కిన సంగతి తెలిసిందే.

ఆలయంలోకి వెళ్లేందుకు మరో ఇద్దరు మహిళల యత్నం

తిరువనంతపురం: శబరిమల ఆలయంలోని అయ్యప్పను దర్శించుకొనేందుకు వచ్చిన మరో ఇద్దరు 50 ఏండ్లలోపు మహిళలను భక్తులు బుధవారం అడ్డుకున్నారు. కన్నూరు జిల్లాకు చెందిన రేష్మా నిశాంత్, శనీలా అనే మహిళలు కొంతమంది పురుషులతో కలిసి బుధవారం వేకువ జామున కొండ ఎక్కేందుకు ప్రయత్నించారు. ఇరుముడికట్టుతో ఉన్న వారిని పసిగట్టిన భక్తులు మధ్యలోనే అడ్డుకున్నారు. దీంతో వారిని తొలుత పంబకు, అక్కడి నుంచి ఇరుమేలికి తీసుకొచ్చామని పోలీసులు చెప్పారు. ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్న ఆ మహిళలు తమను ఆలయ ప్రవేశానికి అనుమతించాలని కోరుతూ నిరవధిక నిరాహారదీక్షకు దిగారని స్థానిక మీడియా తెలిపింది. ఈ ఘటనపై స్పందించిన కేరళ దేవాదాయ శాఖ మంత్రి కే సురేంద్రన్, మహిళలను అడ్డుకోవడం నిరంకుశమన్నారు. మరోవైపు శబరిమల ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ ఇచ్చిన తీర్పుపై సమీక్షించాలని దాఖలైన పిటిషన్లపై ఈ నెల 22న విచారణ జరుగదని సుప్రీంకోర్టు తెలిపింది. ధర్మాసనంలో సభ్యులైన ఒక జస్టిస్ మెడికల్ లీవ్‌పై వెళ్లినందున విచారణ జరుగదని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ అన్నారు.

సీబీఐ డైరెక్టర్ నియామకం కోసం
24న ఎంపిక కమిటీ భేటీ

న్యూఢిల్లీ: నూతన సీబీఐ డైరెక్టర్‌ను ఎంపిక చేసేందుకు ప్రధాని మోదీ సారథ్యంలోని కమిటీ ఈ నెల 24న సమావేశం కానున్నది. గత వారం సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మకు ఉద్వాసన పలుకుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం భారీ రాజకీయ గందరగోళాన్ని సృష్టించిన సంగతి తెలిసిందే. ప్రధాని మోదీతోపాటు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఈ నెల 24న సమావేశమై నూతన సీబీఐ డైరెక్టర్‌ను ఎంపిక చేస్తారు. మరోవైపు సీబీఐ డైరెక్టర్ ఎంపికకు కమిటీని సాధ్యమైనంత త్వరగా సమావేశ పరుచాలని మోదీకి మల్లిఖార్జున ఖర్గే లేఖ రాశారు.

పేద ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలి

- బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రతిపాదన
- కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటును, ప్రధాని నియామకాన్ని నిర్ణయించేది యూపీనేనని వ్యాఖ్య



లక్నో: ఆర్థికంగా వెనుకబడిన ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రతిపాదించారు. ఆమె తన 63వ జన్మ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన వేడుకలో ఈ అంశాన్ని లేవనెత్తారు. '1947లో ప్రభుత్వోద్యోగాల్లో ముస్లింలు సుమారు 33% ఉండేవారు. ఇప్పుడది 2-3 శాతానికి పడిపోయింది. హిందువుల్లోని అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్లను మేం స్వాగతిస్తాం. కానీ దానివల్ల ముస్లింలు, ఇతర మైనారిటీలకు లబ్ధి చేకూరదు' అని అన్నారు. మాయావతికి సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన స్వయంగా ఆమె నివాసానికి చేరుకుని శాలువాతో సన్మానించారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయమే తన అసలైన జన్మదినోత్సవ కానుక అని ఆమె అన్నారు. ఢిల్లీలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా, ఎవరు ప్రధాని కావాలన్నా నిర్ణయించేది యూపీ అని ఆమె అన్నారు. అవినీతికి బీజేపీ, కాంగ్రెస్ నిదర్శనమని, వారి హయాంలోనే రాఫెల్, బోఫోర్స్ కుంభకోణాలు వెలుగు చూశాయని ఆరోపించారు. అమ్రోహాలో మాయావతి బర్త్‌డే కేక్ కోసం బీఎస్పీ కార్యకర్తలు ఘర్షణకు దిగడంతోపాటు దాన్ని కొందరు ఎత్తుకెళ్లిన దృశ్యాల వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.



రాజకీయాలంటేనే సవాళ్లతో కూడినవి. మేం వాటిని వ్యూహాత్మకంగా ఎదుర్కొంటాం. బీజేపీని ఎదుర్కొనేందుకు ఆప్‌తో కలువాలనేది ఏమీ లేదు. బీజేపీ, ఆప్ రెండింటితో మేం తలపడబోతున్నాం.

షీలా దీక్షిత్, ఢిల్లీ పీసీసీ చీఫ్

అవినీతి, నేరమయ రాజకీయాలు, మతమౌఢ్యాలతో నేను రాజీపడను. ఆర్జేడీ పనివిధానం కారణంగా మేం వారితో కలిసి పనిచేయలేం. వారి అవినీతి రాజకీయ జోక్యాలు ఎక్కువయ్యాయి.అందుకే బీహార్ ప్రయోజనాల కోసం బీజేపీతో కలువటానికి సిద్ధమయ్యాను.

నితీశ్‌కుమార్, బీహార్ ముఖ్యమంత్రి



చరిత్రలో నేడు



1595
స్పెయిన్‌పై యుద్ధం ప్రకటించిన ఫ్రాన్స్ రాజు నాలుగవ హెన్రీ.

1912
అముండ్‌సేన్ తర్వాత నెల రోజులకు దక్షిణ ధృవాన్ని చేరుకున్న రాబర్ట్ స్కాట్.





1966
మానవహక్కుల ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించిన మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్.

ప్రఖ్యాత అస్సామీ రచయిత, మేధావి హిరేన్ గొహైన్‌పై దేశద్రోహ నేరం మోపి కేసు పెట్టడం ఆ చట్టం దుర్వినియోగానికి పరాకాష్ఠ. కేంద్రం తీసుకు రావటానికి తలపెట్టిన పౌరసత్వ సవరణ బిల్లును నిరసిస్తూ గొహైన్‌తో పాటు, రైతు హక్కుల కార్యకర్త అఖిల్ గొగోయ్, జర్నలిస్టు మంజిత్ మహంతాలపై ప్రభుత్వం రాజద్రోహం,కుట్ర కేసులు మోపింది. నిజానికి వీరంతా అస్సాంలో పౌరసత్వ సవరణ బిల్లును నిరసిస్తూ పెట్టిన బహిరంగ సభలో ప్రసంగించారు. బిల్లును నిరసిస్తూ మాట్లాడటమే ప్రభుత్వం దృష్టిలో నేరమై పోయింది.

ది హిందూ

తమిళ నాడు ప్రభుత్వం జనవరి 1 నుంచి రాష్ట్రంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించింది. ఈ నిషేధం అమల్లోకి వచ్చిన రోజున కొత్త సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి. అయినా వినియోగదారులంతా ప్లాస్టిక్ స్థానంలో కాగితపు సంచులను వినియోగించి స్ఫూర్తిని చాటారు. అయితే చిన్న, మధ్య తరహా ఉత్పత్తి దారులు ప్లాస్టిక్ నిషేధంతో జీవనోపాధిని కోల్పోయే పరిస్థితి ఉన్నది. జీవనోపాధికి విఘాతం కలుగకుండా ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రణాళికా బద్ధంగా అమలు చేయాలి.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

బీజేపీ సమ్మేళనం

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రెండురోజుల పాటు జరిగిన బీజేపీ జాతీయ సమ్మేళనం పార్టీ శ్రేణులలో ఉత్సాహాన్ని, ప్రజలలో ఆశాభావాన్ని నింపలేకపోయింది. దేశం నలుమూలల నుంచి దాదాపు 12 వేల మంది ప్రతినిధులు హాజరైన ఈ సమ్మేళనం ద్వారా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలని పార్టీ నాయకత్వం భావించింది. ప్రధాని మోదీ పరిపాలన ప్రధానాంశంగానే ఎన్నికల ప్రచారం సాగుతుందనేది ఈ సమావేశం ద్వారా ధ్రువపడ్డది. పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ఇతర ప్రముఖులు ప్రధాని మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ మాట్లాడారు. ప్రతిపక్షాలు గెలిస్తే అస్థిరత్వం నెలకొంటుందని, సాహసవంతుడైన నాయకుడికి, నాయకుడు లేని అవకాశవాద కూటమికి మధ్య పోటీ జరుగుతున్నదని రాజకీయ తీర్మానంలో వ్యాఖ్యానించింది. బీజేపీ నాయకత్వం కార్యకర్తలకు ఎన్నయినా చెప్పవచ్చు. కానీ ఎన్నికల సమయంలో ఏమి చెబుతారనేది ప్రజలను మెప్పించే విధంగా ఉండాలె. ప్రజలను మెప్పించే మాటలు మాట్లాడాలంటే మొదట మోదీ పాలనలోని విజయాలు, వైఫల్యాలపై పార్టీ నాయకత్వం నిష్పక్షపాతంగా ఆత్మవిమర్శ చేసుకోవాలె. ఆర్థికాభివృద్ధి, విదేశాంగం, చట్టబద్ధపాలన, పరిశుద్ధపాలన మొదలైన రంగాలలో మోదీ ప్రభుత్వం సాధించినదేమిటో, వైఫల్యాలు ఎదురైతే అందుకు కారణాలేమిటో ప్రజలకు వివరించాలె. పార్టీ పెద్దలు మోదీ నాయకత్వాన్ని ప్రశంసించినంత మాత్రాన ప్రజలు ఆమోదించాలనేమీ లేదు. భారత్ ఇరుగు పొరుగు దేశాలలో వ్యతిరేకత ప్రబలడం మొదలుకొని నోట్ల రద్దు విధానం బెడిసికొట్టడం వరకు విపులంగా పార్టీలో ఇప్పటికే ఆంతరంగికంగానైనా చర్చించి, కార్యకర్తలకు స్పష్టత ఇవ్వడం మంచిది.

బీజేపీ జాతీయ సమ్మేళనంలో మొదటి రోజు ఆమోదించిన వ్యవసాయ తీర్మానం ఈ రంగంలో సంక్షోభాన్ని తొలిగించడానికి మోదీ ప్రభుత్వం ఏమి చేసిందో వివరించలేకపోయింది. స్వామినాథన్ సూచనల ప్రకారం రైతుల పండించిన ఖర్చుకు అదనంగా యాభై శాతం లాభం వచ్చే విధంగా చూస్తామని బీజేపీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. కానీ ఆ హామీని నెరవేర్చలేకపోయింది. దేశవ్యాప్తంగా రైతువర్గంలో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకున్నది. ఉత్తరాది రాష్ట్రాలలో జాట్లు, గుజరాత్‌లో పటీదారులు, మహారాష్ట్రలో మరాఠాలు ఇట్లా- పలు రాష్ట్రాలలో రైతు వర్గాలు తీవ్రస్థాయిలో నిరసనలు చేపట్టాయి. తమిళనాడులో జల్లికట్టు విషయమై ఇంత పెద్ద ఎత్తున ఆందోళన చెలరేగడానికి కూడా అంతర్లీనంగా వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభమే కారణమనే అభిప్రాయం ఉన్నది. మధ్య ప్రదేశ్‌లోనైతే ఆందోళన ఒక దశలో అదుపు తప్పింది. బీజేపీపై వ్యతిరేకత ప్రబలడానికి వ్యవసాయ సంక్షోభమే కారణం. గుజరాత్ శాసన సభ ఎన్నికల లో అతి కష్టంగా కాంగ్రెస్‌పై విజయం సాధించినప్పటికీ బీజేపీపై ప్రజలలో వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉందని అప్పుడే తెలిసిపోయింది. ఇటీవలి రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ప్రభుత్వాలు కూలిపోయాయి. కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నప్పటికీ బీజేపీ నెట్టుకు రాలేకపోయింది. ఈ మూడు రాష్ట్రాల పరాజయాల నుంచి తగిన గుణపాఠాలు నేర్చుకోవాలని బీజేపీ రాజకీయ తీర్మానంలో కార్యకర్తలకు ఉద్బోధించింది. కానీ నేర్చుకోవలసింది పార్టీ కార్యకర్తలు కాదు, విధానకర్తలు!

కాంగ్రెస్ అవినీతి గురించి మోదీ కొత్తగా ప్రజలకు చెప్పవలసిందేమీ లేదు. ఆ పార్టీ అవినీతి పాలనతో విసిగిపోవడం వల్లనే ప్రత్యామ్నాయంగా కనిపించిన బీజేపీకి పట్టం కట్టారు. మోదీ చెప్పుకోవలసింది తమ ఐదేండ్ల పాలనలో సాధించినదేమిటనేదే. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా కొద్ది నెలల గడువు మాత్రమే ఉన్నది. ఈ స్వల్ప కాలంలో ప్రజలను మెప్పించే అద్భుతాలు ఏమైనా చేస్తే చేయవచ్చు. అంతేకానీ ప్రతిపక్షాల బలహీనత వల్ల గట్టెక్కాలంటే మాత్రం సాధ్యం కాదు. కాంగ్రెస్ బలహీనంగా ఉన్నా, ప్రాంతీయ పార్టీలు ఒక కూటమిగా ముందుకు వస్తున్నాయనేది గమనించదగిన పరిణామం.

ప్రధాని మోదీ తమ ప్రసంగంలో తమది ఉత్తమమైన పాలన అని చెప్పుకుంటూ, ప్రతిపక్షాల పాలన అవినీతిమయమని దుమ్మెత్తి పోసారు. గత ప్రభుత్వాలు దేశాన్ని చీకటిలోకి నెట్టివేశాయనీ, 2004 నుంచి పదేండ్లపాటు సాగిన యూపీఏ పాలన అవినీతి, కుంభకోణాలతో నిండిపోయిందని ఆరోపించారు. 21వ శతాబ్దం ప్రారంభంలోని ఈ పదేండ్లు ఎంతో విలువైనవని ఆయన అన్నారు. కానీ దేశ చరిత్రలో మొదటిసారిగా తమ ప్రభుత్వంపై ఏ ఒక్క అవినీతి ఆరోపణ లేదని, ఇందుకు మనం గర్వపడవచ్చునని మోదీ చెప్పుకోవడం ఆశ్చర్యంగానే ఉన్నది. రాఫెల్ ఒప్పందంపై సాగుతున్న రగడ అందరికీ తెలిసిందే. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టుగా నల్లధనం ఉన్న వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిల గురించిన పాపమంతా కాంగ్రెస్‌దే అనే విధంగా మాట్లాడారు. కానీ కొందరు ఎగవేతదారులు మోదీ హయాంలోనే దేశం నుంచి జారుకున్నారనేది జగద్విదితమే. విజయ్ మాల్యా మొదలుకొని దేశం విడిచిపోయినవారిని పట్టి తెచ్చి శిక్షించడం ఇప్పటివరకు జరుగలేదు. కాంగ్రెస్ అవినీతి గురించి మోదీ కొత్తగా ప్రజలకు చెప్పవలసిందేమీ లేదు. ఆ పార్టీ అవినీతి పాలనతో విసిగిపోవడం వల్లనే ప్రత్యామ్నాయంగా కనిపించిన బీజేపీకి పట్టం కట్టారు. మోదీ చెప్పుకోవలసింది తమ ఐదేండ్ల పాలనలో సాధించినదేమిటనేదే. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా కొద్ది నెలల గడువు మాత్రమే ఉన్నది. ఈ స్వల్ప కాలంలో ప్రజలను మెప్పించే అద్భుతాలు ఏమైనా చేస్తే చేయవచ్చు. అంతేకానీ ప్రతిపక్షాల బలహీనత వల్ల గట్టెక్కాలంటే మాత్రం సాధ్యం కాదు. కాంగ్రెస్ బలహీనంగా ఉన్నా, ప్రాంతీయ పార్టీలు ఒక కూటమిగా ముందుకు వస్తున్నాయనేది గమనించదగిన పరిణామం.

జనగళం

నాణ్యమైన విద్య అందించాలి

విద్యా వ్యవస్థలో ఉన్న సమస్యల గురించి అనేక అధ్యయనాలు చాలా విషయాలు వెల్లడించాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన దేశం ఎంతో ముందుకు పోతున్నది. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు చదవడం, రాయడంలో వెనుకబడుతున్నారు. అయితే కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు వస్తున్నాయనేది కాదనలేని వాస్తవం. అయితే ప్రాథమిక స్థాయిలో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి విద్యాశాఖ అధ్యయనం చేయాలి. వాళ్లు ప్రాథమిక విద్యను పూర్తి చేసే సరికి చదవడం, రాయడం లాంటివే కాకుండా అన్ని సబ్జెక్టుల్లో రాణించడానికి కావాల్సిన నైపుణ్యాలు ఉండేలా చర్యలు చేపట్టాలి. కాబట్టి రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలి.

-పి. ఆంజనేయులు, కరీంనగర్

విభజన సమస్యలు పరిష్కరించాలి

లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. రాష్ట్ర విభజన సమస్యలు ఇప్పటికీ అనేకం అపరిష్కృతంగా ఉన్నాయి. వాటిని త్వరితగతిన పరిష్కరించాలి. విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని మాటలకే పరిమితం కావద్దు. లోక్‌సభ ఎన్నికలకు ముందే పెండింగ్‌లో ఉన్న అంశాలన్నీ పరిశీలించి పరిష్కరించాలి.

-సి. శ్రీనివాస్, మహబూబ్‌నగర్

పెరుగుతున్న ధ్వని కాలుష్యం

నగరాల్లో ధ్వని కాలుష్యం ఎక్కువ అవుతున్నది. వాహనదారులు అవసరం లేకున్నా సిగ్నల్స్ దగ్గర అదేపనిగా హారన్ మోగిస్తున్నారు. దీనిపై ట్రాఫిక్ అధికారులు దృష్టి సారించకపోవడం శోచనీయం. ఫ్రీ లెఫ్ట్ లాంటివి కూడా బ్లాక్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.అలాగే ధ్వని కాలుష్యం వల్ల ఎదురయ్యే ఇబ్బందుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలి.

-బి. తిరుపతి, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

విచక్షణలేని కుల చైతన్యమా?

అగ్రవర్ణాలలోని పేదలకు పది శాతం రిజర్వేషన్లు చేయటంలో మోదీ ప్రభుత్వపు రాజకీయ ఉద్దేశం ఏమిటి? ఈ చట్టం కోర్టులలో నిలబడుతుందా లేదా అనే రెండు ప్రశ్నలపై మనం ఎంతైనా చర్చించి ఏ అభిప్రాయానికైనా రావచ్చు. కాని యథాతథంగా ఈ చర్య వాంఛనీయమా కాదా, ఈ చర్యపై వస్తున్న విమర్శలు సరైనవా కావా అన్నవి మరొకస్థాయి ప్రశ్నలు. చారిత్రకమైన వాస్తవాల దృష్ట్యా రిజర్వేషన్లు అవసరమైంది ఎస్సీ, ఎస్టీలకే తప్ప బీసీలకు కాదని రాజ్యాంగసభ నిర్ణయించటాన్ని ముందుగా గుర్తుంచుకోవాలి. రిజర్వేషన్ల ప్రయాణానికి అది స్టార్టింగ్ పాయింట్ వంటిది.

చారిత్రక వాస్తవాలు, వర్తమాన పరిస్థితుల దృష్ట్యా బీసీలకు తమ అభ్యున్నతి కోసం కుల చైతన్యం అవసరమన్నది నిస్సందేహం. అదే సమయంలో అటువంటి చారిత్రక వాస్తవాలు, వర్తమాన పరిస్థితులు అగ్రకులాలలోని పేద వర్గాలకు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కూడా ఉన్నాయని వారు గ్రహించాలి. అటువంటి సమగ్రదృష్టి లేకుండా, సర్వజనుల అభ్యున్నతిని కోరుకోని కుల చైతన్యం అనేక ప్రశ్నల చిక్కుముడులలో ఇరుక్కునిపోతుంది. సమాజంలో పాక్షిక అభ్యున్నతులు సాధ్యమా అన్నదే ఒక ప్రశ్న కాగా, అటువంటి వాటిని కోరుకోవటం కూడా ఆమోదనీయం కాదు.

అగ్రవర్ణాలలోని పేదలకు పది శాతం రిజర్వేషన్లు చేయటంలో మోదీ ప్రభుత్వపు రాజకీయ ఉద్దేశం ఏమిటి? ఈ చట్టం కోర్టులలో నిలబడుతుందా లేదా అనే రెండు ప్రశ్నలపై మనం ఎంతైనా చర్చించి ఏ అభిప్రాయానికైనా రావచ్చు. కాని యథాతథంగా ఈ చర్య వాంఛనీయమా కాదా, ఈ చర్యపై వస్తున్న విమర్శలు సరైనవా కావా అన్నవి మరొక స్థాయి ప్రశ్నలు. చారిత్రకమైన వాస్తవాల దృష్ట్యా రిజర్వేషన్లు అవసరమైంది ఎస్సీ, ఎస్టీలకే తప్ప బీసీలకు కాదని రాజ్యాంగసభ నిర్ణయించటాన్ని ముందుగా గుర్తుంచుకోవాలి. రిజర్వేషన్ల ప్రయాణానికి అది స్టార్టింగ్ పాయింట్ వంటిది. ఆ తర్వాత అనేక ఆందోళనల ఫలితంగా కొన్ని దశాబ్దాలకు బీసీ రిజర్వేషన్లు వచ్చాయి. ఇందుకు ఒక కారణం వారి డిమాండులోని సహేతుకత కాగా, మరొక కారణం వారి ఓట్లను రాజకీయ పార్టీలు ఆశించటం. ఇందులో రెండవది ప్రస్తుతం ప్రభుత్వ చర్య వంటిది.

రాజకీయాలను అట్లుంచితే, చారిత్రక వాస్తవాలు, వర్తమాన పరిస్థితులు అనే వాటిలో సామాజిక వివక్షలు, పేదరికం అనే రెండు అంశాలున్నాయి. రాజ్యాంగ నిర్మాతలు మొదట ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించినప్పుడు సామాజిక వివక్షలను మాత్రమే ప్రధానమైన పరిగణనగా తీసుకున్నారు. బీసీలకు పేదరికం, దానితో సంబంధం గల విద్య-ఉద్యోగ వెనుకబాటు తనాలు మినహా ఎస్సీలకు వలె అంటరానితనం, ఎస్టీలకు వలె మారుమూల ఏకాకి జీవనాలు లేవు గనుక రిజర్వేషన్ల వంటివి అక్కరలేదని భావించారు. బీసీలతో సహా తక్కిన వారికి ఆర్థిక-విద్య-ఉద్యోగావకాశాల కోసం పథకాలు సరిపోతాయన్నది ఆలోచన. కాని ఒక దశ తర్వాత వారికి రిజర్వేషన్లు వచ్చాయి. ఆ రిజర్వేషన్లను బీసీలలోని అగ్రకులాలే అధికంగా అనుభవిస్తున్నాయనే భావన వల్ల బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగింది. ఇదే డిమాండ్ ఇప్పుడు ఎస్సీలలో ఉన్నది. మరి ఇటువంటి వర్గీకరణలు చేయవలసిన పరిస్థితి వచ్చిందంటే, పరిస్థితుల వల్ల బీసీలందరికి అన్యాయం జరుగుతున్నదని, కనుక కుల చైతన్యం అవసరమని పోరాడినవారు, అంతర్గత చైతన్యం చూపనట్లే గదా. ఎస్సీలకు సంబంధించి మాల-మాదిగ సమస్యలో కూడా మాలలకు అంతర్గత చైతన్యం లేకపోవటమే.

రిజర్వేషన్లకు ఆస్కారం కల్పించిన చారిత్రక వాస్తవాలు, వర్తమాన పరిస్థితులు అనేవాటికి పలు కోణాలున్నాయి. వాటిలో అంటరానితనం, ఏకాకి జీవనం అనే సామాజిక పరిస్థితులతో పాటు, ఆ కారణాల వల్ల తలెత్తిన అవిద్య, నిరుద్యోగం, పేదరికం కూడా ఉన్నాయి. ఇవి కార్యకారణ సంబంధాల వంటివి. అంతే తప్ప, రాజ్యాంగ నిర్మాతలు ఎస్సీల అంటరానితనం, ఎస్టీల ఏకాకి జీవనం అనే సామాజిక కోణాలకు మాత్రమే సంకుచితమైన రీతిలో పరిమితమై ఆలోచించారని, ఆ స్థితికి ఫలితాలైన అవిద్య, నిరుద్యోగం,పేదరికాలను తమ సమగ్రదృష్టిలోకి తీసుకోలేదని భావించటం పొరపాటు. ఈ మౌలికమైన అవగాహనను ఇతర వర్గాలకు వర్తింపజేసి ఇప్పుడు, బీసీలకు అంటరానితనం గాని, ఒంటరి జీవనం గాని లేవు. కాని పేదరికం, వెనుకబాటుతనం, అవిద్య, నిరుద్యోగం ఉన్నాయి. అందువల్ల రిజర్వేషన్లు అవసరం. అదే పద్ధతిలో అల్ప సంఖ్యాక మత వర్గాలలో అంటరానితనం, ఒంటరి జీవితం వంటి సామాజిక పరిస్థితులు లేవు. కాని వారిలోని కొన్ని సెక్షన్లకు బీసీలకు వలెనే పేదరికం, వెనుకబాటుతనం, అవిద్య, నిరుద్యోగం ఉన్నాయి. కనుకనే లోగడ కొన్ని రాష్ట్రాలు వారిని బీసీలుగ గుర్తించి రిజర్వేషన్లు కల్పించాయి. వారికి బీసీ-ఇ గ్రూపు కింద రిజర్వేషన్లు పెంచేందుకు కేసీఆర్ నాయకత్వాన తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఆ విధంగా ఈ రిజర్వేషన్లు అన్నింటికి వర్తిస్తున్న సూత్రాలలో అంటరానితనం, ఏకాకిగా మారుమూల జీవితం వంటి సామాజిక వివక్షలతో పాటు, వెనుకబాటుతనం, అవిద్య, నిరుద్యోగం, పేదరికం అనే అనుబంధ సూత్రాలు, లేదా ఇతర సూత్రాలు కూడా ఉన్నాయి.


> సామాజిక వివక్షలతో పాటు భారతీయులంతా పేదరికం, అవిద్య, నిరుద్యోగం నుంచి కూడా బయటపడవలసి ఉంది. పుట్టుకతో అగ్రకులం వారు కావటంలో ఆ కులాలకు చెందిన పేదల ప్రమేయం ఏమీ లేదు. వారిని ఆ పేదరికం నుంచి వెలికి తేవటంలో మాత్రం ప్రభుత్వానికి, వ్యవస్థకు ప్రమేయం ఉండాలి. లేనప్పుడు ప్రభుత్వం అనేది ఎందుకు? అటువంటి పరిష్కారంలో పథకాలు ఒక సాధనమైతే రిజర్వేషన్లు కూడా ఒక సాధనమే.

ఈ విధంగా చారిత్రక వాస్తవాలు, వర్తమాన పరిస్థితులు కొన్ని తేడాలతోనైనా సూత్రరీత్యా ఒకేవిధంగా వర్తించే ఈ వర్గాలన్నింటికి రిజర్వేషన్లు అవసరమవుతున్నాయి. ఏదో ఒక పేరిటనో, ఏదో ఒక ఉద్దేశంతోనో ప్రశ్నించదలచుకుంటే ఈ రిజర్వేషన్లు అన్నింటినీ ప్రశ్నించవచ్చు. అట్లా ఆక్షేపిస్తున్నవారు కూడా ఉన్నారు. అంతమాత్రాన ఆయావర్గాల రిజర్వేషన్ల మౌలిక ఆవశ్యకత భంగపడిపోదు. ప్రస్తుతానికి వచ్చినప్పుడు అగ్రవర్ణాలలోని పేదలకు రిజర్వేషన్ల విషయం కూడా అటువంటిదే. కనుక వీరందరికి అందరితో సంఘీభావాలు ఉండాలి. కులం అన్నది వ్యవస్థ సృష్టించిన నిర్మాణం. ఆ వ్యవస్థలో కొన్నికులాలు ఉన్నతస్థానంలో ఉన్నంతమాత్రాన ఆ కులాలకు చెందినవారంతా అన్ని విధాలుగా ఉన్నతంగా ఉన్నారనలేం. ముఖ్యంగా చదువు, ఉద్యోగాలు వెనుకబాటుతనం, పేదరికాలకు సంబంధించి. వారిది వాస్తవానికి త్రిశంకు స్వర్గం వంటి పరిస్థితి. కుల వ్యవస్థ తాము సృష్టించినది కాకపోయినా సందర్భవశాత్తు అందులోని ఉన్నత శ్రేణి వారవుతారు. అదే సమయంలో అంతరాల వ్యవస్థలో భాగంగా పేదలు, చదువులు లేనివారవుతారు. ఆ విధంగా నలిగిపోతున్న వారికి పరిష్కారం ఏమిటి? ఆ ఒత్తిడి కారణంగానే పలువురు బీసీ, ఎస్సీ, ఎస్టీ వంటి గుర్తింపు కోసం తాపత్రయ పడుతున్నారు. జీవిత సమస్యల నుంచి బయటపడేందుకు సంప్రదాయకమైన కుల వ్యవస్థ గౌరవాలను వదులుకునేందుకు సంకోచించటం లేదు.

రిజర్వేషన్లు ఎందుకు, అభివృద్ధిపథకాలు సరిపోతాయి గదా అనే వాదం సహేతుకంగానే తోస్తుంది. కాని అదే వాదనను బీసీల విషయమై లేదా ఎస్సీ, ఎస్టీల విషయమై అగ్రవర్ణాల వారు చేయటం లేదా. పథకాలు అమలుచేయండి గాని అందరికి అన్ని రిజర్వేషన్లు రద్దుపరుచాలనే వారు లేరా! అందరినీ ధనిక-పేద కొలమానం ప్రకారం మాత్రమే చూడాలని, ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే మినహాయింపు ఇవ్వాలని సాక్ష్యాత్తు భారత ప్రభుత్వమే తొలి దశలో భావించటం, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ ప్రకారం సలహా ఇవ్వటం, మొట్టమొదట ఏర్పడిన కాలేల్కర్ కమిషన్‌లోనే ఇటువంటి భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటం వంటివి మనకు తెలిసిందే. అంతిమంగా పేదలందరిది ఒకే సమస్య అన్నది బీసీలు గుర్తించవలసిన విషయం.

సామాజిక వివక్షలతో పాటు భారతీయులంతా పేదరికం, అవిద్య, నిరుద్యోగం నుంచి కూడా బయటపడవలసి ఉంది. పుట్టుకతో అగ్రకులం వారు కావటంలో ఆ కులాలకు చెందిన పేదల ప్రమేయం ఏమీ లేదు. వారిని ఆ పేదరికం నుంచి వెలికి తేవటంలో మాత్రం ప్రభుత్వానికి, వ్యవస్థకు ప్రమేయం ఉండాలి. లేనప్పుడు ప్రభుత్వం అనేది ఎందుకు? అటువంటి పరిష్కారంలో పథకాలు ఒక సాధనమైతే రిజర్వేషన్లు కూడా ఒక సాధనమే. ఆ పేదలను గుర్తించేందుకు మోదీ ప్రభుత్వం నిర్ణయించిన ఆధారాలతో ఆక్షేపనీయమైనవి ఉన్నాయి. ఉదాహరణకు రూ.8 లక్షల వార్షికాదాయం వంటివి. కాని సూత్రరీత్యా రిజర్వేషన్లను తప్పనలేము. అందువల్ల, నిజానికి తమకు నష్టం అంటూ ఏమీ జరుగని పది శాతాన్ని బీసీలలో కొందరు వ్యతిరేకించటం, వారి కుల చైతన్యం విచక్షణ లేని స్వార్థంగా మారటానికి గుర్తు.

విశ్లేషణ



కోలేటి దామోదర్

సత్ఫలితాలిస్తున్న సంక్షేమ పథకాలు

కేసీఆర్ గారు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడమే కాక రాష్ట్ర రథసారథిగా బాధ్యతలను కూడా తానే చేపట్టారు. ఇది రాష్ట్ర ప్రజలకు లభించిన మరొక అదృష్టం. సహజ వనరులు ఎన్ని వున్నా, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురై వెనకబడిన ప్రాంతాలలో ఒకటిగా మిగిలిపోయిన తెలంగాణను సర్వతోముఖాభివృద్ధి చేసే పనికి కేసీఆర్ నడుంబిగించారు. గత అరువై ఏండ్లలో కనీసం ఊహకు కూడా అందని ప్రగతిని రాష్ట్రంలో ఈ నాలుగేండ్లలో సాధించి చూపారు. సమాజంలోని అన్నివర్గాల వారికి మంచి జరిగే ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారు. అవన్నీ జయప్రదంగా అమలవుతూ సత్ఫలితాలనిస్తున్నాయి.

రాష్ట్రంలో జలవనరుల సద్వినియోగానికి మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణ చేపట్టి నీటి నిల్వను పెంచారు. ఇటీవలి కాలంలో దేశంలో ఎక్కడాలేని విధంగా చేపట్టిన భారీ నీటిపారుదల ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు. ఇది ఉమ్మడి ఆదిలాబాదు, నిజామాబాదు, కరీంనగర్, మెదక్, వరంగల్, నల్గొండ జిల్లాలకు వరప్రదాయిని. పంపింగ్ ద్వారా దాదాపు 40 లక్షల ఎకరాలకు నీరందించే బృహత్ పథకం. ఆసియాలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 80 వేల కోట్ల రూపాయల అంచనాలతో ఇక్కడ జరుగుతున్న పనుల తీరును చూసి ఈ ప్రాజెక్టును సందర్శించిన రాజకీయ నాయకులు, ఇంజినీరింగ్ ప్రముఖులు కూడా ఆశ్చర్యచకితులౌతున్నారు.

పాలమూరు ఎత్తిపోతల పథకం మరొక అద్భుతం. కృష్ణా జలాలను జూరాల ప్రాజెక్టు నుంచి కోయిల్‌సాగర్ మీదుగా ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు ఎత్తిపోతల ద్వారా తాగునీరు, సాగునీరు అందించే పథకమిది. పాలమూరు, రంగారెడ్డి జిల్లా వాసులు ఎన్నో ఏళ్లుగా కంటున్న కలలు నిజమౌతున్నాయి. గోదావరి జలాలు, కృష్ణా జలాలతో తెలంగాణ నేల తడిసి పులకించిపోతున్నది. కేసీఆర్ ఉద్యమాలు నడుపడమే కాదు, సుస్థిరమైన పాలనను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు .

తెలంగాణ ఆడబిడ్డల తాగునీటి కష్టాలను తీర్చడానికి కేసీఆర్ గారు కంకణం కట్టుకుని మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టారు. ఈ పథకం ద్వారా పల్లెల్లోని ఇంటింటికీ మంచినీరు లభించే అవకాశం ఏర్పడింది. దీని కోసం రాష్ట్రం మొత్తం మీద లక్షా ఆరువందల కి.మీ. పొడవైన పైప్ లైన్‌ను వేసి, 24,248 గ్రామాలలోని 52,18,225 కుటుంబాలకు, 65 మున్సిపాలిటీలలోని 12,52,000 కుటుంబాలకు స్వచ్ఛమైన నదీజలాలను అందిస్తున్నారు. 11 రాష్ట్రాలు ఈ పథకాన్ని అధ్యయనం చేశాయి. దేశంలో ఎక్కడాలేని విధంగా 43 వేలకోట్ల రూపాయల వ్యయంతో ఇంతపెద్ద పథకాన్ని చేపట్టే సాహసం కేసీఆర్ మాత్రమే చేశారు.

రాష్ట్రమంతా పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండటం, కరెంట్ కోతలు లేనందున పరిశ్రమలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. టీఎస్. ఐపాస్ ద్వారా చిన్న పరిశ్రమలకు పదిరోజుల్లోనే అనుమతులు లభించడం జరుగుతున్నది. రాష్ట్రమంతా ఎటువంటి గొడవలు లేకుండా మతసామరస్యం వెల్లివిరుస్తుండడం వల్ల రాష్ట్రం శాంతిభద్రతలతో అలరారుతున్నది. కోతలు లేని 24గంటల ఉచిత కరెంట్ మూలంగా వ్యవసాయోత్పత్తులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి.

రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి పథకాలను రూపొందిచారు. వాటిని విజయవంతంగా అమలు చేయటంలోనే కాదు, ప్రజా సంక్షేమానికి మునుపెన్నడూ లేని విధంగా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన ఘనత మన సీఎం కేసీఆర్ గారిది. పంట పెట్టుబడికి రైతుబంధు పథకం కింద ఎకరాకు సంవత్సరానికి రూ.8 వేల రూపాయలను రైతులకు ఇస్తున్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ ద్వారా పరిపాలన ప్రజల ముంగిటికి తీసుకెళ్ళారు. వృద్ధులకు ఆసరా పెన్షన్లు, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, బోదకాలు బాధితులకు, దివ్యాంగులకు జీవనభృతి, హాస్టల్ విద్యార్థులకు సన్న బియ్యం, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్, గొర్రెల, బర్రెల పంపిణీ, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ లు ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలవుతున్నాయి.

> టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా రాష్ట్ర జి.డి.పి. నాలుగేళ్ళలో సగటున 17.20 శాతం వృద్ధిరేటును సాధించి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఎన్నో ప్రతిబంధకాలను, సవాళ్ళను అధిగమించి తనకు ఏ రాష్ట్రం సాటిరాదని కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం నిరూపించింది. కేసీఆర్ గారు గత నాలుగేండ్ల నుంచి ప్రారంభించి కొనసాగిస్తున్న పథకాలన్నీ జయప్రదంగా పూర్తి అవుతాయనడంలో సందేహం లేదు.

శాంతిభద్రతలను పరిరక్షించే పోలీస్ వ్యవస్థ పటిష్టత కోసం ఎన్నో చర్యలను చేపట్టడం జరిగింది. వారికి ఆధునిక వాహనాలను, ఆయుధాలను సరఫరా చేశారు. నిజాం కాలం నాటి పురాతన భవనాలలో పనిచేస్తున్న పోలీస్ స్టేషన్లు, అధికారుల భవనాల స్థానంలో అత్యాధునిక సౌకర్యాలతో కొత్త భవనాలను సమకూర్చే పని శరవేగంతో జరుగుతున్నది. ఇందుకుగాను తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ కు అవసరమైన నిధులను మంజూరు చేయడం జరిగింది.

టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా రాష్ట్ర జి.డి.పి. నాలుగేళ్ళలో సగటున 17.20 శాతం వృద్ధిరేటును సాధించి, దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఎన్నో ప్రతిబంధకాలను, సవాళ్ళను అధిగమించి తనకు ఏ రాష్ట్రం సాటిరాదని కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం నిరూపించింది. కేసీఆర్ గారు గత నాలుగేండ్ల నుంచి ప్రారంభించి కొనసాగిస్తున్న పథకాలన్నీ జయప్రదంగా పూర్తి అవుతాయనడంలో సందేహం లేదు.

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం ఇచ్చే తెలంగాణ ప్రభుత్వం వారి సంక్షేమానికి కూడా అదే రీతిలో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. తెలంగాణ పోలీస్ శాఖ, జైళ్ళ శాఖ, అగ్నిమాపకదళ, విపత్తు నివారణ శాఖల ప్రయోజనాల కోసం పోలీస్ స్టేషన్ల భవనాలు, కమిషనరేట్లు, బారక్స్, పోలీస్ ఉద్యోగుల, అధికారుల నివాసానికి క్వార్టర్స్, బహుళ అంతస్థుల భవనాలు మొదలైన నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టింది. పోలీస్, జైళ్ళ శాఖ భవన నిర్మాణ కార్యక్రమాలను మాత్రమే గాక, ఇతర ప్రభుత్వ శాఖలైన, పశువైద్య విశ్వవిద్యాలయం, అటవీశాఖ, అబ్కారీ మానవవనరుల సంస్థలకు సంబంధించిన భవన నిర్మాణాలను కూడా చేపట్టి, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో గడువుకు ముందే జయప్రదంగా పూర్తిచేసి, అప్పగిస్తున్నది. హౌసింగ్, కార్యాలయ నిర్మాణాలతో పాటు, పోలీస్ అకాడెమీ నిర్మాణం, సెంట్రల్ ప్రిజన్స్, ఒక్కొక్కటి వంద ఎకరాల విస్తీర్ణంలో 14 పోలీస్ బెటాలియన్ కాంప్లెక్స్‌లు, ఆక్టోపస్‌కు 600 ఎకరాలలో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో 30 వేల పోలీస్ నివాసగృహాలు, డి.జి.పి., ఇంటెలిజన్స్, సి.బి.సి.ఐ.డి., ఎ.సి.బి., డి.జి. ప్రిజన్స్ భవనాలతో పాటు సి.ఆర్. పి.ఎఫ్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ భవననిర్మాణాలు ప్రభుత్వం చేపట్టిన కార్యకలాపాలకు కలికితురాళ్ళుగా చెప్పవచ్చు.

(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ లిమిటెడ్ చైర్మన్)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

● సంక్రాంతికి 'బతుకమ్మ' శోభ



ఆడపడుచులకు తెలంగాణ సర్కార్ అందజేసిన బతుకమ్మ చీరెలను సంక్రాంతి పర్వదినాన ధరించి మురిసిపోయారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని ముదిరాజ్‌కాలనీ మహిళలంతా బతుకమ్మ చీరెలను కట్టుకొని పండుగ జరుపుకోగా సంక్రాంతికి 'బతుకమ్మ' శోభ వచ్చినట్టయింది.

- ధర్మపురి, నమస్తేతెలంగాణ

కన్నులపండువగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గువ్వల దంపతులు

అచ్చంపేట, నమస్తే తెలంగాణ: శ్రీశైలానికి ఉత్తర ద్వారంగా వెలిసిన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. బుధవారం తెల్లవారుజామున ఆలయ క్షేత్రంలోని కొండకింద బోగమహేశ్వర కల్యాణ మండపంలో వివాహ వేడుక వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సతీమణి అమలతో కలిసి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్వామివార్లకు రూ.5లక్షల విలువైన బంగారు ఆభరణాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులు



మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని మయూరి నర్సరీలో వాటర్‌ఫాల్స్, రెయిన్ ఫారెస్ట్‌ను మంగళవారం సంక్రాంతి పండుగ రోజు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రొనాల్డ్‌రోస్ ప్రారంభించారు. మయూరి నర్సరీని అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకట్టుకొనేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే, కలెక్టర్‌ను టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్‌లో ప్రత్యేకంగా అభినందించారు.

- మహబూబ్‌నగర్ నమస్తే తెలంగాణ ప్రతినిధి



వనపర్తిలో డీ-హబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి

డీ- హబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్: డిజిటల్ ఎడ్యుకేషన్ హబ్(డీ-హబ్)ను యువత సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలో గ్రేలాజికల్ టెక్నాలజీ, గ్రీన్ ఫీల్డ్ ఎన్నారై సంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన డీ-హబ్‌ను సంస్థ చైర్మన్లు బిక్కుమల్ల శ్రీనివాస్, భానుప్రకాశ్‌రెడ్డితో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సింగిరెడ్డి మాట్లాడుతూ.. డీ-హబ్ కేంద్రంలో ప్రధానంగా ఇంటర్నెట్ వినియోగం, ఇతర ఉపయోగాలపై ఉచితంగా అవగాహన కల్పిస్తారన్నారు. వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తిలో శివ రామాలయ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి.

- నాగర్‌కర్నూల్ రూరల్

'బ్రూనో'తో శ్రీశైలం రహదారిపై తనిఖీలు

అమ్రాబాద్ రూరల్: నల్లమలలో వేటగాళ్లు, కలప స్మగ్లర్లపై అటవీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. బుధవారం అమ్రాబాద్ రిజర్వు టైగర్ ఫారెస్ట్ ప్రాంతంలోని మన్ననూర్ రేంజ్ పరిధిలో జర్మనీ షెఫర్డ్ డాగ్ (బ్రూనో)తో ప్రత్యేక నిపుణుడు ఎఫ్‌బీవో డీఎన్ నరేష్‌కుమార్.. స్థానిక ఎఫ్‌ఎస్‌వో రామాంజనేయులు, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై అటవీ బేస్‌క్యాంప్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

కమ్యూనిస్టు కురువృద్ధుడు కేఎల్ కన్నుమూత



కాకి లక్ష్మారెడ్డి (ఫైల్)

ఖమ్మం క్రైం/బోడ్రాయిబజార్: కమ్యూనిస్టు కురువృద్ధుడు, తెలంగాణ సాయుధపోరాట యోధుడు కాకి లక్ష్మారెడ్డి (కేఎల్) బుధవారం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో కన్నుమూశారు. 1930లో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆత్మకూర్ మండలం రావిపహాడ్‌లో జన్మించారు. 18 ఏండ్ల వయస్సులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కేఎల్ జీవిత చరమాంకం వరకు కమ్యూనిస్టుగానే కొనసాగారు. 1959లో రావిపహాడ్, 1964లో బొప్పారం సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1964లో కమ్యూనిస్టు పార్టీలో చీలిక రాగా ఆయన సీపీఎం వైపు నిలబడ్డారు. 1967లో నక్సల్బరీ ఉద్యమం ప్రారంభమయ్యాక విప్లవ కమ్యూనిస్టు పార్టీ వైపు వెళ్లారు. 1969లో మిర్యాలగూడ లోక్‌సభ స్థానానికి పోటీచేశారు. 2000లో కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి నుంచి జనశక్తి పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీచేశారు. కేఎల్ అంత్యక్రియలను సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని అమర్‌నగర్‌లో గురువారం నిర్వహిస్తామని ఆయన కుమారుడు భాస్కర్ తెలిపారు.



ఆదిలాబాద్‌లో పార్టీ కండువా కప్పుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్న



హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన ఇందుర్తి కాంగ్రెస్ నేతలు



పార్టీలో చేరినవారికి గులాబీ కండువాలు కప్పుతున్న చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్

టీఆర్‌ఎస్‌లో జోరుగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకొంటున్నారు. బుధవారం సూర్యాపేట, చివ్వెంల మండలాల్లోని కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలకు చెందిన సుమారు 1,170 మంది సూర్యాపేటలో మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సమక్షంలో, చిలుకూరుకు చెందిన 100 మంది, నడిగూడెంకు చెందిన 50 మంది కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య సమక్షంలో, తుంగతుర్తి నుంచి 200 మంది, అర్వపల్లి మండలం నుంచి 150మంది, తిరుమలగిరి నుంచి పలువురు తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నల్లగొండ మండలం అన్నారెడ్డిగూడేనికి చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో, డిండి మండలం బురాన్‌పూర్‌తండాకు చెందిన 60 మంది దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో, అనుముల, గుర్రంపోడ్ మండలాలకు చెందిన 500 మంది నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

కరీంనగర్ జిల్లా: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ జిల్లా ముఖ్య నాయకులు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ సమక్షంలో, రామడుగు మండలం వెంకట్రావుపల్లిలో 100 మంది చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో, పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, సుల్తానాబాద్ మండలం రామునిపల్లికి చెందిన బీజేపీ నాయకులు, కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు, ఎలిగేడు మండలం శివపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



నల్లగొండ మండలం అన్నారెడ్డిగూడెం గ్రామస్థులను టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల



పెద్దపల్లిలో కాంగ్రెస్ నాయకులను టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ఆదిలాబాద్ జిల్లా: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం వడూర్‌కు చెందిన 200 మంది కాంగ్రెస్ నాయకులు ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్, టీడీపీ కౌన్సిలర్లు, 100 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో, మక్తల్, ఊట్కూర్, నర్వ మండలాల్లో 650 మంది ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో, భూత్పూర్‌లో 100 మంది టీడీపీ, బీజేపీ కార్యకర్తలు దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో, మద్దూర్ మండలంలో 60 మంది ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో, వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో 150 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు.. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో, ఉప్పునుంతలలో కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ సైదమ్మ రాంచంద్రం, యువ నాయకుడు పర్వత్‌రెడ్డితోపాటు 50మంది ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో, తిమ్మాజిపేట మండలం పుల్లగిరికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, నాగం ముఖ్య అనుచరుడు హర్యానాయక్‌తోపాటు మరో 10 మంది నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

ఖమ్మం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం గురువాగుతండాలో వివిధ పార్టీలకు చెందిన 30 కుటుంబాలు వైరా ఎమ్మెల్యే రాములునాయక్ సమక్షంలో, ఇల్లెందు మండలం మొండితోగు పంచాయతీ పరిధిలోని కుమ్మరికుంటకు చెందిన 46 కుటుంబాలు ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరాయి.



బయటపడ్డ విగ్రహం, నాణేలు

నగుసాన్‌పల్లిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు

వికారాబాద్, నమస్తే తెలంగాణ: వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం నగుసాన్‌పల్లి గ్రామ సమీపంలోని శివాలయం వద్ద మంగళవారం రాత్రి పలువురు బయటివ్యక్తులతో కలిసి కొందరు గ్రామస్థులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. రాగిపాత్రలు, నాణేలు, పంచలోహవిగ్రహాలు బయటపడ్డాయి. ముందస్తు సమాచారంతో విగ్రహాలను తరలిస్తున్నవారిని నవాబుపేట సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విగ్రహాలు, నాణేల విలువ రూ.కోట్లలో ఉంటుందని సమాచారం. పోలీసులు గురువారం వివరాలను వెల్లడించనున్నారు.

చిరుత వేట కేసులో నలుగురికి రిమాండ్

మాక్లూర్: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మామిడిపల్లి అటవీ సెక్షన్ పరిధిలో ఈనెల 14న చిరుతకు సంబంధించిన నాలుగు దంతాలు, ఏడు గోర్లను స్వాధీనం చేసుకున్న కేసులో అరెస్టుచేసిన అనుమానితులను బుధవారం రిమాండ్‌కు పంపారు. గుత్ప తండాకు చెందిన రవినాయక్, నేనావత్ నరేందర్, కాపర్తి విజయ్‌కుమార్, మోతీవార్ తులసీరామ్‌కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్టు డీఎఫ్‌వో రాములు తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్, పోస్టుమార్టం నివేదికల అనంతరం నిందితుల వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

కీతవారిగూడెంలో అరుదైన పక్షులు



గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో మూడు అరుదైన పక్షిపిల్లలు దర్శనమిచ్చాయి. గ్రామానికి చెందిన బాదె నాగయ్య ఇంటి ఆవరణలో ఎండిపోయిన తాటిచెట్టు మధ్యభాగం నుంచి ఇవి బయటకు వచ్చాయి. గుడ్లగూబను పోలి ఉన్నప్పటికీ రెక్కలు చాలా పొడవుగా ఉండటంతోపాటు ముఖభాగం గుండ్రంగా, వెడల్పుగా ఉన్నాయి. గతంలో ఇలాంటి పక్షి గ్రామానికి రాగా, తాజాగా దానిని పోలిన పిల్లలు ప్రత్యక్షమయ్యాయి. ఇవి బయటకు వచ్చిన కొద్దిసేపటికే వాటిలో ఒకటి మృతి చెందింది. ఇవి గుడ్లగూబ జాతిలో ఓ రకమని, దీనిని బార్న్ ఒవల్ (శాస్త్రీయ నామం- టైటో ఆల్బ) అంటారని నేరేడుచర్ల పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు మేకల శంకర్‌రావు తెలిపారు. దీని ముఖభాగం కొంచెం హృదయాకారంలో ఉండటం ప్రత్యేక లక్షణమని, ఇవి అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి శీతల దేశాల్లో ఎక్కువగా ఉంటాయని చెప్పారు. మన దేశంలో అరుదుగా అక్కడక్కడా కనిపిస్తుంటాయని పేర్కొన్నారు.

సర్పంచ్ అభ్యర్థిపై కాంగ్రెస్ నాయకుల దాడి



గాయపడ్డ వృద్ధుడు

నాంపల్లి: టీఆర్‌ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డ ఘటన నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం రేఖ్యాతండాలో మంగళవారం చోటుచేసుకున్నది. రమావత్ శ్రీను టీఆర్‌ఎస్ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచాడు. కాంగ్రెస్ బలపర్చిన రమావత్ సురేంద్రతోపాటు అతడి వర్గీయులు 50మంది.. శ్రీను ఇంటిపై కర్రలు, రాళ్లు, ఇనుపరాడ్లు, గొడ్డళ్లతో దాడిచేశారు. శ్రీను, అతడి భార్యతోపాటు బంధువులు, టీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడికి పాల్పడగా శ్రీనుతోపాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్సనిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. స్వల్పగాయాలైన మరో 10 మందిని దేవరకొండ దవాఖానలో చికిత్స అందిస్తున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తుపాకీతో బెదిరించి రూ.6.7 లక్షల దోపిడీ

జనగామ, నమస్తే తెలంగాణ: జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామంలోని తిరుమల వైన్స్ సిబ్బందిని మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నాటు తుపాకీతో బెదిరించి రూ.6.70 లక్షలు ఎత్తుకెళ్లారు. వైన్స్‌లో పనిచేసే రమేశ్, భాస్కర్, శ్రీను మంగళవారం అర్ధరాత్రి దాటాక దుకాణం మూసివేసి ఒకే బైక్‌పై పాలకుర్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో రామన్నగూడెం వద్ద వీరి బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అటకాయించారు. నాటు తుపాకీతో బెదిరించి, గాలిలోకి రెండు రౌండ్ల కాల్పులు జరిపి మద్యం దుకాణానికి సంబంధించిన నగదును దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై కానిస్టేబుల్ భర్త లైంగిక దాడి

జహీరాబాద్, నమస్తే తెలంగాణ: న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఓ మహిళపై కానిస్టేబుల్ భర్త లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్నది. భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో ఓ వివాహిత ఈ 13న జహీరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. న్యాయం కోసం మహిళ స్టేషన్‌కు వెళ్లగా అక్కడే ఉన్న మహిళా కానిస్టేబుల్ భర్త సురేందర్‌రెడ్డి ఆమెను కలిశాడు. కానిస్టేబుల్ అయిన తన భార్యతో మాట్లాడించి న్యాయం జరిగేలా చూస్తానని ఇంటికి తీసుకెళ్లి.. లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు సురేందర్‌రెడ్డిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

డ్రైవర్ నిద్రమత్తు.. ట్రక్కును ఢీకొన్న బస్సు

- 10 మందికి గాయాలు, ముగ్గురు విద్యార్థుల పరిస్థితి విషమం
- విహారయాత్రకు వెళ్లి వస్తుండగా సూర్యాపేట జిల్లాలో ఘటన

చివ్వెంల: విద్యార్థుల విహారయాత్ర విషాదాన్ని నింపింది. బస్సు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా సూర్యాపేట జిల్లా చివ్వెంల శివారులో బుధవారం తెల్లవారుజామున లారీని ఢీకొనడం పది మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉన్నది. నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల జెడ్పీటీసీకి చెందిన 33 మంది టెన్త్ విద్యార్థులు సంక్రాంతి సెలవుల్లో ఈనెల 10న ట్రావెల్స్ బస్సులో విహారయాత్రకు వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో డ్రైవర్ శివప్రసాద్ నిద్రమత్తులో చివ్వెంల వద్ద ఖమ్మం వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. పదిమందికి గాయాలు కాగా విద్యార్థులు నిఖిత, పావని, పారిజాతకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు.



చివ్వెంల వద్ద ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ట్రావెల్స్ బస్సు



సూర్యాపేట జిల్లా కోమరబండ శివారులో హైవేపై జరిగిన ప్రమాదంలో కారు డ్రైవర్ సీటులోనే మృతిచెందిన వెంకటమురళీ కృష్ణ

విషాదం నింపిన సంక్రాంతి

- పండుగకు ఊరెళ్లొస్తుండగా కారుబోల్తా
- తల్లిదండ్రులు, కుమార్తె దుర్మరణం.. సూర్యాపేట జిల్లాలో ఘటన
- పతంగి ఎగరేస్తూ.. ప్రమాదవశాత్తు ఇద్దరి మృతి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పలు కుటుంబాల్లో సంక్రాంతి విషాదాన్ని నింపింది. ఓ కుటుంబం కృష్ణా జిల్లాలోని సొంతూరుకు పండుగకు వెళ్లి తిరిగొస్తుండగా కోదాడ మండలంలో కారు బోల్తాపడి తల్లిదండ్రులతోపాటు కుమార్తె మృతి చెందారు. కామారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో పతంగి ఎగురవేస్తూ ఇద్దరు ప్రమాదవశాత్తు మరణించారు. ఎడ్లబండి పోటీల్లో బండి గిరక కిందపడి నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. రాచకొండ పరిధిలో సంక్రాంతి సంబురాల్లో చోటుచేసుకున్న చిన్నపాటి ఘర్షణ ఒకరి ప్రాణం తీసింది. పాతకక్షలు మనసులో పెట్టుకొని రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఓ యువకుడిని పండుగ దావత్‌కు పిలిచి స్నేహితులే హతమార్చారు.

సొంతూరు వెళ్లొస్తుండగా..

కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కోమరబండ శివారులో జాతీయ రహదారిపై బుధవారం ఘోర ప్రమాదం జరిగింది. అతివేగంగా వెళ్తున్న కారు పంక్చర్ అయి బోల్తాపడటంతో తల్లిదండ్రులతోపాటు కుమార్తె మరణించారు. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో ఉంటున్న రావి వెంకటమురళీ కృష్ణ(48), భార్య బ్యాంక్ ఆఫ్ అమెరికా ఉద్యోగి అక్కినేని కవిత(35), కూతురు ధనూషా(16), కుమారుడు యూనిత్ సంక్రాంతి పండుగకు సొంతూరు ఏపీలోని కృష్ణాజిల్లా నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లెకు వెళ్లి తిరిగి కారులో బయలు దేరారు. కోమరబండ శివారులో టైరు పంక్చర్ కావడంతో కారు డివైడర్‌ను ఢీకొని 50 మీటర్లఎత్తుకు ఎగిరి అవతలివైపు రోడ్డుపై వెళ్తున్న రెండు కార్లను ఢీకొట్టింది. కారు రూఫ్‌టాఫ్ ధ్వంసమై, అద్దాలు పగిలిపోయాయి. తల్లీకూతురు రోడ్డుపక్కన కాల్వ సమీపంలోని తుంగలో పడి మృతిచెందగా, వెంకటరమణ డ్రైవింగ్ సీటులోనే ప్రాణాలు వదిలాడు. యానిత్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

పతంగి వెంట పరుగే ప్రాణం తీసింది

సదాశివనగర్: కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన పోలబోయిన ధర్మపురి (10) సంక్రాంతి రోజున తెగిన పతంగి కోసం పరుగులు తీస్తుండగా కారు ఢీకొని మృతిచెందాడు. మంగళవారం సాయంత్రం తోటి పిల్లలతో కలిసి సదాశివనగర్ బస్టాండ్ వద్ద ధర్మపుర పతంగులు ఎగురవేస్తున్నాడు. దారం తెగిపోవడంతో సదాశివనగర్ బస్టాండ్ నుంచి జాతీయ రహదారి బ్రిడ్జి మీద ఉన్న రోడ్డుపై పరిగెడుతుండగా నిజామాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తున్న కారు ధర్మపురిని ఢీకొట్టింది. దీంతో బాలుడు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు.

చెట్టుకు చిక్కిన పతంగి తీస్తూ..

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఆరెగూడెంకు చెందిన ఆగు ప్రవీణ్(15) మంగళవారం సంక్రాంతి సందర్భంగా పతంగి ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఇంటిపై పతంగి ఎగురవేస్తుండగా అది సమీపంలోని చెట్టుకు చిక్కుకున్నది. దానిని తీసేందుకు యత్నిండగా ఇంటిపైనున్న విద్యుత్‌తీగలు తగిలి ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు.

రాచకొండలో ఘర్షణ, ఒకరి మృతి

సంస్థాన్‌నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం రాచకొండలో సంక్రాంతి సంబురాల్లో చోటుచేసుకున్న చిన్నపాటి ఘర్షణ ఒకరి ప్రాణం తీసింది. మంగళవారం రాచకొండకు చెందిన కాట్రోతు బద్దు, బాల, రవి, రాజు, శ్రీను, రాములు కలిసి పండుగ జరుపుకోగా వారిమధ్య చిన్నపాటి గొడువ జరిగింది. నలుగురు ఒకేసారి బద్దు మీద పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

ఎద్దుల బండి గిర్రకిందపడి వ్యక్తి మృతి

బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వడ్డెమాన్ గ్రామంలో సంక్రాంతి సంబురాల్లో అపశ్రుతి చోటుచేసుకున్నది. వడ్డెమాన్‌కు చెందిన జనార్దన్.. గ్రామంలో ఎడ్లబండ్ల ఊరేగింపులో ప్రమాదవశాత్తు బండి గిర్ర కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని నాగర్‌కర్నూల్ ఏరియా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.



జనార్దన్ (ఫైల్)

దావత్‌కు పిలిచి దారుణహత్య

సిరిసిల్ల క్రైం: సంక్రాంతి పండుగ రోజు విందుకు పిలిచి యువకుడిని స్నేహితులే హత్యచేశారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చింతల్‌ఠాణ గుట్టల్లో మంగళవారం జరిగింది. ప్రేమ వ్యవహారాన్ని బయటపెట్టినందుకే హత్య చేశారని తెలుస్తున్నది. వేములవాడ పట్టణం లోని శాస్త్రీనగర్‌కు చెందిన పత్రి నగేశ్ రెండో కుమారుడు సాయి (22) జంగమ వృత్తి మీదే ఆధారపడి జీవిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఐదుగురు స్నేహితులతో దావత్ చేసుకునేందుకు ఇంటి నుంచి బయటకి వెళ్లాడు. చీర్లవంచలోని మరో మిత్రుడు దావత్‌కు పిలిచాడంటూ స్నేహితులు.. సాయిని చింతలఠాణ గుట్టల వైపు తీసుకెళ్లి బ్లేడ్‌తో గొంతుకోసి హతమార్చారు. నిందితుల్లో ఒకరికి సంబంధించిన ప్రేమ విషయాన్ని సాయి బయటపెట్టడంతో వారం కిందట స్నేహితులు గొడవపడ్డారని సమాచారం. ఈ నేపథ్యంలో కక్ష పెంచుకుని పథకం ప్రకారం సాయిని హత్యచేసినట్టు తెలుస్తున్నది. హత్య చేశాక నిందితులే పోలీసులకు ఫోన్‌చేసినట్టు సమాచారం. తంగళ్లపల్లి మండల పోలీస్‌స్టేషన్ పరిధి చింతలఠాణ శివారులోని గుట్ట ప్రాంతంలో సాయి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సాయి తండ్రి నగేశ్.. ఐదుగురు యువకులపై అనుమానం వ్యక్తంచేస్తూ ఫిర్యాదు చేశాడు.



పత్రిసాయి (ఫైల్)

కిటకిటలాడిన కొత్తకొండ



పూజలందుకుంటున్న వీరభద్రుడు

- వీరభద్రుడికి కోరమీసాలు సమర్పించిన భక్తులు
- ఆకట్టుకున్న కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు

భీమదేవరపల్లి: వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మకరసంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళ, బుధవారాల్లో లక్షలాదిమంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, పర్యాటకశాఖ చైర్మన్ పేర్వాల భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, వేములవాడ ఈవో దూస రాజేశ్వర్, ఎన్పీడీసీఎల్ సీఎండీ ప్రభాకర్‌రావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చాలని స్వామివారికి భక్తులు కోరమీసాలు సమర్పించుకున్నారు. గండాలు తొలిగిపోవాలని గండదీపంలో నూనె పోశారు. వీరభద్రుని సన్నిధిలో కోడెప్రదక్షిణలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు గంటలతరబడి క్యూకట్టారు. జాతరలోని దుకాణాలు రద్దీగా మారాయి. రంగులరాట్నం, సర్కస్ వద్ద సందడి నెలకొన్నది. సంక్రాంతి పర్వదినం సోమవారం వేకువజామునే ఆనవాయితీ ప్రకారం వరంగల్ జిల్లా వేలేరుకు చెందిన యాదవులు మేకలబండితో ఆలయంచుట్టూ ప్రదక్షిణ చేశారు. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి నుంచి వచ్చిన ప్రభబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎడ్లబండ్లతో వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు. స్వామివారి గుట్టపైన కొలువుదీరిన వీరభద్రస్వామి ఆత్మలింగం ఆలయంలో దివ్యాలంకరణ పూజలు జరిగాయి.

వంగరలో పీవీ ఇంటినుంచి..

మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు ఇంటినుంచి కొత్తకొండకు ఎడ్లబండి రథం మకరసంక్రాంతి రోజున వెళ్లడం ఆనవాయితీ. ఈ ఏడాది సైతం ఎడ్లబండి రథాన్ని అందంగా అలంకరించి గ్రామస్థుల సమక్షంలో మంగళవారం కొత్తకొండకు తీసుకెళ్లారు. శివసత్తుల నృత్యాలు, మహిళల కోలాటాల నడుమ ఎడ్లబండి రథాన్ని కొత్తకొండకు సాగనంపారు.



కొత్తకొండకు ప్రభబండ్లలో వస్తున్న భక్తులు

సాగులో స్వయంసమృద్ధి!

- పంటకాలనీలు, ఆహారశుద్ధి యూనిట్ల ఏర్పాటుపై కసరత్తు
- అనుకూల ప్రాంతాలు, పంటలపై అధికారుల సమీక్ష
- 22న వ్యవసాయ,ఉద్యాన సిబ్బందితో వీడియోకాన్ఫరెన్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంటల సాగులో స్వయం సంవృద్ధిసాధించి, రైతులకు ఆదాయం పెంచాలనే లక్ష్యంతో తలపెట్టిన పంటకాలనీలు, ఆహారశుద్ధి యూనిట్ల ఏర్పాటుపై అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఈ అంశంపై వ్యవసాయ, ఉద్యాన,పరిశ్రమలు, కొండా లక్ష్మణ్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, సెర్ప్ అధికారులకు సీఎం కేసీఆర్ ఇప్పటికే సూచనలుచేశారు.ఈ నేపథ్యంలో అధికారులు విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బుధవారం హార్టికల్చర్ శిక్షణాసంస్థలో వ్యవసాయ, ఉద్యాన, పరిశ్రమలశాఖ ఉన్నతాధికారులు, ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలతో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి సమీక్ష నిర్వహించారు. టమాట, మిరప ఇతర కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్య పంటల విస్తీర్ణం, లభ్యతలపై సుదీర్ఘంగా చర్చించారు.

కూరగాయల సాగుపై రైతులను ప్రోత్సహించాలి

జంటనగరాలకు సరిపడా కూరగాయలను పండించేందుకు హైదరాబాద్ నుంచి 50 కిలోమీటర్ల పరిధిలో పంటకాలనీల ఏర్పాటుకు అధికారులు కృషిచేయాలని పార్థసారథి సూచించారు. ధనియాలు, అల్లం,వెల్లుల్లి, చింతపండు, మెంతులు, వోమ వంటి పంటలకు అనుకూల ప్రాంతాలను ఎంపికచేసి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రాసెసింగ్‌కి అనుకూలమైన రకాలను ప్రోత్సహించాలని నిర్ణయించారు. కల్తీలేని పసుపు, మిరప ఉత్పత్తులను అందించేందుకు రూ.26.38 కోట్లతో 2,260 టన్నుల సామర్థ్యంతో మేడ్చల్ జిల్లా దూలపల్లిలో ప్రాసెసింగ్‌యూనిట్ ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో చర్చించిన విషయాల ఆధారంగా పంటకాలనీలు, ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకోసం 2019-20 వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. వీటిపై మరింత అవగాహన కల్పించేందుకు 22న వ్యవసాయ, ఉద్యానశాఖలో మండలస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులు, జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు,పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఏపీవోలు సుమారు 3,500 మందితో ఉన్నతస్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించినట్టు పార్థసారథి తెలిపారు. పంటకాలనీల ఏర్పాటుపై విస్తృతంగా అవగాహన కల్పించి, వారినుంచి వచ్చే సూచనలను సీఎంకు అందజేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామ్‌రెడ్డి, కొండా లక్ష్మణ్ వర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ ఏ భగవాన్, ఫుడ్‌ప్రాసెసింగ్, పరిశ్రమలశాఖ డైరెక్టర్ అఖిల్, ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.



హార్టికల్చర్ శిక్షణాసంస్థలో సమావేశమైన వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి. చిత్రంలో ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి ఉన్నారు.

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
న్యూ ఢిల్లీ

నెం. E/423/2018 తేది: 29.12.2018

బహిరంగ ప్రకటన
(NH చట్టం 1956లోని సెక్షన్ 3జి(3) క్రింద)

తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌కర్నూలు జిల్లాలోని కల్వకుర్తి డివిజన్‌లో కి.మీ. 67/0 నుండి కి.మీ. 88/0 వరకు (కల్వకుర్తి-మల్లేపల్లి సెక్షన్) జాతీయ రహదారి-167పై చిన్న మరియు పెద్ద వంతెనలు వెడల్పు చేయుట, పటిష్టపరచుట, నిర్మాణం మరియు టోల్ ప్లాజాల నిర్మాణం కోసం భారత రాజపత్రం విశేష పత్రం నెంబరు 4264, పార్ట్ II సెక్షన్-3 ఉప-సెక్షన్ (ii) తేది 26-10-2018లో ప్రచురించబడిన ప్రకటన ఎస్.ఓ. 5469 (ఇ) తేది: 26-10-2018 ప్రకారం జాతీయ రహదార్ల చట్టం 1956 (చట్టం నెంబరు 48 ఆఫ్ 1956)లోని సెక్షన్ 3డి(2) క్రింద తాకట్టు రుణభారాలు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి కట్టడాలు మరియు చెట్లు మొ॥ వాటితోపాటు దిగువ షెడ్యూలులో తెలిపిన భూములు సంక్రమించినవి. సదరు భూములలో ప్రయోజనంగల వ్యక్తులు భూమిలో వారి హక్కుకు సంబంధించిన అసలు డాక్యుమెంట్లు మరియు డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలతో స్వయంగా లేదా ఏజెంటు ద్వారా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా భూసేకరణకు సమర్థ ప్రాధికారి (CALA) & రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూలు జిల్లా వారి సమక్షంలో దిగువ తెలిపిన కార్యాలయాలలో, దిగువ తెలిపిన తేదీలలో హాజరై ఆట్టి భూములలో తమ సంబంధిత ప్రయోజన స్వభావాన్ని తెలుపవలసిందిగా కోరబడుచున్నారు.

క్రమ సంఖ్య	జిల్లా పేరు	తహసీల్ కార్యాలయం పేరు	గ్రామం పేరు	విచారణ ప్రదేశం	తేది మరియు సమయం
1	నాగర్‌కర్నూలు	చారకొండ	చారకొండ	తహసీల్ కార్యాలయం, చారకొండ	01.02.2019 ఉ॥ 11.00గం. నుండి మ॥02.00 గం.ల వరకు
2	నాగర్‌కర్నూలు	కల్వకుర్తి	తాండ్ర	రెవెన్యూ డివిజనల్ ఆఫీస్, కల్వకుర్తి	01.02.2019 మ॥ 03.00గం. నుండి సా॥05.00 గం.ల వరకు
3	నాగర్‌కర్నూలు	వంగూర్	కొండారెడ్డిపల్లి	రెవెన్యూ డివిజనల్ ఆఫీస్, కల్వకుర్తి	01.02.2019 మ॥03.00గం. నుండి సా॥05.00 గం.ల వరకు

షెడ్యూలు

"తెలంగాణ రాష్ట్రంలోని NH(0) క్రింద EPC విధానంపై NH-167 (ఇంతకు ముందరి SH-18)లో కల్వకుర్తి-మల్లేపల్లి సెక్షన్ (ఇంతకు ముందరి SH-18) కి.మీ. 67/0 నుండి కి.మీ. 88/0 వరకు పేవ్డ్ షోల్డర్లతో రెండు లేన్లకు వెడల్పు చేసే" ప్రైవర్‌లోకి వచ్చే కట్టడంతో లేదా కట్టడం లేకుండా సేకరించబడుతున్న భూమి యొక్క సంక్షిప్త వివరణ.

క్ర. సం.	జిల్లా పేరు	తాలూకా పేరు	గ్రామం పేరు	పట్టేదార్ పేరు	సర్వే నెం.	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం హెక్టార్లలో	ఏమేని కట్టడాలు/చెట్లు
1	2	3	4	5	6	7	8	9	10
1	నాగర్‌కర్నూలు	చారకొండ	చారకొండ	కంగోని నారయ్య తండ్రి రాములు	273	పట్టా	మెట్ట	0.21246	
2				కంగోని యాదయ్య తండ్రి రాములు	273	పట్టా	మెట్ట	0.17199	
3				కంగోని అరుణ జ్యోతి భర్త లక్ష్మయ్య	273	పట్టా	మెట్ట	0.17199	
4				కంగోని శ్రీనయ్య తండ్రి రాములు	273	పట్టా	మెట్ట	0.17199	
5				కె. గణేష్ తండ్రి సత్తయ్య	273	పట్టా	మెట్ట	0.06075	
6				కె. రమేష్ తండ్రి సత్తయ్య	273	పట్టా	మెట్ట	0.06075	
7				కె. పుల్లమ్మ భర్త యాదయ్య	273	పట్టా	మెట్ట	0.12141	
8				సి. సత్యమ్మ భర్త పెద్ద అంజయ్య	273	పట్టా	మెట్ట	0.05058	
9				చిల్కాని మైపాల్ రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి	273	పట్టా	మెట్ట	0.06075	
10				పగిళ్ల మంగయ్య తండ్రి తిరుపతయ్య	282	పట్టా	మెట్ట	0.0607	
11				పి. సత్యనారి తండ్రి తిరుపతయ్య	282	పట్టా	మెట్ట	0.03035	
12				పి. అంజనేయులు తండ్రి తిరుపతయ్య	282	పట్టా	మెట్ట	0.03035	
13				పి. దానమ్మ భర్త శ్రీనయ్య	282	పట్టా	మెట్ట	0.03035	
14				పి. విష్ణు తండ్రి తిరుపతయ్య	282	పట్టా	మెట్ట	0.03035	
15				పాలకూర వీరయ్య తండ్రి రామచంద్రయ్య	283	పట్టా	మెట్ట	0.12646	
16				పాలకూర శంకరయ్య తండ్రి రామచంద్రయ్య	283	పట్టా	మెట్ట	0.12646	
17	నాగర్‌కర్నూలు	చారకొండ	చారకొండ	పగిళ్ల మంగయ్య తండ్రి తిరుపతయ్య	284	పట్టా	మెట్ట	0.0607	
18				పి. సత్యనారి తండ్రి తిరుపతయ్య	284	పట్టా	మెట్ట	0.03035	
19				పి. అంజనేయులు తండ్రి తిరుపతయ్య	284	పట్టా	మెట్ట	0.0354	
20				పి. దానమ్మ భర్త శ్రీనయ్య	284	పట్టా	మెట్ట	0.0354	
21				పి. విష్ణు తండ్రి తిరుపతయ్య	284	పట్టా	మెట్ట	0.03035	
22				పగడాల అలివేలు భర్త శంకరయ్య	284	పట్టా	మెట్ట	0.08094	
23				చింతపల్లి సత్యమ్మ భర్త పెద్ద అంజయ్య	285	పట్టా	మెట్ట	0.08093	
24				పగిళ్ల మంగయ్య తండ్రి తిరుపతయ్య	287	పట్టా	మెట్ట	0.02529	
25				పి. సత్యనారి తండ్రి తిరుపతయ్య	287	పట్టా	మెట్ట	0.01011	
26				పి. అంజనేయులు తండ్రి తిరుపతయ్య	287	పట్టా	మెట్ట	0.01011	
27	నాగర్‌కర్నూలు	చారకొండ	చారకొండ	పి. దానమ్మ భర్త శ్రీనయ్య	287	పట్టా	మెట్ట	0.01011	
28				పి. విష్ణు తండ్రి తిరుపతయ్య	287	పట్టా	మెట్ట	0.01517	
29				పగడాల అలివేలు భర్త శంకర్	287	పట్టా	మెట్ట	0.03035	
30				గొర్ల కృష్ణయ్య తండ్రి ముత్తయ్య	287	పట్టా	మెట్ట	0.07082	
31				పగిళ్ల మంగయ్య తండ్రి తిరుపతయ్య	288	పట్టా	మెట్ట	0.04047	
32				పి. సత్యనారి తండ్రి తిరుపతయ్య	288	పట్టా	మెట్ట	0.02023	
33				పి. అంజనేయులు తండ్రి తిరుపతయ్య	288	పట్టా	మెట్ట	0.02529	
34				పి. దానమ్మ భర్త శ్రీనయ్య	288	పట్టా	మెట్ట	0.02529	
35				పి. విష్ణు తండ్రి తిరుపతయ్య	288	పట్టా	మెట్ట	0.02023	
36				అంబాల లక్ష్మమ్మ భర్త రాములు	288	పట్టా	మెట్ట	0.05058	
37				అంబాల బాలయ్య తండ్రి నారయ్య	288	పట్టా	మెట్ట	0.04047	
38				పగిళ్ల మంగయ్య తండ్రి తిరుపతయ్య	289	పట్టా	మెట్ట	0.03035	
39				పి. సత్యనారి తండ్రి తిరుపతయ్య	289	పట్టా	మెట్ట	0.01517	
40				పి. అంజనేయులు తండ్రి తిరుపతయ్య	289	పట్టా	మెట్ట	0.01517	
41				పి. దానమ్మ భర్త శ్రీనయ్య	289	పట్టా	మెట్ట	0.01516	
42				పి. విష్ణు తండ్రి తిరుపతయ్య	289	పట్టా	మెట్ట	0.01517	
43	నాగర్‌కర్నూలు	చారకొండ	చారకొండ	అంబాల బాలయ్య తండ్రి నారయ్య	289	పట్టా	మెట్ట	0.04047	
44				అంబాల రాములు తండ్రి నారయ్య	289	పట్టా	మెట్ట	0.07082	
45				అంబాల రామస్వామి తండ్రి నారయ్య	292	పట్టా	మాగాణి	0.01011	
46				గుండె కృష్ణయ్య తండ్రి మల్లయ్య	292	పట్టా	మాగాణి	0.00505	
47				చింతపల్లి జంగయ్య తండ్రి ఈదయ్య	292	పట్టా	మాగాణి	0.05564	
48				ప్రభుత్వ భూమి	361	ప్రభుత్వ	మెట్ట	0.02022	
							మొత్తం	2.55961	
1	నాగర్‌కర్నూలు	కల్వకుర్తి	తాండ్ర	బొజ్జా శేఖర్ రెడ్డి తండ్రి చంద్రా రెడ్డి	200 /1/2	పట్టా	మెట్ట	0.02023	
2				బొజ్జా నారాయణ రెడ్డి తండ్రి చంద్రా రెడ్డి	200 /1/2	పట్టా	మెట్ట	0.04047	
3				బొజ్జా నారాయణ రెడ్డి తండ్రి చంద్రా రెడ్డి	200 /2/2	పట్టా	మెట్ట	0.04047	
							మొత్తం	0.10117	
1	నాగర్‌కర్నూలు	వంగూర్	కొండారెడ్డిపల్లి	బొజ్జా శరత్ చంద్రా రెడ్డి తండ్రి శేఖర్ రెడ్డి	66/2	పట్టా	మెట్ట	0.03035	
2				జంగం అపర్ణా రెడ్డి భర్త సుందర్ రెడ్డి	66/2	పట్టా	మెట్ట	0.03035	
3				చింతనూరి విజయకుమార్ తండ్రి చంద్రయ్య	66/2	పట్టా	మెట్ట	0.03035	
4				బొజ్జా సరళమ్మ భర్త శేఖర్ రెడ్డి	67/2	పట్టా	మెట్ట	0.07587	
5				బొజ్జా సరళమ్మ భర్త శేఖర్ రెడ్డి	69/2	పట్టా	మెట్ట	0.03541	
6				గోపిరెడ్డి రామ్‌రెడ్డి తండ్రి జి. పెంటా రెడ్డి	69/2	పట్టా	మెట్ట	0.04047	
7				పిండి లింగా రెడ్డి తండ్రి పి. వేమా రెడ్డి	69/2	పట్టా	మెట్ట	0.04047	
8				బోయినపల్లి మల్లేష్ తండ్రి బాలస్వామి	69/2	పట్టా	మెట్ట	0.05058	
9				ఎం.డి. మొయినుద్దీన్ తండ్రి సర్దార్ ఖాన్	70/2	పట్టా	మెట్ట	0.05564	
10				ఎం.డి. మొయినుద్దీన్ తండ్రి సర్దార్ ఖాన్	71/2	పట్టా	మెట్ట	0.02023	
11				జాలూరి చంద్రకళ భర్త జి.రామ్‌నాథమ్	71/2	పట్టా	మెట్ట	0.08094	
12	నాగర్‌కర్నూలు	వంగూర్	కొండారెడ్డిపల్లి	మంజోత్‌వర్ల మీనయ్య తండ్రి ఎం. జంగయ్య	71/2	పట్టా	మెట్ట	0.04046	
13				మంజోత్‌వర్ల మీనయ్య తండ్రి ఎం. జంగయ్య	72/2	పట్టా	మెట్ట	0.04047	
14				మంజోత్‌వర్ల యాదగిరి తండ్రి ఎం. జంగయ్య	72/2	పట్టా	మెట్ట	0.02023	
15				పెదింటి అనసూయ భర్త వెంకట్ రెడ్డి	77/ 2	పట్టా	మెట్ట	0.01517	
16				గంగుల శ్రీమంత భర్త ప్రభాకర్ రెడ్డి	78/2	పట్టా (ప్లాట్)	మెట్ట	0.01517	
17				పెదింటి అనసూయ భర్త వెంకట్ రెడ్డి	78/2	పట్టా (ప్లాట్)	మెట్ట	0.01517	
18				ఎలిమినేటి దీపిక భర్త రాజావర్ధన్ రెడ్డి	78/2	పట్టా (ప్లాట్)	మెట్ట	0.01517	
19				ఎలిమినేటి గీత భర్త గోవర్ధన్ రెడ్డి	78/2	పట్టా (ప్లాట్)	మెట్ట	0.01517	
20				గంగుల శ్రీమంత భర్త ప్రభాకర్ రెడ్డి	79/2	పట్టా	మెట్ట	0.01011	
21	నాగర్‌కర్నూలు	వంగూర్	కొండారెడ్డిపల్లి	ఎలిమినేటి దీపిక భర్త రాజావర్ధన్ రెడ్డి	79/2	పట్టా	మెట్ట	0.01011	
22				ఎం. రవీంత తండ్రి మధుసూదన్ రెడ్డి	80/2	పట్టా	మెట్ట	0.08093	
23				ఎం.డి. అఫ్రోజ్ తండ్రి మహ్మద్ అహ్మద్	80/2	పట్టా (ప్లాట్)	మెట్ట	0.04047	
24				బోయినపల్లి కళావతమ్మ భర్త బాలస్వామి గౌడ్	81/2	పట్టా	మెట్ట	0.03035	
25				చిట్టనూరి విజయకుమార్ తండ్రి సి.హెచ్. చంద్రయ్య	81/2	పట్టా	మెట్ట	0.03035	
26				బండపల్లి తిరుపతయ్య తండ్రి వెంకటయ్య	81/2	పట్టా	మెట్ట	0.0809	
							మొత్తం	0.95089	
							మొత్తం	3.61167	

(CALA) & రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, కల్వకుర్తి.



ఏపీలోని భీమవరంలో కోడిపందేలను తిలకిస్తున్న మాజీ మంత్రి తలసాని

బాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి తీరుతాం

- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి తీరుతామని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు టీడీపీ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం ఆయన కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నందిగామవద్ద విజయవాడ నగర డిప్యూటీ మేయర్ సత్యనారాయణయాదవ్‌తోపాటు యాదవ సంఘం నాయకులు గొల్ల శివశంకర్‌యాదవ్, ఎంఎం కొండయ్యయాదవ్, మాగంటి సుధాకర్‌యాదవ్ తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏలూరు, కైకలూరు, పల్లెపాడు మీదుగా సోమవారం రాత్రి భీమవరం చేరుకొని మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉందంటూనే టీవీలు, పత్రికల్లో ప్రచారం కోసం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నదని విమర్శించారు.

వీ ప్రకాశ్‌కు పర్యావరణ సంరక్షక్ అవార్డు

- రాజస్థాన్‌లో అవార్డు బహూకరించిన గాంధీ మనుమలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జలవనరుల రంగంలో తెలంగాణకు తాజాగా పర్యావరణ సంరక్షక్ అవార్డు దక్కింది. వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ సారథ్యంలోని తరుణ్ భారత్ సంఘ్ బహూకరించే పర్యావరణ పరిరక్షక్ అవార్డుకు తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాష్ ఎంపికయ్యారు. రాజస్థాన్‌లోని బీకంపూరాలో జరిగిన ఒక కార్యక్రమంలో మహాత్మాగాంధీ మనుమడు అరుణ్‌గాంధీ, మునిమనుమడు తుషార్‌గాంధీ ఈ అవార్డును ప్రకాష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ దంపతులను రాజేంద్రసింగ్ సత్కరించారు.



రాజస్థాన్‌లోని బీకంపూర్‌లో అవార్డు పొందిన జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్

నెలవారీ వేతనాలు ఇప్పించండి

- ఎంపీ వినోద్‌కు విన్నవించిన ఫారెస్ట్ వాచర్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తమకు నెలవారీ వేతనాలు ఇప్పించాలని కోరుతూ అటవీ శాఖ వాచర్స్ బుధవారం కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఫారెస్టు గార్డులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని, హరితహారంలో ప్రజలకు మొక్కలను అందిస్తున్నామని వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో తెలంగాణ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వాచర్స్ వెల్ఫేర్స్ అసోసియేషన్ జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల అధ్యక్షుడు గండ్ర శంకర్, ఉపాధ్యక్షుడు యండీ చిన్ననాసర్, ప్రధానకార్యదర్శి గుండవేని కొమురయ్య తదితరులున్నారు.

ఈవీఎంలకు అత్యాధునిక సాఫ్ట్‌వేర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఈసీ చర్యలు చేపట్టింది. ఈవీఎంల వినియోగంపై ఓడిపోయిన పార్టీలు విమర్శిస్తున్న నేపథ్యంలో ఈ యేడు జరిగే పార్లమెంట్ ఎన్నికలకు పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నది. ముఖ్యంగా ఈవీఎంలకు అత్యాధునిక సర్టిఫైడ్ సాఫ్ట్‌వేర్‌తో భద్రత కల్పిస్తున్నారు. ఈవీఎంలు తయారయ్యే ఫ్యాక్టరీలనుంచి మొదలు ఎన్నికల నిర్వహణ పూర్తయి, ఫలితాలు వెలువడి.. తిరిగి స్ట్రాంగ్ రూంలకు వెళ్లేవరకు ఆన్‌లైన్ ద్వారా ట్రాకింగ్ చేయనున్నారు. దీనికి జీపీఎస్‌కూడా అనుసంధానిస్తున్నారు. దీంతో ఈవీఎంలను ఎవరు ముట్టుకున్నా మెయిన్ సర్వర్‌కు వెంటనే తెలిసిపోతుంది. ఏ ఈవీ ఎం ఎక్కడ ఉందో కచ్చితంగా తెలిసిపోతుంది. ఈ విధానాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది.

ఎయిర్‌పోర్టు లోపలికి కత్తి ఎలా వచ్చింది..?

- జగన్‌పై హత్యాయత్నం కేసు.. ఐదోరోజూ ఎన్ఐఏ విచారణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడు శ్రీనివాసరావును ఎన్ఐఏ అధికారులు బుధవారం వరుసగా ఐదో రోజు విచారించారు. ఎయిర్‌పోర్టులోకి కోడికత్తి ఎలా వచ్చింది? ఎవరు తెచ్చారు? ఎవరైనా సహకరించారా? పథకం వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అంటూ పలు అంశాలపై ఎన్ఐఏ అధికారులు విచారించినట్టు సమాచారం. హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కార్యాలయంలో డీఐజీ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో శ్రీనివాసరావు తరపు న్యాయవాది సలీం సమక్షంలో అధికారులు ప్రశ్నించారు. ఎన్ఐఏ కార్యాలయం వద్ద న్యాయవాది సలీం పలు విషయాలను మీడియాకు వెల్లడించారు.

నేడు లండన్‌కు వైఎస్ జగన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం లండన్ బయల్దేరి వెళ్తున్నారు. కుటుంబసమేతంగా లండన్ వెళ్తున్న జగన్.. అక్కడ ఐదురోజులపాటు గడపనున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుతున్న తన కూతురు వర్షను చూసేందుకు కుటుంబసమేతంగా వెళ్తున్నారు. పాదయాత్ర ముగిసిన నేపథ్యంలో లండన్‌కు వెళ్తున్న జగన్.. ఈనెల 22న హైదరాబాద్ తిరుగు ప్రయాణమవుతారు. జగన్ లండన్ నుంచి రాగానే ఫెడరల్‌ఫ్రంట్‌పై చర్చించేందుకు టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ఏపీకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి.



బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా చంద్రగిరిలోని రంగంపేటలో జల్లికట్టు ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



గ్రామ స్వరాజ్యం

అన్నదమ్ముల సవాల్

పదవుల ముందు బంధుత్వాలు బలాదూర్

ఇబ్రహీంపట్నం, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో ఆసక్తికర పోరు నెలకొన్నది. పదవుల ముందు బంధుత్వాలు కూడా బలాదూర్ అవుతున్నాయి. అన్నదమ్ములు, అక్కాచెల్లెండ్లు, బావ-మరిది.. ఇలా రసవత్తర పోటీ జరుగుతున్నది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంచాలలో అన్నదమ్ముల మధ్య పోరు తారాస్థాయికి చేరుకొన్నది. సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన నారెడ్డి భద్రారెడ్డి, నారెడ్డి జగన్‌రెడ్డి స్వయానా అన్నదమ్ములు. జగన్‌రెడ్డిని టీఆర్‌ఎస్ పార్టీ బలపర్చగా.. భద్రారెడ్డికి కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నది. జగన్‌రెడ్డి మంచాల రేషన్ డీలర్‌గా పనిచేసి ప్రజలతో సత్సంబంధాలు కలిగివుండటంతో ఆయన ఎన్నిక నల్లేరుమీద నడక అని టీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కాంగ్రెస్ బలపర్చిన భద్రారెడ్డి గతంలో సింగిల్ విండో చైర్మన్‌గా పనిచేశారు. ఇద్దరిలో ఎవరికి ఓటువేయాలో తెలియక కుటుంబీకులు, బంధువులు అయోమయానికి గురవుతున్నారు. అన్నదమ్ముల మధ్య జరుగుతున్న ఆసక్తికర పోరులో ఎవరిని విజయం వరిస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



నారెడ్డి జగన్‌రెడ్డి



నారెడ్డి భద్రారెడ్డి

నాగన్‌పల్లి, పోల్కంపల్లి బరిలో బంధువులు

నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాల్లో కూడా సర్పంచ్ ఎన్నికల్లో బంధువులే బరిలో నిలువడంతో ఆసక్తి నెలకొన్నది. నాగన్‌పల్లి సర్పంచ్ పదవి ఎస్సీలకు రిజర్వ్ అయింది. ఇక్కడ ఎర్ర కిషన్, ఆయన చిన్నాన్న కుమారుడు ఎర్ర కుమార్ సర్పంచ్ పదవి కోసం పోటీ పడుతున్నారు. పోల్కంపల్లిలో సర్పంచ్ పదవికి తోటికోడళ్లు చెరుకూరి మంగ, చెరుకూరి అండాలు పోటీపడుతున్నారు. చెరుకూరి మంగ అభ్యర్థిత్వాన్ని టీఆర్‌ఎస్ బలపర్చగా, ఆండాలుకు కాంగ్రెస్, సీపీఎంలు మద్దతు ప్రకటించడంతో ఇక్కడి ఎన్నిక ఆసక్తికరంగా మారింది.

ఎన్నికల బందోబస్తుపై పోలీస్‌శాఖ నజర్

- ఇప్పటివరకు రూ. కోటీ 21 లక్షలు నగదు స్వాధీనం
- 48 మందిపై కేసులు.. 37 మంది అరెస్టు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ : పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంపై పోలీసుశాఖ దృష్టి పెట్టింది. మూడు విడుతల్లో 12,732 పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు ఈసీ నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల తరహాలో రీపోలింగ్, రీకౌంటింగ్ సహా చిన్న చిన్న సంఘటనలూ చోటు చేసుకోకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగుతున్నది. ఏ జిల్లాలో ఏ విడుత ఏయే గ్రామాల్లో ఉన్నాయి? వాటిలో సమస్యాత్మక గ్రామాలెన్ని? అనే అంశాలను పరిగణనలోకి తీసుకొని బందోబస్తు కోసం అవసరమైన సిబ్బంది కేటాయింపుపైనా దృష్టి సారించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తున్నారు. మొదటివిడుత ఎన్నికల పోలింగ్ సమయం దగ్గరపడుతుండడంతో ఆయా గ్రామాల్లో గస్తీని ముమ్మరంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం వరకు రూ.కోటీ 21 లక్షల 23 వేల 820 నగదు స్వాధీనం చేసుకొన్నారు. ఓటర్లకు తాయిలాలుగా ఇచ్చేందుకు తెచ్చిన రూ.8,03,767 విలువైన వస్తువులు స్వాధీనం చేసుకొన్నారు. నిబంధనలు అతిక్రమించిన 48 మంది కేసులు నమోదుచేశారు. వీరిలో ఇప్పటి రకు 37 మందిని అరెస్టుచేశారు.

సోపానం

వార్డుమెంబర్ నుంచి డిప్యూటీ స్పీకర్..

అయిదుసార్లు పరిగి ఎమ్మెల్యేగా గెలుపొందిన హరీశ్వర్‌రెడ్డి



పరిగి, నమస్తే తెలంగాణ: మాజీ ఎమ్మెల్యే, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి వార్డుమెంబర్ నుంచే రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. హరీశ్వర్‌రెడ్డి పరిగి నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు (1994 నుంచి 2009 వరకు వరుసగా నాలుగు సార్లు) ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు సృష్టించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కూడా పనిచేశారు. పరిగి పట్టణంలో 1947లో జన్మించిన కొప్పుల హరీశ్వర్‌రెడ్డి 1970లో చిన్న వయసులో పరిగి పంచాయతీ వార్డుసభ్యుడిగా గెలుపొంది ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1981లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పరిగి సర్పంచ్‌గా గెలుపొందిన హరీశ్వర్‌రెడ్డి.. అనంతరం పరిగి సమితి ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1983లో పరిగి అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 56 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి 38 వేల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇదే సమయంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. 1989లో ఓటమిపాలైన హరీశ్వర్‌రెడ్డి 1994, 1999, 2004, 2009లో వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. పరిగి ఎమ్మెల్యేగా అయిదు పర్యాయాలు గెలుపొంది రికార్డు సృష్టించారు. 1996లో రాష్ట్ర ఆర్థిక సంస్థ చైర్మన్‌గా, 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా హరీశ్వర్‌రెడ్డి పనిచేశారు.

అదృష్టం కలిసొచ్చి.. వరించిన సర్పంచ్ పదవి



వగ్గెల పద్మ, బండ్రిగొండ సర్పంచ్



గుగులోత్ పద్మ, పాండురంగాపురం సర్పంచ్

పాల్వంచ రూరల్: అదృష్టం ఎవరిని ఏ రూపంలో వరిస్తుందో చెప్పలేం.. ముఖ్యంగా రాజకీయాల్లో మరీ చిత్రంగా ఉంటుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురం, బండ్రిగొండ పంచాయతీ సర్పంచ్ స్థానాలు ఎస్టీ మహిళకు రిజర్వు అయ్యాయి. ఇక్కడ ఒక్కో పంచాయతీ పరిధిలో ఒక్కొక్కరు చొప్పున ఎస్టీ మహిళ ఉన్నారు. పాండురంగాపురంలో గుగులోతు పద్మ, బండ్రిగొండ పంచాయతీలో వగ్గెల పద్మ మాత్రమే ఉండగా.. వారు నామినేషన్ దాఖలు చేశారు. ఇక్కడ రెండో నామినేషన్ దాఖలు కాకపోవడంతో వారే సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రగతికి పట్టంకట్టండి

టీఆర్‌ఎస్ మద్దతుదారులను ఆదరించండి

పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేల పిలుపు.. పలు గ్రామాల్లో కొనసాగుతున్న తొలివిడుత ప్రచారం



మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలం కొమార్‌లింగంపల్లి ప్రచారసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



గద్వాల జిల్లా అల్వాలపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలో టీఆర్‌ఎస్ మద్దతుదారుడిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పంచాయతీ ఎన్నికల్లో ప్రగతికి పట్టం కట్టాలని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. గ్రామాలు అభివృద్ధి బాటలో పయనించాలంటే ఈ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. తొలివిడత పంచాయతీ ఎన్నికలు జరిగే గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం అవాల్‌పూర్, జైనథ్ మండలం గిమ్మ, ఆకోలి, సుందరగిరి, మాంగుర్ల, మేడిగూడ, పార్డి(కె), కంఠ, నిరాల, సావాపూర్, లేఖర్‌వాడ, పెండల్‌వాడ, కూర, కరంజి తదితర గ్రామాల్లో మాజీ మంత్రి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రచారం నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలం కొమార్‌లింగంపల్లి, జంగంరెడ్డిపల్లిలో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కోయిలకొండ, ధన్వాడ, నారాయణపేట మండలాల్లో నారాయణపేట ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి, జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంతోపాటు, అల్వాలపాడు గ్రామంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, వనపర్తి జిల్లా చందాపూర్, దత్తాయిపల్లి గ్రామాల్లో వనపర్తి ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వారు మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రతి గ్రామంలో టీఆర్‌ఎస్ జెండా ఎగరాలన్నారు. గ్రామంతోపాటు మండలం, జిల్లా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ మద్దతుదారులను గెలిపించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

టీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులనే గెలిపించుకుందాం..

- పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు



మహబూబాబాద్ జిల్లా పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర (మహబూబాబాద్): గ్రామపంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులనే గెలిపించుకొని అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా పాలకుర్తిలో మంగళవారం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కలిసికట్టుగా పనిచేసి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు, ఎంపీపీ జ్యోతి వెంకన్న, పాలకుర్తి ఆలయ చైర్మన్ రామచంద్రయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏకగ్రీవాలు

ప్రగతికే ఓటేస్తున్న పల్లె జనం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏకగ్రీవాల జోరు కొనసాగుతున్నది. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలో బేల్యా తండా, మోదిన్‌సాబ్ పంచాయతీలను, సిరికొండ మండలం జంగిలోడి తండా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు స్థానాలను, మోపాల్ మండలం కులాస్‌పూర్ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబారిపేటలో సర్పంచ్‌గా గోపు శ్రీనివాస్, వార్డు సభ్యులుగా శేర్ రాజం, లక్కాకుల వెంకటేశం, కరిపె మణెమ్మ, మంద అంజయ్య, కనికారపు లావణ్య, కుత్తాల రాజరెడ్డి, చింత లావణ్య, బుజ్జి, రాజేందర్‌ను ఎన్నుకొన్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం కేశవపల్లి సర్పంచ్‌గా సుధాకర్‌రెడ్డి, మర్పల్లి మండల గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి స్వగ్రామమైన పంచాలింగాల్‌లో కొండల్‌రెడ్డి సోదరుడు సురేందర్‌రెడ్డి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.



ఏకగ్రీవం తరువాత స్థానికులతో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్ రెడ్డి, ఆయన సోదరుడు సురేందర్‌రెడ్డి



నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం వన్నెల్(కె) గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌గా ఎన్నికైన కృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న టీఆర్‌ఎస్ నాయకులు

భార్య సర్పంచ్, భర్త ఉపసర్పంచ్.. వన్నెల్(కె)లో ఏకగ్రీవం

నందిపేట్ రూరల్: నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం వన్నెల్(కె) గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లుగా భార్యాభర్తలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సర్పంచ్‌గా కాటిపల్లి లలిత, ఉప సర్పంచ్‌గా కృష్ణారెడ్డిని ఎన్నుకోగా టీఆర్‌ఎస్ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లలిత మాట్లాడుతూ.. నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ దంపతులు టీఆర్‌ఎస్ మద్దతుదారులు కావడం విశేషం.

రెండో విడుత పంచాయతీ 9,447 నామినేషన్లు తిరస్కరణ

బరిలో 1,07,430 మంది అభ్యర్థులు

165 వార్డుల్లో సింగిల్ నామినేషన్లు

మూడు గ్రామాలు, 75 వార్డులకు ఎన్నికల్లేవ్

నేడు ఉపసంహరణకు అవకాశం, తుది జాబితా ప్రకటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండోవిడుతలో ఎన్నికలు జరిగే 4,135 పంచాయతీల్లో 1,07,430 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. సర్పంచ్ స్థానాలకు 20,575, వార్డు స్థానాలకు 86,855 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు అధికారులు ప్రకటించారు. బుధవారం సాయంత్రం వరకు నామినేషన్లను పరిశీలించి జాబితాను విడుదల చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉన్నది. సాయంత్రానికల్లా బరిలో నిలిచే అభ్యర్థులతోపాటు, సింగిల్ నామినేషన్లు దాఖలైన జాబితాను ఖరారు చేయనున్నారు. రెండో విడుతలో మొత్తం 4,135 గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగాల్సి ఉండగా.. మూడుచోట్ల నామినేషన్లు ఒక్కటి కూడా దాఖలు కాలేదు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం వెంకటాపూర్‌లో ఏకగ్రీవం చేసుకొనేందుకు జరిపిన చర్చలు ఆలస్యం కావడంతో నామినేషన్ వేయలేకపోయారు. ఇదే మండలం రహపల్లి గ్రామం ఎస్టీకి రిజర్వ్ కాగా.. ఇక్కడ ఎస్టీలు ఎవరూ లేకపోవడంతో నామినేషన్లు దాఖలు కాలేదు. ఈ జిల్లాలోని రెండు గ్రామ పంచాయతీలు, 26 వార్డులకు ఎన్నికలు జరుగడం లేదు. ఆదిలాబాద్ జిల్లా కొబ్బాయి మాంగ్‌రోడ్ గ్రామంలో కోర్టు కేసు కారణంగా ఎన్నికలు నిర్వహించడంలేదు. ఈ గ్రామ సర్పంచ్‌తోపాటు ఏడు వార్డులకు ఎన్నికలు జరుగడంలేదు. ఇక 75 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. వీటిలో కొన్ని వార్డులకు నామినేషన్లు వేసినా.. చెల్లుబాటు కాలేదు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని మూడు గ్రామపంచాయతీల పరిధిలో 18 వార్డులు, వనపర్తి జిల్లాలోని 7 గ్రామపంచాయతీల పరిధిలో 147 వార్డులకు సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయి.

23 వరకు ప్రచారం.. 25న పోలింగ్

రెండో విడుతలో 4,132 గ్రామాల్లో బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను అధికారులు గురువారం విడుదల చేయనున్నారు. షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణలకు అవకాశం ఉన్నది. ఉపసంహరణల అనంతరం సింగిల్ నామినేషన్లను గుర్తించి, వాటిపై సాధారణ పరిశీలకులతో విచారణ జరిపించి.. ఏకగ్రీవాలను ప్రకటించనున్నారు. పోటీలో ఉండే అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నారు. ఈ నెల 23 సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం చేసుకోవడానికి అవకాశం ఉండగా, 25న రెండోవిడుత పోలింగ్ జరుగనున్నది.

సర్పంచ్ అభ్యర్థులు 20,575 వార్డు స్థానాలకు 86,855

రెండోవిడుతలో ఈ నెల 13 వరకు నామినేషన్ల స్వీకరణ పూర్తిచేసిన అధికారులు.. నామినేషన్ల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 9,447 నామినేషన్లను తిరస్కరించారు. 4,132 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 25,419 నామినేషన్లు వేయగా.. 4,844 నామినేషన్లు వివిధ కారణాలతో చెల్లుబాటు కాలేదు. తుది జాబితాలో 20,575 మంది అభ్యర్థుల నామినేషన్లు ఉన్నాయి. 36,602 వార్డులుండగా.. 75 వార్డులకు నామినేషన్లు వేయలేదు. మిగిలిన వార్డులకు మొత్తం 91,458 నామినేషన్లు దాఖలుకాగా, 4,603 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 86,855 నామినేషన్లు మిగిలాయి. సర్పంచ్, వార్డు స్థానాల్లో మొత్తం 9,447 నామినేషన్లు తిరస్కరించారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాలోని 276 పంచాయతీల్లో 1,934 మంది, మహబూబ్‌నగర్ జిల్లాలో 243 పంచాయతీల్లో 1,021, రంగారెడ్డి జిల్లాలోని 181 పంచాయతీల్లో 966 మంది బరిలో ఉన్నారు.

మూడో విడుతకు నోటిఫికేషన్

మొదటిపేజీ తరువాయి...

4,166 సర్పంచ్ పదవులకు 1,729 నామినేషన్లు, 36,729 వార్డు సభ్యులకు 3,561 నామినేషన్లు దాఖలయ్యాయి. 19న నామినేషన్లను పరిశీలించి, అర్హుల జాబితాను అదే రోజు సాయంత్రం విడుదల చేయనున్నారు. 20న అభ్యంతరాలను స్వీకరించి, 21న పరిశీలిస్తారు. 22 మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం కల్పించి, సాయంత్రం తుదిజాబితా ప్రకటిస్తారు. సింగిల్ నామినేషన్లపై విచారణ జరిపి, ఏకగ్రీవమైనట్టు ధ్రువీకరిస్తారు. 30న మూడో విడుత పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం ఫలితాలను ప్రకటిస్తారు. మూడో విడుతలో 4,115 గ్రామాలకే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. కానీ నల్లగొండ జిల్లా మాసాయిపల్లి గ్రామ ఎన్నిక మొదటి విడుతలో ఉండగా, ఓటరు జాబితా సవరణ నేపథ్యంలో మూడో విడుతకు మార్చారు. దీంతో మూడో విడుతలో పంచాయతీల సంఖ్య 4,116కు చేరింది. మొత్తంగా తొలి విడుతలో 4479 గ్రామాలు, 39,832 వార్డులు, రెండో విడుతలో 4,137 గ్రామాలు, 36,620 వార్డులు, మూడో విడుతలో 4,116 గ్రామాలు, 36,718 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

కొన్ని గ్రామాలకు ఫిబ్రవరిలో ఎన్నికలు!

ప్రస్తుతం రాష్ట్రంలో తొలి విడుతలో 11 గ్రామాలు, రెండో విడుతలో మూడు గ్రామాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. రిజర్వేషన్లు కలిసిరాకపోవడం, కోర్టు కేసులు, ఏకగ్రీవాల చర్చల నేపథ్యంలో ఇప్పటి వరకు రెండు విడుతల్లో 14 గ్రామాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. ఈ గ్రామాలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంపై ఉత్కంఠ నెలకొన్నది. వీటికి మూడో విడుతలోనే ఎన్నికలు పూర్తి చేయాలని, రిజర్వేషన్లను అనుకూలంగా మార్చాలంటూ ఆయా గ్రామాల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. ఎస్టీ జనాభా లేని గ్రామాలను ఎస్టీలకు కేటాయించారని, జనాభా ప్రాతిపదిక రిజర్వేషన్లు మార్చాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతులు అందాయి. వీటిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో మూడో విడుతలో ఈ పంచాయతీలకు ఎన్నికలు జరుగడం లేదు. వీటికి ఫిబ్రవరిలోనైనా ఎన్నికలు నిర్వహించాలనే విజ్ఞప్తుల నేపథ్యంలో మరోసారి పంచాయతీరాజ్‌శాఖ నుంచి క్లియరెన్స్ తీసుకోవాలని ఎన్నికల సంఘం భావిస్తున్నది.



బుధవారం సచివాలయంలో రాష్ట్ర ఆర్థిక సంఘం సమీక్ష నిర్వహిస్తున్న తెలంగాణ ఆర్థిక సంఘం చైర్మన్ జీ రాజేశంగౌడ్

గ్రామాల అభివృద్ధికి బృహత్తర కార్యక్రమాలు

- వచ్చేనెలలో పలు రాష్ట్రాల్లో పంచాయతీల పరిశీలన
- కొత్త చట్టంతోపాటు ఇతర పథకాలపై అధ్యయనం
- ఫిబ్రవరిలో ఆర్థిక సంఘం నూతన భవనం ప్రారంభం
- సమీక్షలో ఆర్థిక సంఘం చైర్మన్ రాజేశంగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బృహత్తర కార్యక్రమాలను అమలుచేయనున్నారని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ జీ రాజేశంగౌడ్ అన్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టంతో దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. సచివాలయంలో ఆర్థికసంఘం కార్యదర్శి సురేశ్‌చందా, సభ్యుడు చెన్నయ్య, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డితోపాటు ఈఈ, డీఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకొన్నారు. ఆయా రాష్ట్రాల్లో పంచాయతీల అభివృద్ధికి తీసుకొంటున్న చర్యలు, వెచ్చిస్తున్న నిధులపై ఆర్థిక సంఘం బృందం పరిశీలన చేస్తుందని పేర్కొన్నారు. వచ్చేనెలలో పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ బృందం పర్యటిస్తుందని తెలిపారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలతోపాటు ఆయా రాష్ట్రాల్లో అమల్లో ఉన్న వాటిని పరిశీలించి అమలు అవకాశాలను సమీక్షిస్తామని వెల్లడించారు. ఆర్థిక సంఘ భవనం ఆధునీకరణ పనులను సమీక్షించారు. ఈ పనులు దాదాపు 80 శాతం పూర్తిచేశామని రాజేశంగౌడ్ వివరించారు. ఆర్థిక సంఘం భవనంలో మొక్కలు నాటుతున్నామని, దీని కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఫిబ్రవరి మొదటి వారంలోనే నూతన ఆర్థిక సంఘం భవనాన్ని ప్రారంభిస్తామని రాజేశంగౌడ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈఈ శారద, సురేశ్‌గౌడ్, డీఈఈ జ్యోతి, గంగాధర్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
ఆట
10
[కరీంనగర్]
గురువారం 17 జనవరి 2019
WWW.NTNEWS.COM

ఓవరాల్ చాంప్ తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్

మొత్తం 116 పతకాలతో తొలిస్థానం అందించిన రాష్ట్ర విద్యార్థులు

హైదరాబాద్: తొలిసారి రాష్ట్రం అతిథ్యమిచ్చిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ జాతీయ క్రీడలపోటీల్లో తెలంగా ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యధిక పతకాలతో తొలిస్థానంలో నిలిచారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు దాదాపు 2వేల మంది వివిధ క్రీడాంశాల్లో పోటీపడ్డారు. తెలంగాణ విద్యార్థులు 52 స్వర్ణ,48 రజత, 16 కాంస్యాలతో మొత్తం 116 పతకాలు సాధించి తొలిస్థానంతో ఓవరాల్ చాంపియన్‌గా నిలువగా.. 16 స్వర్ణ,16 రజత,4 కాంస్యాలతో మహారాష్ట్ర గిరిజన విద్యార్థులు రెండోస్థానంలో నిలిచారు. కాగా, 9 స్వర్ణ, 1రజతంతో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు మూడోస్థానం సంపాదించారు. సోమవారం గచ్చిబౌలిలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జుయల్ ఓరమ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో కేంద్ర గిరిజన వ్యవహారాల సహాయమంత్రి సుదర్శన్ భగత్, కేంద్ర గిరిజన క్రీడల కార్యదర్శి దీపక్ ఖండేకర్, తెలంగాణ గురుకులాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్ దత్తా తదితరులు పాల్గొన్నారు. దేశంలోనే తొలిసారిగా గిరిజన జాతీయ క్రీడలను అద్భుతంగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వంపై మంత్రి జుయల్ ఓరమ్ ప్రశంసల వర్షం కురిపించారు.



హైదరాబాద్, గచ్చిబౌలి స్టేడియంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల జాతీయస్థాయి క్రీడల పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీ అందిస్తున్న కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరమ్. చిత్రంలో తెలంగాణ గురుకులాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు.



ధోనీ విలువను లెక్క కట్టలేం..


ధోనీ (55★)

న్యూఢిల్లీ: టీమ్ ఇండియాలో ధోనీ విలువను లెక్కకట్టలేమని బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అన్నాడు. బ్యాటింగ్‌లో నిలకడ లేకపోయినా.. అతని ప్రదర్శనను తక్కువగా అంచనా వేయొద్దని సూచించాడు. తన సూపర్ ఫినిషింగ్ ట్యాగ్‌ను నిలబెట్టుకుంటూ రెండో వన్డేలో మ్యాచ్‌ను గెలిపించిన తర్వాత సన్నీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'మహీని ఒంటరిగా వదిలేయాలని నా విజ్ఞప్తి. యువ క్రికెటర్లలో ఉండే నిలకడ అతనిలో లేకపోవచ్చు. కానీ జట్టులో అతని విలువను లెక్కకట్టలేం. కొద్దిగా ఓపిక పట్టండి. అతడేంటో, అతని విలువేంటో తెలిసిపోతుంది. రాబోయే వన్డే ప్రపంచకప్‌లో మహీ అత్యంత కీలకం. ఇప్పటికీ అతను విలువైన ఆటగాడే' అని సన్నీ పేర్కొన్నాడు. మ్యాచ్ చివరి ఓవర్లలో విరాట్ బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేయడం సరైందేనన్నాడు. వికెట్ల వెనుక ఉండే ధోనీ మ్యాచ్ పరిస్థితులను సరిగా అంచనా వేసి అవసరమైన చిన్నపాటి మార్పులు అద్భుతంగా చేస్తున్నాడన్నాడు. 'విరాట్‌కు ధోనీపై నమ్మకం ఎక్కువ. ప్రతి బంతికి బౌలర్ దగ్గరకు వెళ్లి కెప్టెన్ సలహాలు ఇవ్వలేడు. కానీ వికెట్ల వెనుక ఉండే మహీ ఈ పనిని అద్భుతంగా చేస్తున్నాడు. ఫీల్డింగ్ మార్పులను కూడా వేగంగా చేస్తున్నాడు. చివర్లో విరాట్ బౌండరీ లైన్ దగ్గర ఉండటం జట్టుకు చాలా లాభిస్తుంది. పరుగులు ఆపడంతోపాటు కీలకమైన క్యాచ్‌లు అందుకుంటాడు. దీని వల్ల బౌలర్లపై ఒత్తిడి తగ్గుతుంది' అని గవాస్కర్ వ్యాఖ్యానించాడు.

ధోనీ షార్ట్ రన్..

టెక్నాలజీ ఎంత పెరిగినా.. ఫీల్డ్‌లో అంపైర్ల తప్పిదాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. రెండో వన్డేలో ధోనీ షార్ట్ రన్‌ను అటు అంపైర్లుగానీ, ఇటు ఆసీస్ ఫీల్డర్లుగానీ గుర్తించలేకపోయారు. నాథన్ లైయన్ వేసిన ఇన్నింగ్స్ 45వ ఓవర్ ఆఖరి బంతిని ధోనీ ఆఫ్‌సైడ్‌కు నెట్టి పరుగు తీశాడు. కానీ దానిని సరైన క్రమంలో పూర్తి (షార్ట్ రన్) చేయలేకపోయాడు. అంటే బౌలర్ ఎండ్ క్రీజులో మహీ బ్యా ట్‌ను పెట్టలేదు. ఈ విషయాన్ని ఎవరూ గుర్తించకపోగా, ఓవర్ పూర్తయినట్లు ప్రకటించిన అంపైర్లు ధోనీ, భారత్ ఖాతాలో ఓ పరుగును చేర్చారు. కానీ ఈ విషయాన్ని ఆసీస్ మాజీ వికెట్ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ వీడియో ఫుటేజ్‌తో సహా బయటపెట్టడంతో ఇప్పుడు చర్చనీయాంశమైంది. ధోనీ షార్ట్ రన్‌ను అంపైర్లు గుర్తిస్తే గెలుపుపై కొద్దిగానైనా ప్రభావం చూపేదని గిల్‌క్రిస్ట్ అన్నాడు.

మహీకి కోపమొచ్చింది..
మ్యాచ్ ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా.. ధోనీ మాత్రం చాలా కూల్‌గా ఉంటాడు. సహచరులపై అరవడం, పిచ్చి వేషాలు వేయడం అసలు చేయడు. చాలా సందర్భాల్లో ఇది కనిపించినా.. రెండో వన్డేలో మాత్రం మిస్టర్ కూల్ కాస్త ఆవేశపరుడయ్యాడు. మ్యాచ్ మంచి రసవత్తరంగా సాగుతున్న సమయంలో అంపైర్లు డ్రింక్స్ బ్రేక్ ఇచ్చారు. ఈ సమయంలో 12, 13వ ఆటగాళ్లుగా ఉన్న ఖలీల్ అహ్మద్, చాహల్ డ్రింక్స్ తీసుకొని ధోనీ-కార్తీక్‌కు ఇచ్చేందుకు మైదానంలోకి వచ్చారు. ఈ క్రమంలో ఖలీల్ పిచ్‌పై నుంచి పరుగెత్తాడు. అంతే అప్పటివరకు కూల్‌గా ఉన్న ధోనీ ఒక్కసారిగా కోపోద్రిక్తుడయ్యాడు. 'ఏయ్ ఎక్కడ నడుస్తున్నావ్? పిచ్ పక్క నుంచి రావొచ్చు కాదా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్‌లో వైరల్ అయ్యింది. పరుగులు ఎక్కువగా చేయాల్సి ఉండటం, పిచ్‌పై నడిస్తే పాడవుతుందనే ఉద్దేశంతో ధోనీ సీరియస్ కాగా నెటిజన్లు కూడా మహీకే మద్దతిస్తున్నారు. మొన్న కుల్దీప్, ఇప్పుడు ఖలీల్.. ఈ కుర్రాళ్లు.. మిస్టర్ కూల్‌కు ఎందుకు కోపం తెప్పిస్తున్నారంటూ సెటైర్లు వేస్తున్నారు.

విరాట్ మహిమ



కోహ్లీ (104)

సెంచరీ, అర్ధసెంచరీలతో చెలరేగిన కెప్టెన్, మాజీ కెప్టెన్ ■ రెండో వన్డేలో 6 వికెట్ల తేడాతో భారత్ గెలుపు మూడు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమం ■ షాన్ మార్ష్ సెంచరీ వృథా

అడిలైడ్: తొలి వన్డే ఓటమి నుంచి భారత్ తొందరగానే తేరుకుంది. కెప్టెన్ విరాట్ కోహ్లీ (112 బంతుల్లో 104; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరోచిత ఇన్నింగ్స్‌కు తోడుగా సూపర్ ఫినిషర్ ధోనీ (54 బంతుల్లో 55 నాటౌట్; 2 సిక్సర్లు) శివాలెత్తడంతో.. మంగళవారం ముగిసిన రెండో వన్డేలో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై గెలిచింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 298 పరుగులు చేసింది. షాన్ మార్ష్ (123 బంతుల్లో 131; 11 ఫోర్లు, 3 సిక్సర్లు) కెరీర్‌లో ఏడో శతకంతో దుమ్మురేపగా, మ్యాక్స్‌వెల్ (37 బంతుల్లో 48; 5 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే అండగా నిలిచాడు. శుక్రవారం ఇరుజట్ల మధ్య రేపు మూడో వన్డే జరుగుతుంది.

మార్ష్ పోరాటం..
ఆరంభంలో టీమ్‌ఇండియా పేసర్లు భువీ (4/45), షమీ (3/58) దెబ్బకు కంగారూల టాప్ లేచింది. క్యారీ (18), ఫించ్ (6) తొందరగానే ఔటయ్యారు. దీంతో 26/2 స్కోరు వద్ద క్రీజులోకి వచ్చిన మార్ష్ యాంకర్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. ఖలీల్ అహ్మద్ స్థానంలో హైదరాబాద్ పేసర్ సిరాజ్ అరంగేట్రం చేసినా ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. మార్ష్‌తో కలిసి మూడో వికెట్‌కు 56 పరుగులు జోడించిన ఖవాజ(21)ను 19వ ఓవర్‌లో జడేజా (1/49) సూపర్ త్రోకు రనౌటయ్యాడు. ఈ దశలో మార్ష్‌కు జత కలిసిన హ్యాండ్స్‌కోంబ్ (20), స్టొయినిస్ (29) క్రీజులో ఉన్నంతసేపు మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ముగ్గురు కలిసి నాలుగు, ఐదు వికెట్లకు 52, 55 పరుగుల భాగస్వామ్యాలు జోడించి ఇన్నింగ్స్‌ను పటిష్ఠం చేశారు. 37వ ఓవర్‌లో మ్యాక్స్‌వెల్ రాకతో ఇన్నింగ్స్ స్వరూపం మారిపోయింది. దూకుడుగా ఆడుతూ భారీ షాట్లు బాదడంతో ఆసీస్ స్కోరు 39 ఓవర్లలోనే 200లకు చేరింది. ఈ క్రమంలో మార్ష్ 108 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో సిరాజ్‌కు అదృష్టం కలిసి రాలేదు. మ్యాక్స్‌వెల్ 26, 41 పరుగుల వద్ద రెండుసార్లు సిరాజ్ బౌలింగ్‌లో ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఓసారి డీఆర్‌ఎస్‌లో, మరోసారి రోహిత్ క్యాచ్ వదిలేశాడు. మార్ష్, మ్యాక్స్‌వెల్ ఆరో వికెట్‌కు 94 పరుగులు జోడించారు. కానీ మూడు బంతుల వ్యవధిలో ఈ ఇద్దరూ ఔట్ కావడం, తర్వాత వచ్చిన బ్యాట్స్‌మెన్ ఒత్తిడికి గురికావడంతో ఆసీస్ స్కోరు 300లు దాటలేదు.


షాన్‌మార్ష్ (131)

చేజ్ మాస్టర్ విరాట్..
299 పరుగుల లక్ష్యాన్ని భారత్ 49.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రోహిత్ (43), ధవన్ (32) ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ శుభారంభాన్నిచ్చారు. తొలి వికెట్‌కు 47 పరుగులు జోడించి ధవన్ ఔటైనా.. రోహిత్ అండతో విరాట్ చెలరేగిపోయాడు. ఈ ఇద్దరి దూకుడుతో టీమ్ ఇండియా 18వ ఓవర్‌లోనే 100కు చేరింది. ఇన్నింగ్స్ సాఫీగా సాగుతున్న తరుణంలో 18వ ఓవర్‌లో రోహిత్ భారీ షాట్‌కు ప్రయత్నించి రోప్ వద్ద హ్యాండ్స్‌కోంబ్ చేతికి చిక్కాడు. దీంతో రెండో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఓ ఎండ్‌లో అలవోకగా బ్యాటింగ్ చేసిన విరాట్.. స్ట్రయిక్ రొటేట్‌తో పాటు కఠినమైన బంతులను కూడా బౌండరీలుగా మలిచాడు. కానీ అంబటి రాయుడు (24) టైమింగ్‌తో బాగా ఇబ్బందిపడ్డాడు. చివరకు 31వ ఓవర్‌లో మ్యాక్స్‌వెల్‌కు వికెట్ ఇచ్చుకోవడంతో మూడో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక కోహ్లీతో జతకలిసిన ధోనీ తన మునుపటి ఫామ్‌ను చూపెట్టాడు. వికెట్ల మధ్య వేగంగా పరుగులు తీస్తూ తెలివిగా సింగిల్స్, డబుల్స్ రాబట్టాడు. రెండు అద్భుతమైన సిక్సర్లు సంధించిన విరాట్ 108 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. అదే ప్రయంతో మరో షాట్‌కు ప్రయత్నించి 44వ ఓవర్‌లో డీప్ మిడ్‌వికెట్‌లో మ్యాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఫలితంగా మహీతో నాలుగో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చేయాల్సిన రన్‌రేట్ ఎక్కువగా ఉన్నా.. కార్తీక్ (25 నాటౌట్)తో కలిసి ధోనీ తనదైన శైలిలో మ్యాచ్‌ను ముగించాడు. ఆఖరి ఓవర్‌లో ఏడు పరుగులు కావాల్సిన దశలో తొలి బంతిని సిక్సర్‌గా మలిచిన మహీ.. తర్వాతి బంతికి సింగిల్ తీసి లాంఛనం పూర్తి చేశాడు. ఐదో వికెట్‌కు అజేయంగా 57 పరుగులు జత చేశారు.

స్కోరు బోర్డు

ఆస్ట్రేలియా: క్యారీ (సి) ధవన్ (బి) షమీ 18, ఫించ్ (బి) భువనేశ్వర్ 6, ఖవాజ రనౌట్ 21, మార్ష్ (సి) జడేజా (బి) భువనేశ్వర్ 131, హ్యాండ్స్‌కోంబ్ (స్టంప్) ధోనీ (బి) జడేజా 20, స్టొయినిస్ (సి) ధోనీ (బి) షమీ 29, మ్యాక్స్‌వెల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 48, రిచర్డ్‌సన్ (సి) ధవన్ (బి) షమీ 2, లైయన్ నాటౌట్ 12, సిడెల్ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 0, బెహ్రెన్‌డార్ఫ్ నాటౌట్ 1, **ఎక్స్‌ట్రాలు:** 10, **మొత్తం:** 50 ఓవర్లలో 298/9.**వికెట్లపతనం:** 1-20, 2-26, 3-82, 4-134, 5-189, 6-283, 7-283, 8-286, 9-286.**బౌలింగ్:** భువనేశ్వర్ 10-0-45-4, షమీ 10-0-58-3, సిరాజ్ 10-0-76-0, కుల్దీప్ 10-0-66-0, జడేజా 10-1-49-1.

భారత్: రోహిత్ (సి) హ్యాండ్స్‌కోంబ్ (బి) స్టొయినిస్ 43, ధవన్ (సి) ఖవాజ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 32, కోహ్లీ (సి) మ్యాక్స్‌వెల్ (బి) రిచర్డ్‌సన్ 104, రాయుడు (సి) స్టొయినిస్ (బి) మ్యాక్స్‌వెల్ 24, ధోనీ నాటౌట్ 55, కార్తీక్ నాటౌట్ 25, **ఎక్స్‌ట్రాలు:** 16, **మొత్తం:** 49.2 ఓవర్లలో 299/4.**వికెట్లపతనం:** 1-47, 2-101, 3-160, 4-242.**బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 8.2-1-52-1, రిచర్డ్‌సన్ 10-0-59-1, సిడెల్ 8-0-58-0, లైయన్ 10-0-59-0, స్టొయినిస్ 9-0-46-1, మ్యాక్స్‌వెల్ 4-0-16-1.

అచ్చొచ్చిన జనవరి 15

ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్న విరాట్ కోహ్లీకి కొన్ని సెంటిమెంట్లు కూడా బాగా కలిసొస్తున్నాయి. ఇందులో ఒకటి.. జనవరి 15వ తేదీన సెంచరీ కొట్టడం. గత రెండేండ్లుగా వస్తున్న ఆనవాయితీ ఈ ఏడాది కూడా కొనసాగింది. 15 జనవరి 2017న పుణెలో భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లో విరాట్ 122 (105 బంతుల్లో) పరుగులు చేశాడు. ఆ ఏడాది అతనికి అదే తొలి శతకం కావడం విశేషం కాగా, ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 3 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై గెలిచింది. 2018 జనవరి 13-17 వరకు సెంచూరియన్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండో టెస్ట్ జరిగింది. మ్యాచ్ మూడో రోజు అంటే జనవరి 15న విరాట్ (153) సెంచరీ బాదేశాడు. ఆ ఏడాది అదే తొలి శతకం. అయితే ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఓటమిపాలైంది. మొన్న జనవరి 15 జనవరి 2019న.. ఆస్ట్రేలియాపై రెండో వన్డేలో విరాట్ (104) సెంచరీతో చెలరేగాడు. ఈ ఏడాది ఇదే తొలి సెంచరీ కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా నెగ్గింది. మొత్తానికి కోహ్లీ కెరీర్‌లో జనవరి 15 ఓ ప్రత్యేకతను సంతరించుకుంటున్నది.

రెండోరౌండ్లో సైనా, కశ్యప్





కౌలాలంపూర్: గట్టిపోటీ ఎదుర్కొన్నా మలేషియా ఓపెన్‌లో హైదరాబాద్ స్టార్ షట్లర్ సైనా అదరగొట్టింది. బుధవారం హాంకాంగ్ అమ్మాయి జాయ్ వాన్ డెంగ్‌పై 14-21,21-18,21-18 స్కోరుతో విజయం సాధించి రెండోరౌండ్లో అడుగుపెట్టింది. తొలిగేమ్‌ను చేజార్చుకున్నా అద్భుతమైన ఆటతీరుతో సైనా మ్యాచ్‌లో విజయాన్ని అందుకుంది. 65 నిమిషాలపాటు కొనసాగిన ఈ మ్యాచ్ ఆద్యంతం హోరాహోరీగా సాగడం విశేషం. రెండో రౌండ్‌లోనూ హాంకాంగ్ షట్లర్ పుయ్ యిన్ యిప్‌తో సైనా తలపడనుంది.మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్, ఇటీవలే సైనాను పెండ్లి చేసుకున్న పారుపల్లి కశ్యప్ విజయాలతో రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు. హాంకాంగ్ ఆటగాడు ఆంగస్ కా లాంగ్‌ను 21-17,21-11 స్కోరుతో శ్రీకాంత్ వరుసగేముల్లో విజయాన్నందుకున్నాడు. సైనా పోరాడినమాదిరిగానే కశ్యప్ సైతం తొలిరౌండ్లో విజయం సాధించేందుకు చెమటోడ్చాడు. 19-21,21-19,21-10 స్కోరుతో డెన్మార్క్ ఆటగాడు రాస్మస్ జెంకోపై కశ్యప్ కష్టపడి నెగ్గాడు. రెండోరౌండ్‌లో ఇండోనేషియా స్టార్ ఆంటోనీ సినిసుకాతో తలపడనుండగా, విన్సెట్ వింగ్ కీ వాంగ్‌తో రెండోరౌండ్‌లో శ్రీకాంత్ ఢీకొట్టనున్నాడు. కాగా, మహిళల డబుల్స్‌లో భారత నంబర్‌వన్ అశ్విని పొన్నప్ప, సిక్కిరెడ్డి జోడీ 21-16,22-20 స్కోరుతో తొలిరౌండ్‌లోవిజయం సాధించి ముందంజ వేశారు.

అండర్సన్‌కు షాక్..

రెండోరౌండ్‌లో ఓడిన దక్షిణాఫ్రికా స్టార్...
మూడోరౌండ్‌లో మాజీ చాంపియన్లు ఫెదరర్, నాదల్
మహిళల సింగిల్స్‌లో దూసుకెళుతున్న డిఫెండింగ్ చాంపియన్ వోజ్నియాకి, కెర్బర్, షరపోవా
ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి అజరెంకా ఔట్


షరపోవా

మెల్‌బోర్న్: అలనాటి అందాలతార మరియా షరపోవా ఆస్ట్రేలియన్ ఓపెన్ మూడోరౌండ్‌కు దూసుకెళ్లింది. కాస్త ప్రతిఘటన ఎదుర్కొన్నా డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ సునాయాసంగా మూడోరౌండ్‌కు చేరుకున్నాడు. మరోవైపు సోమవారం జరిగిన ఇతర మ్యాచ్‌లలో దక్షిణాఫ్రికా యువ సంచలనం కెవిన్ అండర్సన్, మాజీ చాంపియన్, బెలారస్ భామ విక్టోరియా అజరెంకా అనూహ్యంగా రెండోరౌండ్‌లో పరాజయాలతో ఈ ఏటి తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ నుంచి నిష్క్రమించారు. కాగా, మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ కరోలిన్ వోజ్నియాకి, అమెరికా తార స్లాయెన్ స్టీఫెన్స్, రెండోసీడ్ ఏంజెలిక్ కెర్బర్, రష్యాకు చెందిన అనస్తాసియా పావ్లీయుచెంకోవా విజయాలతో ముందంజ వేశారు.

ఎదురులేని నాదల్, ఫెదరర్
టెన్నిస్‌లో తిరుగులేని విజయాలతో దిగ్గజ హోదా సంపాదించుకున్న స్విస్ యోధుడు రోజర్ ఫెదరర్ 7-6 (7/5), 7-6 (7/3), 6-3స్కోరుతో బ్రిటన్ క్వాలిఫయర్ డాన్ ఇవాన్స్‌పై కష్టపడి గెలిచాడు. ఓపెన్ శకంలో రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో 7 టైటిళ్లు సాధించిన తొలి ఆటగాడిగా నిలిచేందుకు రోజర్ తపన పడుతున్నాడు. ఇప్పటికే వింబుల్డన్‌లో 8, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 6 టైటిళ్లను ఫెదరర్ కైవసం చేసుకున్నాడు. అంతేకాదు 6 ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిళ్లతో క్రొయేషియా స్టార్ నొవాక్ జొకోవిచ్, ఆస్ట్రేలియా దిగ్గజం రాయ్ ఎమర్సన్‌తో సంయుక్తంగా ఫెదరర్ ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. పురుషుల సింగిల్స్‌లో రెండోసీడ్ నాదల్ 6-3,6-2,6-2స్కోరుతో స్థానిక ఆటగాడు మాథ్యూ ఎబ్డెన్‌ను చిత్తుగా ఓడించాడు.

అండర్సన్ నిష్క్రమణ
సంచలన ఆటగాడు కెవిన్ అండర్సన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండోరౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. అమెరికా యువ ఆటగాడు తియాఫోయ్ చేతిలో 4-6, 6-4, 6-4, 7-5స్కోరుతో అండర్సన్ పరాజయం పాలయ్యాడు. ఆట ప్రారంభం నుంచి మోచేతిగాయంతో ఇబ్బంది పడిన అండర్సన్.. తియాఫోమ్ జోరును అడ్డుకోలేకపోయాడు. గతేడాది వింబుల్డన్ ఫైనల్లో జొకోవిచ్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా స్టార్ టోర్నీ నుంచి వైదొలిగిన అతితక్కువ ర్యాంక్ ఆటగాడిగా నిలిచాడు.

మూడోరౌండ్‌లో షరపోవా, వోజ్నియాకి ఢీ
మహిళల సింగిల్స్‌లో మాజీ చాంపియన్ మరియా షరపోవా పూర్వపు ఆటతీరుతో అదరహో అనిపిస్తున్నది. సోమవారం జరిగిన రెండోరౌండ్ మ్యాచ్‌లో స్వీడన్ అమ్మాయి రెబెక్కా పీటర్సన్‌ను 6-2,6-1 స్కోరుతో వరుసగా రెండోగేమ్‌లోనూ సునాయాస విజయ సాధించింది. తొలిరౌండ్‌లో షరపోవా 6-0,6-0తో విజయం సాధించిన సంగతి తెలిసిందే. మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కరోలినా వోజ్నియాకితో పోటీ పడనుంది. రెండోరౌండ్‌లో వోజ్నియాకి 6-1,6-3 స్కోరుతో స్వీడన్‌కు చెందిన జొహన్నా లార్సన్‌ను ఓడించింది. మూడుసార్లు గ్రాండ్‌స్లామ్స్ చాంపియన్ ఏంజెలికా కెర్బర్ 6-2,6-3 స్కోరుతో బ్రెజిల్ క్వాలిఫయర్ బేట్రిజ్ హద్దాద్ మైయాను ఓడించింది. కాగా, ఆస్ట్రేలియన్ ఓపెన్ మాజీ చాంపియన్ విక్టోరియా అజరెంకో రెండోరౌండ్‌లోనే నిష్క్రమించి నిరాశ పరిచింది.


బాలికల విభాగంలో జాతీయ హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా నిలిచిన తెలంగాణ బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

తెలంగాణ డబుల్ ధమాకా

చాంపియన్‌షిప్ సాధించిన రాష్ట్ర బాలుర, బాలికల జట్లు

64వ జాతీయ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్

కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరుగుతున్న 64వ జాతీయ హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ బాల బాలికలు సత్తా చాటారు. బాలుర, బాలికల విభాగంలో బుధవారం జరిగిన ఫైనల్ పోరులో రాష్ట్ర విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. తొలుత బాలికల విభాగంలో జరిగిన ఫైనల్ పోరులో మన రాష్ట్ర జట్టు 16-12 పాయింట్లతో హర్యానా జట్టును ఓడించారు. అనంతరం జరిగిన బాలుర ఫైనల్లో భాగంగా ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో 25-19 పాయింట్లతో రాష్ట్ర బాలుర జట్టు అద్వితీయ విజయాన్నందుకుంది. ముగింపు వేడుకలకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందించారు. బాలుర విభాగంలో పంజాబ్ జట్టు.. బాలికల విభాగంలో ఢిల్లీ జట్టు మూడోస్థానంలో నిలిచాయి.

సెన్సెక్స్	నిఫ్టీ
36,321	10,890
↗3	↗3

ముడి చమురు (బ్రెంట్) ↗ 60.67 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	33,190
22 క్యారెట్లు	33,040
వెండి (కిలో)	40,500

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	68.10	74.60
యూరో	78.10	86.10
బహ్రెయిన్ దినార్	181.00	193.00
కువైట్ దినార్	224.90	237.90
సౌదీ రియాల్	17.90	19.70
యూఏఈ దిర్హామ్	18.30	19.90

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	87.00
రిటైల్ లైవ్	109.00
డ్రెస్డ్	158.00
స్కిన్‌లెస్	180.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	433-00
రంగారెడ్డి	433-00
మెదక్	433-00
కరీంనగర్	435-00
వరంగల్	435-00
రిటైల్ ప్రైస్	4-95

రూ.6వేల కోట్ల మూలధనం

ఎగ్జిమ్ బ్యాంక్‌కు అందివ్వాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 16: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ భారతీయ ఎగుమతి-దిగుమతి బ్యాంక్ (ఎగ్జిమ్ బ్యాంక్)కు రూ.6,000 కోట్ల మూలధన సాయానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో బుధవారం ఇక్కడ సమావేశమైన మంత్రివర్గం పలు నిర్ణయాలను తీసుకున్నది. సమావేశం అనంతరం రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ విలేఖరులతో మాట్లాడుతూ 'ఎగ్జిమ్ బ్యాంక్‌కు రూ.6,000 కోట్ల మూలధన సాయం నిమిత్తం ప్రభుత్వం రీక్యాపిటలైజేషన్ బాండ్లను జారీ చేయనున్నది' అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) రూ.4,500 కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20) రూ.1,500 కోట్లు సమకూర్చాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. దీంతో ఈ ఏడాది మార్చి 31లోగా తొలి విడుత రూ.4,500 కోట్ల సాయం బ్యాంక్‌కు అందనున్నది. ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఈ రీక్యాపిటలైజేషన్ బాండ్లను జారీ చేసి నిధులను సేకరిస్తామని వివరించారు. అలాగే బ్యాంక్ ఆథరైజ్డ్ క్యాపిటల్‌నూ రూ.10,000 కోట్ల నుంచి రూ.20,000 కోట్లకు పెంచినట్లు మంత్రి తెలిపారు. 1982లో ఎగ్జిమ్ బ్యాంక్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయగా, భారతీయ అంతర్జాతీయ వాణిజ్య ప్రోత్సాహానికి ఇది దోహదం చేస్తున్నది.

ఒకే రోజులో ఐటీఆర్ ప్రాసెస్


తర్వాతి తరం ఆదాయం పన్ను (ఐటీ) దాఖలు వ్యవస్థకు క్యాబినెట్ లైన్‌క్లియర్ చేసింది. దేశీయ ఐటీ రంగంలో రెండో అతిపెద్ద సంస్థయైన ఇన్ఫోసిస్‌కు ఈ వ్యవస్థ అభివృద్ధి బాధ్యతలను అప్పగించింది. ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ.4,241.97 కోట్లు. ఐటీ రిటర్న్ ఫైలింగ్స్ ప్రాసెసింగ్ కోసం ఈ తర్వాతి తరం వ్యవస్థను అమల్లోకి తేనున్నట్లు గోయల్ పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో రిఫండ్లు వేగవంతం అవుతాయని, ఐటీఆర్ ప్రాసెసింగ్ సమయం గణనీయంగా ఒక్క రోజుకు తగ్గుతుందని చెప్పారు. ప్రస్తుతం 63 రోజులు పడుతున్నట్లు గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు 18 నెలల్లో పూర్తి కాగలదని భావిస్తున్నట్లు తెలిపారు.

నుమలిగఢ్ రిఫైనరీ విస్తరణ

అస్సాంలోని నుమలిగఢ్ రిఫైనరీ విస్తరణకూ కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం ఇక్కడ ఏటా 3 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురు శుద్ధి జరుగుతున్నది. దీన్ని 9 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచనున్నారు. ఇందుకు రూ.22,594 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. అన్ని అనుమతులు వస్తే.. 48 నెలల్లో ఈ ప్రాజెక్టు విస్తరణ పనులు ముగిసే వీలుందని గోయల్ చెప్పారు. పారదీప్ నుంచి నుమలిగఢ్‌కు క్రూడాయిల్ పైప్‌లైన్‌ను, నుమలిగఢ్ నుంచి సిలిగురికి ప్రోడక్ట్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఆస్ట్రేలియాతో ఎంవోయూ

గనుల భద్రతపై భారత్-ఆస్ట్రేలియా మధ్య మెమరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంవోయూ)కూ క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ఒప్పందంతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ, సేఫ్టీ ఇన్ మైన్స్, టెస్టింగ్ అండ్ రీసెర్చ్ స్టేషన్ మధ్య రిస్క్ బేస్డ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అమలుకు చక్కని భాగస్వామ్యం కుదురగలదని ప్రభుత్వం భావిస్తున్నది. కాగా, ఈ ఒప్పందం మూడేండ్లపాటు అమల్లో ఉంటుందని గోయల్ ఈ సందర్భంగా తెలియజేశారు.



పీయూష్ గోయల్

హైడ్రో పవర్ ఉద్యోగులకు ఊరట

ప్రభుత్వ రంగ హైడ్రో పవర్ సంస్థలైన ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌ఈఈపీసీవో, టీహెచ్‌డీసీ ఇండియా, ఎస్‌జేవీఎన్‌ఎల్ ఉద్యోగుల వేతన చెల్లింపులను క్రమబద్ధీకరిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయంతో 5,254 మందికి ప్రయోజనం చేకూరనుండగా, ఖజానాపై రూ.323 కోట్ల భారం పడనున్నది. ఈ మేరకు గోయల్ విలేఖరులకు తెలిపారు. ఇదిలా ఉంటే 13 కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటు కోసం రూ.3,600 కోట్ల వ్యయానికి కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

ప్రపంచ బ్యాంక్ సారథిగా ఇంద్రా నూయి?

ఇవాంకా ట్రంప్ సూచన.. పరిశీలిస్తున్న వైట్ హౌజ్ వర్గాలు

న్యూయార్క్, జనవరి 16: ప్రపంచ బ్యాంక్ నూతన సారథి కోసం ట్రంప్ సర్కారు పరిశీలిస్తున్న అభ్యర్థుల్లో పెప్సీకో మాజీ సీఈవో, భారత సంతతికి చెందిన ఇంద్రా నూయి కూడా ఉన్నారు. ఈ మేరకు అమెరికా అగ్రశ్రేణి దినపత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్' ద్వారా తెలుస్తున్నది. వరల్డ్ బ్యాంక్ ప్రస్తుత అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్.. వచ్చే నెల 1న తన పదవి నుంచి వైదొలుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నూతన అధ్యక్షుడి కోసం అగ్రరాజ్యం అన్వేషణ మొదలు పెట్టగా, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురైన ఇవాంకా ట్రంప్ ఇందుకు సాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇవాంకా సూచనతో నూయి పేరునూ వైట్ హౌజ్ (అమెరికా అధ్యక్ష భవనం) వర్గాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. గ్లోబల్ బేవరేజెస్ దిగ్గజం పెప్సీకోకు దశాబ్ద కాలానికిపైగా సేవలందించిన 63 ఏండ్ల నూయి.. గతేడాది తప్పుకున్న సంగతి విదితమే. దీంతో నూయి అంటే ఎంతో ఇష్టమన్న ఇవాంకా.. నూయినే తనకు ఆదర్శమని చెప్పుకొచ్చినదీ తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రపంచ బ్యాంక్ కొత్త బాస్‌గా నూయి పేరును ఇవాంకా ప్రతిపాదించారు. ఇకపోతే వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్ రేసులో అమెరికా ట్రెజరీ శాఖ ఉద్యోగి డేవిడ్ మల్పాస్, ఓవర్సీస్ ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ కార్ప్ సీఈవో రే వాష్‌బర్న్ తదితరులూ ఉన్నారు. అయినప్పటికీ ఇవాంకా సూచనతో నూయినే ఈ పోటీలో హాట్ ఫేవరిట్‌గా కనిపిస్తున్నారు. ప్రపంచ బ్యాంక్‌లో అమెరికాదే ఎక్కువ వాటా. కాబట్టి ఆ బ్యాంక్ అధ్యక్ష ఎంపికలోనూ ఆ దేశానిదే నిర్ణయం. బ్యాంక్ ప్రస్తుత అధ్యక్షుడు యాంగ్‌ను అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా నియమించారు. హిల్లరీ క్లింటన్‌కు యాంగ్ అత్యంత సన్నిహితుడవగా, పదవీకాలం 2022దాకా ఉన్నప్పటికీ యాంగ్ రాజీనామా చేస్తుండటంతో గత వారం నుంచి కొత్త సారథి ఎంపికలో ప్రపంచ బ్యాంక్ నిమగ్నమైంది.



రూ.35 వేల కోట్ల చమురు, 1.25 లక్షల కోట్ల రక్షణ పరికరాలు

అమెరికా నుంచి కొనుగోలు చేయనున్న భారత్

వాషింగ్టన్, జనవరి 16: అగ్రరాజ్యం అమెరికా, భారత్‌ల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత మెరుగుపడటానికి ఇరు దేశాల మధ్య మరో కీలక ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా యేటా అమెరికా నుంచి 5 బిలియన్ డాలర్ల(రూ.35 వేల కోట్లు) చమురు-గ్యాస్‌లను, 18 బిలియన్ డాలర్ల (రూ.1.25 లక్షల కోట్లు) విలువైన రక్షణ రంగ పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు అమెరికాలో భారత రాయబారి హర్ష వర్ధన్ తెలిపారు. దీంతో యేటా అమెరికా నుంచి భారత్‌కు ఎగుమతుల్లో వృద్ధి కనీసంగా 30 శాతంగా ఉంటుందని మంగళవారం యూఎస్-ఇండియా బిజినెస్ కౌన్సిల్ నిర్వహించిన సమావేశంలో ఆయన చెప్పారు. గడిచిన రెండేండ్లలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందాలు 119 బిలియన్ డాలర్ల నుంచి 140 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా భారత్ యేటా 5 బిలియన్ డాలర్ల చమురు కొనుగోలుకు కట్టుబడివుందని ఆయన చెప్పారు. భారత్‌లో విమానాలు వాడేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో వీటి ఆర్డర్లు కూడా భారీగా పెరిగాయని, ఇప్పటికే 40 బిలియన్ డాలర్ల విలువైన 300 విమానాలకు ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. అలాగే దేశీయ భద్రత దళాలు 18 బిలియన్ డాలర్ల విలువైన రక్షణ రంగ పరికరాలను దిగుమతి చేసుకునే అవకాశం ఉందన్నారు. దీంతోపాటు భారత్ నుంచి అమెరికాకు వచ్చి చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతున్నారని, ప్రస్తుతం 2.27 లక్షల మంది ఇక్కడ ఉన్నారని, వీరి ద్వారా యేటా అమెరికాకు 6.5 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతున్నదని ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ రంగాల్లో ఇరు దేశాలు మెరుగైన వృద్ధిని నమోదు చేసుకుంటున్నాయని అన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్ తీసుకుంటున్న చర్యలు వ్యాపార రంగంలో సానుకూల ప్రభావాన్ని చూపుతున్నాయని ఒక ప్రశ్నకు సమాధానంగా ఇచ్చారు.

ఎస్సార్ స్టీల్‌కు ఎస్‌బీఐ షాక్

అమ్మకానికి రూ.15 వేల కోట్ల విలువైన కంపెనీ ఆస్తులు



న్యూఢిల్లీ, జనవరి 16: రుణ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ప్రముఖ స్టీల్ ఉత్పత్తి సంస్థ ఎస్సార్ స్టీల్‌కు బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) గట్టి షాకిచ్చింది. కంపెనీ తీసుకున్న రుణాలను తిరిగి రాబట్టుకునే ఉద్దేశంలో భాగంగా ఎస్‌బీఐ రూ.15,431.44 కోట్ల విలువైన ఆస్తులను అమ్మకానికి పెట్టింది. ఇందుకోసం బ్యాంకులు/ ఏఆర్‌సీఎస్/ ఎన్‌బీఎఫ్‌సీఎస్/ఎఫ్‌ఐఐలను ఆహ్వానించింది బ్యాంక్. రిజర్వు ధరను రూ.9,587.64 కోట్లుగా నిర్ణయించింది. తీసుకున్న రుణాలను చెల్లించనియెడల తాకట్టు కింద పెట్టిన ఆస్తులను విక్రయించుకునే అవకాశం రుణం ఇచ్చిన బ్యాంకుకు ఉంటుంది. దీనికి ఎన్‌సీఎల్‌టీ అహ్మదాబాద్ అనుమతించిన నేపథ్యంలో సంస్థకు చెందిన ఆస్తులను విక్రయించడం ద్వారా కనీసంగా రూ.11,313.42 కోట్లు రావచ్చునని బ్యాంక్ అంచనావేస్తున్నది. ప్రస్తుత మార్కెట్ ఉన్న ప్రకారం రిజర్వు ధరను రూ.9,587 కోట్లుగా నిర్ణయించింది. ఈ నెల 30న ఎలక్ట్రానిక్ వేలం పద్ధతిన ఈ ఆస్తులను వేలం వేయబోతున్నది. గతడాది సెప్టెంబర్‌లో రుణాలను పునర్ వ్యవస్థీకరించనున్నట్లు కంపెనీ విజ్ఞప్తిమేరకు ఈ ఆస్తుల వేలాన్ని నిలిపివేయాలని ఎన్‌సీఎల్‌టీ కన్సార్టియం బ్యాంకును ఆదేశించింది. దీంతో నాలుగు నెలల పాటు వాయిదాపడింది. అయినప్పటికీ ఎలాంటి చెల్లింపులు జరుపలేకపోవడంతో మళ్లీ ఎస్‌బీఐ వీటిని విక్రయించడానికి సిద్ధమైంది. అప్పుల్లో కూరుకుపోయిన ఎస్సార్ స్టీల్‌ను కొనుగోలు చేయడానికి మైనింగ్ దిగ్గజం వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్ ఆసక్తి చూపారు. గుజరాత్‌లో ఏడాదికి కోటి టన్నుల సామర్థ్యం కలిగిన స్టీల్ ప్లాంట్ ఎస్సార్ స్టీల్‌కు ఉన్నది. ఈ ప్లాంట్‌పై ఎస్‌బీఐ నేతృత్వంలోని రెండు డజన్ల బ్యాంకుల కన్సార్టియానికి రూ.49 వేల కోట్ల బకాయి వున్నది. పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఆర్సెలార్ మిట్టల్ రూ.42 వేల కోట్లను రుణాలు ఇచ్చిన బ్యాంకులకు చెల్లించనుండగా, మరో రూ.8 వేల కోట్లను మూలధన నిమిత్తం ఖర్చు చేయనున్నట్లు ఒక ప్రణాళికనూ సమర్పించింది.

జెట్ ఆర్థిక సమస్యలకు ఎస్‌బీఐ ప్రత్యేక ప్రణాళిక!

నిధులు లేక గాలిలోక ఎగురలేకపోతున్న ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ జెట్ ఎయిర్‌వేస్‌ను ఆర్థికంగా ఆదుకోవడానికి సిద్ధమైంది ఎస్‌బీఐ. ఈ గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కడానికి ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం ప్రత్యేక ప్రణాళికను ప్రకటించింది. అయినప్పటికీ ఈ ప్రణాళికపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఈక్విటీ వాటాను కేటాయించాల్సి ఉండగా, అలాగే బోర్డు డైరెక్టర్లను మార్చాల్సి ఉంటుందని విభిన్న వర్గాల ద్వారా తెలిసింది. సంస్థను మళ్లీ గాడిలో పెట్టే వ్యూహంలో భాగంగా నిర్వహణ ఖర్చులు తగ్గించడంతోపాటు అప్పులను తగ్గించుకోవడానికి ఈ ప్రణాళిక పెద్దపీట వేసింది.

రెడ్డీస్ ప్లాంట్‌పై యూఎస్‌ఎఫ్‌డీఏ అభ్యంతరాలు

న్యూఢిల్లీ, జనవరి 16: డాక్టర్ రెడ్డీస్‌కు అమెరికా నియంత్రణ మండలి గట్టి షాకిచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో కంపెనీకి ఉన్న ఫార్ములేషన్ యూనిట్‌పై యూఎస్‌ఎఫ్‌డీఏ నాలుగు అభ్యంతరాలను వ్యక్తంచేసింది. యూఎస్‌ఎఫ్‌డీఏ ఆడిట్ సభ్యులు శ్రీకాకుళం ప్లాంట్(సెజ్) యూనిట్-1ను తనిఖీ చేశారని, వారు నాలుగు అభ్యంతరాలపై ఫార్మ్ 483 జారీ చేశారని సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. తనిఖీలో లేవనెత్తిన అంశాలను త్వరలో పరిష్కరించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

మళ్లీ ఐసీఐసీఐ బ్యాంక్ ఈడీగా విశాఖా ముల్యే

న్యూఢిల్లీ, జనవరి 16: మళ్లీ ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విశాఖా ముల్యే నియమితులయ్యారు. ఈ నియామకానికి బుధవారం రిజర్వు బ్యాంక్ ఆమోదం తెలిపింది. దీంతో ఆమె మరో రెండేండ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. జనవరి 19, 2019 నుంచి అమలులోకి రానున్నట్లు బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది.

ఎయిర్ ఇండియా భవంతిపై మహారాష్ట్ర సర్కార్ కన్ను

ముంబై, జనవరి 16: దక్షిణ ముంబైలోని ఎయిర్ ఇండియా చారిత్రక భవంతిని మహారాష్ట్ర సర్కార్ దక్కించుకునే అవకాశాలున్నాయి. నారిమన్ పాయింట్ వద్ద మరైన్ డ్రైవ్‌లో ఉన్న ఈ 23 అంతస్తుల భవంతి నుంచి ఎయిర్ ఇండియా కార్యకలాపాలను 2013 నుంచి నిర్వహిస్తున్నది. 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఈ భవంతిని కొనుగోలు చేయడానికి ఇటీవల బిడ్డింగ్‌ను సమర్పించినట్లు ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూషణ్ గాగ్రానీ తెలిపారు. బీమా దిగ్గజం ఎల్‌ఐసీ కూడా బిడ్డింగ్‌ను దాఖలు చేసినట్లు తెలుస్తున్నది. కాగా, ఈ ప్రతిష్ఠాత్మక భవంతిని దక్కించుకోవడానికి ఎయిర్ ఇండియాతో సంప్రదింపులు జరుపాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చీఫ్ సెక్రటరీకి సూచించారు. ప్రభుత్వ, పీఎస్‌యూ కార్యాలయాలను ఎయిర్ ఇండియా భవంతికి షిఫ్ట్ చేయడం వల్ల భారీ స్థాయిలో పొదుపు చేసినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తున్నది.

దక్షిణాదిలో ఎస్‌పీపీఎల్ టీవీల తయారీ ప్లాంట్!



హైదరాబాద్, జనవరి 16: కొడాక్, థాంప్సన్ టీవీలను తయారుచేసి దేశవ్యాప్తంగా విక్రయిస్తున్న సూపర్ ప్లాస్ట్రోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎస్‌పీపీఎల్) మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే ఉత్తర భారతంలో మూడు ప్లాంట్లను ఏర్పాటు చేసిన సంస్థ..తాజాగా దక్షిణాది మార్కెట్‌పై మరింత పట్టు సాధించాలనే ఉద్దేశంతో ఇక్కడే యూనిట్‌ను నెలకొల్పాలనుకుంటున్నట్లు కంపెనీ డైరెక్టర్, సీఈవో అవ్‌నీత్ సింగ్ మార్వా తెలిపారు. ఇందుకోసం తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. వచ్చే మూడు నుంచి ఆరు నెలల కాలంలో ఈ ప్లాంట్ ఏర్పాటుపై స్పష్టత రానున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. రాష్ట్ర మార్కెట్లోకి కొడాక్‌కు చెందిన 43 అంగుళాల స్మార్ట్‌టీవీను ఆయన విడుదల చేశారు. కేవలం ఫ్లిప్‌కార్ట్‌లో మాత్రమే లభించే ఈ 43 యూహెచ్‌డీఎక్స్ స్మార్ట్ టీవీ ధరను రూ.23,999గా నిర్ణయించింది. దీంట్లో డ్యూయల్ కోర్ 1.4 గిగాహెడ్జ్ ప్రాసెసర్, 1జీబీ మెమొరీని 8 జీబీ వరకు పెంచుకునే అవకాశం ఉంటుంది. అలాగే వై-ఫై, మిరాకాస్ట్, జీమెయిల్, యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్, హాట్‌స్టార్, నెట్‌ఫ్లిక్స్ వంటి యాప్స్ ముందేగానే నిక్షిప్తం చేసి ఉండనున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.280 కోట్లుగా నమోదైన టర్నోవర్, ఈ సారి రూ.500 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో ఆన్‌లైన్ వాటా 70 శాతం ఉండగా, ఆఫ్‌లైన్‌లో 30 శాతమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థ రూ.24,799లనుంచి రూ.36,999 లోపు ధర కలిగిన 14 రకాల టీవీలను విక్రయిస్తుండగా, ఈ ఏడాది మరో ఎనిమిది అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. నోయిడాలో రూ.150 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఉత్పత్తి కేంద్రం వచ్చే రెండు నెలలో అందుబాటులోకి రానుండంతో కంపెనీ సామర్థ్యం 7 లక్షలకు పెరుగనున్నదన్నారు.

స్టార్టప్‌లకు ఊరట

ఏంజిల్ ఫండ్స్‌కు ఊతమిచ్చేలా నిర్ణయం

ఐటీ మినహాయింపు విన్నపాల పరిశీలన సులభతరం

న్యూఢిల్లీ, జనవరి 16: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహాన్నిస్తూ స్టార్టప్‌లకు ఊతమిచ్చే నిర్ణయాన్ని తీసుకున్నది కేంద్ర ప్రభుత్వం. ఏంజిల్ ఫండ్స్ (మూలమదుపరి) పెట్టుబడులపై స్టార్టప్‌లు కోరే ఆదాయం పన్ను (ఐటీ) మినహాయింపు వ్యవహారాన్ని సులభతరం చేసింది. ఇందుకు సంబంధించి దాఖలైన దరఖాస్తులపై 45 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ నిర్దేశిత గడువును విధించింది. ఏంజిల్ ఫండ్స్ పెట్టుబడులపై ఐటీ శాఖ నుంచి ఐటీ చట్టంలోని సెక్షన్ 56(2) కింద నోటీసులు అందుతున్నాయంటూ వివిధ స్టార్టప్‌ల వ్యవస్థాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పైవిధంగా సంబంధిత శాఖ అధికారులకు దిశా-నిర్దేశం చేసింది. 'కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభు ఆమోదించిన ఈ నిర్ణయాన్ని త్వరలోనే పారిశ్రామిక విధాన, ప్రోత్సాహక శాఖ (డీఐపీపీ) అధికారికంగా ప్రకటిస్తుంది' అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. స్టార్టప్‌లు తమ ఏంజిల్ ఫండ్స్ పెట్టుబడులపై ఐటీ మినహాయింపును కోరదలిస్తే.. అందుకు అవసరమైన డాక్యుమెంట్లతో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ)ను సంప్రదించాల్సి ఉంటుంది. డీఐపీపీ ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతుందని సదరు వర్గాలు తెలిపాయి. ఇంతకుముందు ఇది ఓ ఇంటర్ మినిస్టీరియల్ బోర్డ్ ఆఫ్ సర్టిఫికేషన్ ద్వారా జరిగేది. 2016 జనవరిలో కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు స్టార్టప్ ఇండియాను ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతిభావంతులైన ఔత్సాహికుల ఆలోచనల్లో నుంచి పుట్టుకొచ్చిన ఈ స్టార్టప్‌ల్లో పలువురు ప్రముఖులు పెట్టుబడులను పెడుతూ.. వాటి అభివృద్ధికి దోహదపడుతున్న సంగతీ విదితమే. కాగా, గతేడాది ఏప్రిల్ నుంచి కేవలం రెండు స్టార్టప్‌లకే ఐటీ మినహాయింపులు లభించాయి. సాధారణంగా 300-400 స్టార్టప్‌లు ఏంజిల్ ఫండింగ్‌ను పొందుతూ ఉంటాయి. దాదాపు ఇవన్నీ కూడా ఐటీ మినహాయింపుల కోసం ప్రయత్నిస్తున్నవే. అయినప్పటికీ ప్రయోజనం శూన్యం. అయితే ఏంజిల్ ఇన్వెస్టర్లతోసహా ఇతర ఇన్వెస్టర్ల నుంచి సేకరించిన పెట్టుబడుల్లో రూ.10 కోట్ల వరకు పెట్టుబడులపై పన్ను రాయితీలను పొందేలా స్టార్టప్‌లకు నిరుడు ఏప్రిల్‌లో అవకాశం ఇచ్చింది కేంద్రం. మరోవైపు ఏంజిల్ పెట్టుబడులపై పన్నును రద్దు చేయాలంటూ ప్రధాని మోదీకి స్టార్టప్‌ల సంఘం ఇస్పిరిట్ లేఖ రాస్తున్నది.



ఎగుమతుల్లో వృద్ధి అంతంతే

డిసెంబర్ నెలలో స్వల్ప వృద్ధి

పది నెలల కనిష్ఠానికి వాణిజ్యలోటు




న్యూఢిల్లీ, జనవరి 16: దేశీయ ఎగుమతులు మళ్లీ నీరసించాయి. అంతర్జాతీయ దేశాల మధ్య వాణిజ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటంతో ఎగుమతులపై ప్రభావం పడింది. గతేడాది చివరి నెలలో ఎగుమతులు ఇంచుమించు ఫ్లాట్‌గా కేవలం 0.34 శాతం మాత్రమే పెరిగి 27.93 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు తగ్గుముఖం పట్టడం కొంతమేర ఊరట లభించింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం దిగుమతులు 2.44 శాతం తగ్గి 41 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంటే వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) పది నెలల కనిష్ఠ స్థాయి 13.08 బిలియన్ డాలర్లకు పడిపోయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో 14.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గతంలో 2016 సెప్టెంబర్ నెలలో దిగుమతులు ప్రతికూలానికి 2.54 శాతం తగ్గాయి. అయినప్పటికీ పసిడి దిగుమతుల మాత్రం తగ్గడం లేదు. గడిచిన నెలలో 2.56 బిలియన్ డాలర్ల విలువైన బంగారం భారత్ దిగుమతి చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన దాంతో పోలిస్తే 24.33 శాతం పెరిగింది. పలు రంగాల్లో నెలకొన్న నిస్తేజం వల్లనే ఎగుమతులు నీరసించాయి. ముఖ్యంగా ఇంజినీరింగ్ గూడ్స్, జెమ్స్ అండ్ జ్యువెల్లరీ, చర్మ వస్తువులు, ఫార్మాస్యూటికల్స్, సముద్రపు ఉత్పత్తులు, ఇనుప ఖనిజం, టీ, కాఫీలు ఉన్నాయి. గత నెలలో 10.67 బిలియన్ డాలర్ల విలువైన చమురును భారత్ దిగుమతి చేసుకున్నది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 3.16 శాతం పెరిగింది. గడిచిన తొమ్మిది నెలల్లో చమురు దిగుమతి ఏడాది ప్రాతిపదికన 42.85 శాతం పెరిగి 108.10 బిలియన డాలర్లకు చేరుకోగా, చమురేతర ఉత్పత్తుల దిగుమతులు 4.06 శాతం ఎగబాకి 278.54 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతర్జాతీయ దేశాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితికి తోడు దేశీయ పరిస్థితులు కూడా అంతంత మాత్రంగానే ఉండటం వల్లనే ఎగుమతులు స్వల్ప వృద్ధికి పరిమితమయ్యాయని ఎగుమతుల బాడీ ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ గణేష్ కుమార్ గుప్తా తెలిపారు. ఇదే పరిస్థితి భవిష్యత్తులోనూ కొనసాగితే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కేంద్రం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్(తొమ్మిది నెలల) కాలంలో ఎగుమతులు 10.18 శాతం ఎగిసి 245.44 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 12.61 శాతం పెరిగి 386.65 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దీంతో వాణిజ్యలోటు 141.2 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

'అండర్‌టేకింగ్'తో అమ్మకాలా?

రెరాలో నమోదైన వాటికే రుణాలివ్వాలి ■ బ్యాంకర్లతో చర్చించడానికి సిద్ధమవుతున్న రెరా అథారిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'రెరా' అనుమతి తీసుకోకుండా అండర్ టేకింగ్ ద్వారా పలువురు రియల్టర్లు, డెవలపర్లు ప్లాట్లు, ఫ్లాట్లను విక్రయిస్తున్నారని తెలంగాణ రెరా అథారిటీ దృష్టికొచ్చింది. సాధారణంగా బ్యాంకులు రుణమిస్తే తప్ప అధిక శాతం మంది కొనుగోలుదారులు ప్లాట్లు కానీ ఫ్లాట్లు కానీ కొనుగోలు చేయలేరు. బ్యాంకులు రుణం మంజూరు చేయాలంటే, ఆయా లే అవుట్ లేదా ప్రాజెక్టుకు రెరా అనుమతి విధిగా ఉండాల్సిందే. ఈ ప్రక్రియను తప్పించుకునేందుకు కొందరు రియల్టర్లు, డెవలపర్లు.. కొనుగోలుదారులకు అండర్ టేకింగ్‌లను అందజేస్తున్నారని, వాటిని బ్యాంకులకు సమర్పించి కొనుగోలుదారులు గృహ రుణం తీసుకుంటున్నారని రెరా దృష్టికి వచ్చింది. ఈ రకంగా దొడ్డిదారిన అమ్మకాలు చేస్తున్న ప్రమోటర్ల సంఖ్య హైదరాబాద్‌లో పెరుగుతున్నదని రెరా చెబుతున్నది. దీంతో అధిక శాతం మంది రియల్టర్లు, డెవలపర్లు రెరా తుది అనుమతి తీసుకోవడానికి ముందుకు రావట్లేదని తెలిసింది. ఈ కారణం వల్ల తెలంగాణ రెరాలో కొత్త ప్రాజెక్టుల నమోదు ఆలస్యమవుతుందని రెరా అథారిటీ భావిస్తున్నది. నిబంధనల ప్రకారం రెరాలో నమోదయ్యే వరకూ బ్యాంకులు రుణాల్ని మంజూరు చేయకూడదు. మరి అండర్‌టేకింగ్ ద్వారా బ్యాంకులెందుకు రుణ మొత్తాన్ని విడుదల చేస్తున్నాయనే విషయాన్ని తెలుసుకోవడానికి రెరా అథారిటీ ప్రయత్నిస్తున్నది. తెలంగాణ నిర్మాణ రంగంలో పారదర్శకత నెలకొల్పాలని 2017 జనవరి 1 తర్వాత రాష్ట్రంలో ప్రారంభమైన ప్రాజెక్టుల్ని రెరా పరిధిలోకి ప్రభుత్వం తీసుకొచ్చింది.



రెరా గడువు 31 వరకూ పొడిగింపు

రెరాలో నమోదుకు జనవరి 15తో ముగిసిన చివరి గడువును మరో పదిహేను రోజులు పెంచుతూ బుధవారం రెరా అథారిటీ నిర్ణయం తీసుకున్నది. అపరాధ రుసుమును రూ. 2 లక్షలుగానే ఉంచారు. ఇప్పటివరకూ తెలంగాణ రెరా అథారిటీ వద్ద 3,200 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇందులో 1,800లకుపైగా ప్రాజెక్టులు నమోదవగా.. పద్నాలుగు వందల మంది దాకా ఏజెంట్లు నమోదు చేసుకున్నారు. ఇంకా దాదాపు పదిహేను వందల ప్రాజెక్టులు రెరాలో నమోదు కావాల్సి ఉన్నదని తెలంగాణ రెరా అథారిటీ మెంబర్ సెక్రెటరీ కొమ్ము విద్యాధర్ తెలిపారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 17 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



భలే.. భలే.. బర్గర్స్!

థాయ్ వెజ్ బర్గర్



కావాల్సినవి :

బర్గర్ బన్ : 1, **ఆలుగడ్డ :** 1 (ఉడికించింది), **మంచి గుమ్మడి తురుము :** 2 టేబుల్‌స్పూన్స్, **స్వీట్ చిల్లీ సాస్ :** ఒక టీస్పూన్, **ఓయిస్టర్ సాస్ :** ఒక టీస్పూన్, **బ్రెడ్ క్రంబ్స్ :** ఒక టేబుల్‌స్పూన్, **కొబ్బరి పాలు :** అర కప్పు, **పల్లీలు :** అర కప్పు (వేయించినవి), **బెల్లం :** ఒక టేబుల్‌స్పూన్, **చింతపండు రసం :** ఒక టేబుల్ స్పూన్, **నూనె :** 3 టేబుల్‌స్పూన్స్, **క్యారెట్ :** 1, **క్యాప్సికం :** 3 (ఆకుపచ్చ, పసుపు, ఎరుపు), **వెనిగర్ :** అర టేబుల్‌స్పూన్, **చక్కెర :** చిటికెడు, **కీరదోస :** 4 ముక్కలు, **బటర్ :** ఒక టేబుల్‌స్పూన్, **ఉల్లి ఆకు:** 1, **ఉప్పు :** తగినంత

తయారీ :

స్టెప్ 1 : ఆలుగడ్డను చిదిమి పెట్టుకోవాలి. ఇందులో మంచి గుమ్మడి తురుము, స్వీట్ చిల్లీ సాస్, ఒయిస్టర్ సాస్ వేసి బాగా కలుపాలి.

స్టెప్ 2 : బ్రెడ్ క్రంబ్స్ వేసి కలిపి వీటిని గారెల్లా చేసి పెట్టుకోవాలి. మరో కడాయిలో కొబ్బరి పాలు పోసి కాసేపు మరుగనివ్వాలి.

స్టెప్ 3 : దీంట్లో వేయించిన పల్లీలు, బెల్లం, స్వీట్ చిల్లీ సాస్, చింతపండు రసం వేసి కాసేపు మరిగించాలి.

స్టెప్ 4 : ఇది మరిగే లోపు పెనం పెట్టి కొద్దిగా నూనె వేసి గారెల్లా చేసుకున్న వాటిని బ్రౌన్ కలర్ వచ్చేవరకు వేయించాలి. ఇదే పెనం మీద బటర్ వేసి బర్గర్ బన్‌ని రెండు ముక్కలుగా చేసి వేయించాలి.

స్టెప్ 5 : ఈ బన్ మీద క్యారెట్ ముక్కలు, క్యాప్సికం ముక్కలు, ఉప్పు, నూనె, వెనిగర్, చక్కెర చల్లాలి.

స్టెప్ 6 : టమాటా ముక్కలు, కీరదోస ముక్కలు, వేయించుకున్న గారెల్లాంటి వాటిని పెట్టాలి. పై నుంచి ఉల్లి ఆకుతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. టేస్టీ బర్గర్ మీ ముందుంటుంది.

క్రిస్పీ చికెన్ బర్గర్

కావాల్సినవి :

చికెన్ : 250 గ్రా., **బర్గర్ బన్ :** 1, **మిరియాల పొడి :** ఒక టీస్పూన్, **మిక్స్‌డ్ హెర్బ్స్ :** ఒక టీస్పూన్, **గరం మసాలా :** అర టీస్పూన్, **కారం :** అర టీస్పూన్, **మైదా :** పావు కప్పు, **కార్న్‌ఫ్లోర్ :** పావు కప్పు, **బటర్ :** 50 గ్రా., **ఉల్లిపాయ ముక్క :** 1, **టమాటా ముక్క :** 1, **క్యాబేజీ తురుము :** 2 టేబుల్ స్పూన్స్, **టమాటా కెచప్ :** 2 టేబుల్‌స్పూన్స్, **మయన్నీస్ :** 2 టేబుల్ స్పూన్స్, **నూనె, ఉప్పు :** తగినంత.



తయారీ :

స్టెప్ 1 : చికెన్‌ని కడిగి చిన్న ముక్కలుగా కట్ చేయాలి. దీంట్లో ఉప్పు, మిరియాల పొడి, మిక్స్‌డ్ హెర్బ్స్, గరం మసాలా, కారం వేసి బాగా కలుపాలి.

స్టెప్ 2 : ఇందులో మైదా, కార్న్‌ఫ్లోర్, కొన్ని నీళ్లు పోసి కలుపుకోవాలి. వీటిని చిన్న గారెల్లా చేసి పెట్టుకోవాలి. వీటిని కడాయిలో నూనె పోసి డీప్ ఫ్రై చేసి పెట్టుకోవాలి.

స్టెప్ 3 : బర్గర్‌ని రెండు ముక్కలుగా చేసి బటర్‌ని రాసి పెనం మీద వేయించాలి.

స్టెప్ 4 : ఈ బన్ మీద ఉల్లిపాయ ముక్క, టమాటా ముక్క, క్యాబేజీ తురుము, వేసి వేయించిన చికెన్ గారెలని పెట్టాలి. పై నుంచి టమాటా కెచప్ వేసి, మయన్నీస్ పోయాలి.

స్టెప్ 5 : మరో బన్‌ని పైన పెట్టి అప్పటికప్పుడు తింటే క్రిస్పీగా, యమ టేస్టీగా ఉంటుంది.

సోయా గ్రాన్యుల్స్ బర్గర్

కావాల్సినవి : **బర్గర్ బన్ :** 1, **సోయాగ్రాన్యుల్స్ :** ఒక కప్పు, **నూనె :** 2 టేబుల్‌స్పూన్స్, **వెల్లుల్లిపాయ ముక్కలు :** ఒక టీస్పూన్, **ఉల్లిగడ్డ :** 1, **స్వీట్‌కార్న్ :** పావు కప్పు, **మిరియాల పొడి :** అర టీస్పూన్, **మిక్స్‌డ్ హెర్బ్స్ :** అర టీస్పూన్, **ఆలుగడ్డ :** 1, **మైదా :** అర కప్పు, **బ్రెడ్ క్రంబ్స్ :** అర కప్పు, **బటర్ :** ఒక టీస్పూన్, **మయన్నీస్ :** ఒక టీస్పూన్, **టమాటా :** 3 ముక్కలు, **కీరదోస :** 2 ముక్కలు, **లెట్యూస్ ఆకులు :** 3, **ఉల్లిపాయ :** 2 ముక్కలు, **టమాటా కెచప్ :** ఒక టేబుల్‌స్పూన్.

తయారీ :

స్టెప్ 1 : సోయాగ్రాన్యుల్స్‌ని మరుగుతున్న నీటిలో వేసి 5 నిమిషాల పాటు ఉడికించి, ఆ తర్వాత నీళ్లు లేకుండా బాగా వంపేసి పక్కన పెట్టాలి. ఆలుగడ్డను కూడా ఉడికించుకోవాలి.

స్టెప్ 2 : కడాయిలో నూనె పోసి వెల్లుల్లి పాయ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి ఒక నిమిషం పాటు వేయించాలి. ఇందులో స్వీట్ కార్న్, మిరియాల పొడి, మిక్స్‌డ్ హెర్బ్స్ వేసి దించేయాలి.

స్టెప్ 3 : ఒక గిన్నెలో సోయా గ్రాన్యుల్స్, ఉడికించిన ఆలుగడ్డ, ఉప్పు, స్వీట్‌కార్న్ వేసి మెత్తగా కలుపుకోవాలి. వీటిని గారెల్లా చేసి మైదాలో ముంచి, బ్రెడ్ క్రంబ్స్‌లో వేసి పక్కన పెట్టుకోవాలి.

స్టెప్ 4 : ఇప్పుడు బటర్ వేసి ఈ గారెలాను లైట్ బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేయించాలి. ఇదే కడాయిలో బర్గర్ బన్‌ని రెండు ముక్కలుగా చేసి వేయించాలి.

స్టెప్ 5 : వీటి మీద ఆ గారెలను పెట్టాలి. మయన్నీస్ వేసి టమాటా ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, లెట్యూస్ ఆకులు, టమాటా ముక్కలు, టమాటా కెచప్ వేసి, బటర్ రాసి ఒక బ్రెడ్ మీద మరో బ్రెడ్ వచ్చేలా ఉంచి లాగించేయాలి.



మష్రూమ్ బర్గర్

కావాల్సినవి : **మైదా :** ఒక టీస్పూన్, **ఉల్లిగడ్డ :** 1, **పాలు :** ఒక టీస్పూన్, **మష్రూమ్స్ :** ఒక కప్పు, **సోయా గ్రాన్యుల్స్ :** అర కప్పు, **మిరియాల పొడి :** అర టీస్పూన్, **మిక్స్‌డ్ హెర్బ్స్ :** చిటికెడు, **ఉలవలు :** అర కప్పు, **బర్గర్ బ్రెడ్ :** 1, **టమాటా స్లైసెస్ :** పావు కప్పు, **కీరదోస ముక్కలు :** పావు కప్పు, **జలపెనోస్ మిర్చీ :** 5, **టమాటా కెచప్ :** ఒక టేబుల్‌స్పూన్, **వెల్లుల్లిపాయలు :** అర టీస్పూన్, **బటర్ :** 3 క్యూబ్స్.



తయారీ :

స్టెప్ 1 : ఉలవలను కాసేపు నానబెట్టుకోవాలి. కడాయిలో బటర్ వేసి కరిగాక వెల్లుల్లి పాయ ముక్కలు, మైదా వేసి కొద్దిగా వేయించాలి. ఇందులోనే ఉల్లిపాయ ముక్కలు వేసి వేగనివ్వాలి. ఈలోపు సోయా గ్రాన్యుల్స్‌ని ఉడికించి పెట్టుకోవాలి.

స్టెప్ 2 : ఇవి బాగా వేగాక.. పాలు, మష్రూమ్స్, ఉడికిన సోయా గ్రాన్యుల్స్, నానబెట్టిన ఉలవలు, మిరియాల పొడి, మిక్స్‌డ్ హెర్బ్స్ వేసి వేయించాలి.

స్టెప్ 3 : వీటిని కాస్త చల్లారనిచ్చి వీటిని వడల్లా ఒత్తుకోవాలి. ఇలా రెండు చేసుకోవాల్సి ఉంటుంది.

స్టెప్ 4 : ఇప్పుడు బ్రెడ్‌ని రెండు ముక్కలుగా కట్ చేసి పెనం మీద వేసి వేడి చేయాలి. అదే పెనం మీద కొద్దిగా బటర్ వేసి వడలను వేయించాలి.

స్టెప్ 5 : ముందుగా బర్గర్ బ్రెడ్ ఒక ముక్కని ఉంచి వేయించుకున్న వాటిని టమాటా ముక్కలు, కీరా ముక్కలు, ఉల్లిపాయ ముక్కలను, జలపెనోస్ మిర్చీని అందంగా అలంకరించుకోవాలి. పై నుంచి టమాటా కెచప్ వేసి తింటే ఆ టేస్టే వేరు.



సంజయ్ తుమ్మ
సెలబ్రిటీ చెఫ్

పర్‌ఫ్యూమ్‌తో..
ఆత్మవిశ్వాసం



ఎవరికి నచ్చిన సెంట్‌ను వాళ్లు వాడుతుంటారు. పర్‌ఫ్యూమ్‌ల ఎంపికను బట్టి వ్యక్తిత్వాన్ని తెలుసుకోవచ్చు. ఒకరికి పర్‌ఫ్యూమ్ గిఫ్ట్‌గా ఇవ్వాలన్నా వాళ్ల వ్యక్తిత్వాన్ని బట్టి ఇస్తేనే వాళ్లకు నచ్చుతుందట..

పర్‌ఫ్యూమ్స్ ముఖ్యంగా ఫ్లోరల్, ఓరియంటల్, ఉడ్స్, చెప్రీ రకాలుంటాయి. ఇతరులకు బహుమతిగా ఇవ్వడానికైతే వాళ్లకు తగ్గట్టువి కొనాలి. ఉదాహరణకు తల్లిదండ్రులకు ఒక సెంట్ బాటిల్ బహుమతిగా ఇవ్వాలనుకున్నప్పుడు.. వెనీలా, వైట్ మాస్క్ కాంబినేషన్ తీసుకోవాలి. ఇది వాళ్లలో ఒక రకమైన ఆత్మవిశ్వాసాన్ని నింపే పరిమళాన్ని వెదజల్లుతుందట. దగ్గరి మిత్రులకు అయితే.. రోజ్, బ్లాక్ కరెంట్ పర్‌ఫ్యూమ్స్ ఇస్తే హుందాగా ఉంటుంది. మనసుకు నచ్చిన వారికి మీ ప్రేమను తెలియజెప్పడానికి సిడార్, లెమన్, ఓక్‌మాస్, మాండరిన్ సెంట్‌లను గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు. దీంతో పాటు మన డ్రెస్సింగ్ స్టయిల్ ఎలా మన వ్యక్తిత్వాన్ని తెలుపుతుందో పూసుకునే పర్‌ఫ్యూమ్ కూడా వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. లెమన్, జామ చెట్లనుంచి తయారు చేసిన సెంట్లు మనలో సృజనాత్మకతను పెంచుతాయి. మానసికంగా దృఢంగా ఉండేవారు, నలుగురితో కలిసే చొరవ ఉన్న వారు ఇలాంటి పరిమళాలు వాడుతారు. గులాబి వంటి సున్నితమైన సెంట్లు వాడేవారు ఎప్పుడూ డైలమాలో ఉంటారట. ఘాటైన పరిమళాలు వాడేవారు కొత్తకొత్త దారుల్లో ఆలోచించి ముందుకెళ్తారట.

ఆకలి తీరుస్తున్న ఆలోచన

హంగు ఆర్భాటాలతో జరిగే ఓ పెండ్లి వేడుకకు వెళ్లింది. అక్కడ కనిపించిన ఓ దృశ్యం ఆమెను బాధించింది. అక్కడ ఓ ఆలోచన పుట్టింది. అది ఆమెను మార్చేసింది. ఇప్పుడు వందల మంది ఆకలిని తీరుస్తున్నది.



తైరా భార్గవ.. బడికి వెళ్లి పాఠాలు నేర్చుకునే విద్యార్థి. ఆమె సొంత ఆలోచనతో ఇప్పుడు ఢిల్లీలో ఒక ప్రాజెక్టును చేపట్టింది. దానికి 'ప్రాజెక్ట్ డబుల్ రోటి' అని పేరు పెట్టింది. ఆకలితో ఉన్న వాళ్ల జాడ తెలుసుకుని వాళ్ల ఆకలి తీర్చడమే ఆమె చేస్తున్న పని. ఇలా వారానికి సుమారు మూడు వందల నుంచి నాలుగు వందల మందికి తైరా ఆహారాన్ని అందిస్తున్నది. పెళ్లి వేడుకలో మిగిలిన ఆహారాన్ని వృథాగా పడేయడమే ఆమె చూసిన దృశ్యం. ఆ ఘటన ఆమెను బాధించింది. దేశంలో సరైన పౌష్టికాహారం, తినడానికి తిండి లేక ఎంతో మంది అలమటిస్తున్నారని తెలుసుకున్నది. మరోవైపు సరైన ఆహారం ఉన్నా అది అవసరమైన వారికి అందటం లేదని తెలుసుకున్నది. హోటళ్లలో, బేకరీలలో వృథా చేస్తున్న నాణ్యమైన ఆహారాన్ని సేకరించాలనుకుంది. తనకు తెలిసిన బేకరీ వాళ్లతో మాట్లాడి వృథా చేస్తున్న తిను బండారాలను సేకరించి పేదవాళ్లకు అందిస్తుంది. ముఖ్యంగా బేకరీల నుంచి వచ్చే బ్రెడ్‌ను వృథా చేయకుండా వారానికి నాలుగు వందల మంది పిల్లలకు, పెద్దలకు అందిస్తుంది. దీనికి అవసరమయ్యే రవాణా చార్జీలను సొంతంగా భరిస్తుంది. ముందు ముందు ఎవరైనా ప్రోత్సాహమందిస్తే, సహకారం పెరిగితే మరింత ఎక్కువ మందికి ఆహారాన్ని అందిస్తానంటున్నది.

ముడుతలు మాయం!



శరీరంపై ముడుతలు ఏర్పడుతున్నాయంటే కారణం సరైన తేమ లేకపోవడం. శీతాకాలంలో అయితే ఈ సమస్య చాలా మందిని ఇబ్బంది పెడుతుంది. ఇలాంటి ముడతలు చిన్న చిన్న చిట్కాలతో ఇట్టే మాయం చేయవచ్చు.

- మూడు లేదా నాలుగు గుడ్లను తీసుకొని, దాని నుంచి తెల్ల సొనను వేరు చేయాలి. దాంతో శరీరంపై మర్దన చేయాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి. ఇలా తరుచుగా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- నిమ్మకాయను ముక్కలుగా కోసి ఒక గిన్నెలో తీసుకోండి. ముఖం భాగంలో, ముడతలు ఉన్న ప్రాంతంలో ముక్కలతో చిన్నగా రుద్దాలి. పది నిమిషాల తర్వాత చల్లటి నీళ్లతో కడిగేయాలి.
- నిద్రకు ముందు ఆలివ్ ఆయిల్ రాసుకొని పడుకోవాలి. ఉదయం లేచిన తర్వాత తుడిచేయాలి. ఇలా కొన్ని చుక్కల ఆలివ్ ఆయిల్‌తో ముడుతల చర్మానికి పరిష్కారం చూపవచ్చు.
- కలబంద జెల్‌ను ఒక గిన్నెలోకి తీసుకొండి. అందులోకి కొంచెం విటమిన్-ఇ నూనెను పోయాలి. ఈ రెండింటినీ కలిపి, మిశ్రమాన్ని ముఖానికి అప్లయ్ చేయండి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగిస్తే సరిపోతుంది.
- పైనాపిల్ కూడా ముడుతల మొహానికి చక్కగా ఉపయోగపడుతుంది. కొన్ని పైనాపిల్ ముక్కలతో ముఖాన్ని మర్దనా చేయొచ్చు. ఆరిన తర్వాత చల్లని నీటితో కడిగేయాలి.

వంట చిట్కాలు



- బెండకాయ కూర చేయడానికి ముందు ముక్కల మీద కాస్త నిమ్మ రసం చల్లితే జిగురు ఉండదు.
- ఇడ్లీ, దోష పిండి పులవకుండా ఉండాలంటే.. గిన్నె మీద తడి వస్త్రం కప్పాలి లేదా సోడా ఉప్పు వెయ్యాలి.
- కారం నిల్వ ఉంచిన డబ్బాలో చిటికెడు ఇంగువ కలిపితే పురుగులు పట్టకుండా ఎక్కువ కాలం తాజాగా ఉంటుంది.
- పుదీనా, కొత్తిమీర చట్నీలు చేసేటప్పుడు వాటిలో కొద్దిగా పెరుగు వేస్తే మరింత రుచిగా ఉంటాయి.

ఆస్తమా అంటువ్యాధా?



అడుగండి చెబుతా

నా వయస్సు 18 సంవత్సరాలు. ఇప్పటిదాకా ఏ ఆరోగ్య సమస్యా లేదు. కానీ మా తల్లిదండ్రులు, దగ్గరి బంధువుల్లో చాలామందికి ఆస్తమా ఉంది. ఇది వంశపారంపర్యంగా వస్తుందా? దీని నివారణకు ఎలాంటి చికిత్స చేయించుకోవాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

పి. శ్రీనివాస్, వరంగల్

శ్రీనివాస్‌గారూ.. ఆస్తమా వ్యాధి వంశపారంపర్యంగా సోకే అవకాశాలు ఉన్నాయి. కాకపోతే శాస్త్రీయంగా ఇంకా నిర్ధారణ కాలేదు. చాలామందికి ఆస్తమా జీవనశైలిలో మార్పులు, వాతావరణ మార్పుల కారణంగానే సోకుతున్నది. ఇది జీవితకాలం వేధించే వ్యాధి. అయితే ఇప్పుడు అందుబాటులో ఉంటున్న అధునాతన చికిత్సా విధానాల వల్ల ఆస్తమాను నివారించే అవకాశాలు కొంతవరకు ఉన్నాయి. శాశ్వత నివారణ సాధ్యంకాకపోయినా వయోజనుల్లో కనీసం పది సంవత్సరాల పాటు బాధ నుంచి ఉపశమనం కలిగించే చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రధానంగా ఇన్‌హేలర్ల ద్వారా ఉపయోగించే మందులను నేరుగా శ్వాసమార్గంలోకి ప్రవేశపెట్టి నివారించవచ్చు. ఇవి శ్వాసమార్గంలో పేరుకుపోయిన మృదువైన కండరాల సాంద్రతను తగ్గిస్తాయి. దీనివల్ల శ్వాసమార్గాలు తెరుచుకుంటాయి. ఇన్‌హేల్ స్టెరాయిడ్స్ శ్వాసనాళాల వాపును తగ్గిస్తాయి. 90% ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఈ చికిత్స ద్వారానే ఉపశమనం పొందుతున్నారు. బ్రాంకియల్ థర్మోప్లాస్టీ పద్ధతి ద్వారా శాశ్వత చికిత్సకు మార్గాలు సుగమం అవుతున్నాయి. వాతావరణం ఈ వ్యాధి తీవ్రతను పెంచడంలో చాలా ముఖ్యమైన పాత్ర వహిస్తుంది. ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆస్తమా బారిన పడకుండా చూసుకోవచ్చు. సులభమైన సూచనలు పాటించడం ద్వారా కూడా ఆస్తమాను అరికట్టవచ్చు. ఉదాహరణకు.. దిండ్లపై దుమ్ము, ధూళి లేకుండా చూసుకోవాలి. కనీసం పదిహేను రోజులకు ఓ సారి పక్కబట్టలను మరుగుతున్న నీళ్లతో ఉతుకాలి. పెంపుడు జంతువులను పడకగదిలోకి, ఫర్నీచర్ పైకి రాకుండా చూసుకోవాలి. పడకగదిలో కార్పెట్లు వేయొద్దు. దూది బొమ్మలను పడకగదుల్లో పెట్టొద్దు. ఇంటి వాతావరణంలో తేమ అధికంగా ఉండకుండా చూసుకోవాలి. ఫ్లోరింగ్, బాత్రూమ్‌లను శుభ్రం చేసేందుకు ఘాటైన క్లీనర్లు, యాసిడ్స్ వాడకపోవడం మంచిది.

డాక్టర్. వై గోపీకృష్ణ
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్

నమస్తే తెలంగాణ
విశేష
[హైదరాబాద్]
గురువారం 17 జనవరి 2019

చెరువుపై తేలియాడే ద్వీపం!



ఒక చెరువు కబ్జాదారుల చేతిలో పడి.. దాదాపు అంతరించిపోతున్న తరుణంలో తిరిగి ప్రాణం పోసుకున్నది. పరిశుభ్రంగా మారి భారతదేశంలోనే అతి పెద్ద తేలియాడే ద్వీపంగా రికార్డుల్లోకెక్కింది. ఎలా? ఎప్పుడు? ఎక్కడ?

బెంగళూరు నగరంలో కట్టడాలు ఎక్కువ కావడంతో నీటి కరువు ఎక్కువ అవ్వడం ప్రారంభమయింది. కాలుష్యం బారినపడి, కబ్జాల పాలవుతున్న చెరువులను ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థలు దత్తత తీసుకొని పరిశుభ్రంగా మారుస్తున్నాయి. అక్కడి హెబ్బగోడి చెరువు మాత్రం కాస్త భిన్నం. అపార్ట్‌మెంట్లలో వాడిన నీళ్లను వృథా కాకుండా పైప్‌ల ద్వారా చెరువులోకి వదులుతున్నారు. బయో ఎంజిమ్ అనే సిస్టమ్ ద్వారా నీళ్లను శుద్ధి చేస్తూ అందులో చేపల పెంపకాన్ని చేపట్టారు. చెరువు నీటిలో తేలియాడే మొక్కలను పెట్టారు. ఆ మొక్కల వేర్లు నీటిని శుద్ధి చేస్తాయి. అలా చెరువు మధ్యలో తేలియాడే మొక్కలు చెరువును పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా తేలియాడే ఒక ద్వీపంలా కనిపిస్తాయి. ఇవి పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవు. దీంతో 1 2వేల చదరపు అడుగుల మేర తేలియాడే మొక్కలున్న ఏకైక పెద్ద చెరువుగా ఇది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కింది. బయోకాన్ స్వచ్ఛంద సంస్థ ఈ చెరువును పచ్చగా, పరిశుభ్రంగా మార్చుతున్నది. ఇదిప్పుడు మామూలు చెరువే కాదు పర్యాటక ప్రదేశం కూడా. నీళ్లలో ఉన్న ఆక్సిజన్ శాతాన్ని పెంచడం ఈ చెరువు ప్రత్యేకత.

ట్వీట్

రామ్‌గోపాల్ వర్మ
@RGVzoomin



ప్రభువా.. నేను పాల్ కాళ్లు ముట్టుకోలేదు. జస్ట్ పట్టుకొని గట్టిగా లాగితే వెనక్కి పడి తల నేలకేసి కొట్టుకొని తన బుర్ర సెట్ అవుతుందని ఆశ పడ్డా. కానీ మీరు హర్ట్ అవుతారేమోనని వదిలేసా.

వర్మను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య 3,299,267

కామన్‌మ్యాన్ వాయిస్

దేశ నాయకుడు, ప్రధానుల నిర్ణయించెటోడు, రాష్ట్రపతులను చేసేటోడు, జాతీయ పార్టీ అధ్యక్షుడు రాష్ట్రాన్ని పట్టుకొని వేలాడుడు ఎందుకు? ఈసారీ ప్రధానమంత్రి అభ్యర్థిగా పోటీ చేస్తే తెలుస్తుందిగా అసలు కథ!
–SandeepReddy Kothapally

నీళ్లు ఉన్న దగ్గర మీ కోసం బ్యారేజి కట్టిన కాటన్ దొరను దేవునిలెక్క చూపాలె. నీళ్లు లేని దగ్గరికి మా కోసం కృష్ణా, గోదావరిలను మలుపుతున్న కేసీఆర్‌ను మాత్రం నియంతలా చూపాలి. మీలాంటి కుట్రదారులను ఎదుర్కొంటూ తెలంగాణ బాగుపడాలంటే ఇలాంటి నియంతనే నాయకుడుగా ఉండాలి. కేంద్రాన్ని సైతం శాసించగలగాలి.
–ధాము నర్మాల

మణిక్కం చాయ్.. అరల్లా ఉంటుందోయ్!



ఎలాంటి రంగంలోనైనా కొత్తదనానికి ఆదరణ ఉంటుంది. ఆ రంగం చిన్నదా? పెద్దదా? అనే తేడా కూడా ఉండదు. సృజనాత్మకతకు అవధులు ఉండవు అనడానికి ఈ టీ మాస్టర్ చక్కని ఉదాహరణ. తన కళాత్మకతతో టీ కప్పులో ఐదురకాల అరలను రూపొందిస్తూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు.

తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన మణిక్కం అనే టీ మాస్టర్ వినూత్నంగా టీ కప్పులో ఐదురకాల అరలను రూపొందించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాడు. అది కూడా టీ కప్పులో డికాక్షన్, పాలు, బూస్ట్, నీళ్లు ఇలా వేరుగా కనిపించేలా తయారుచేసి తనదైన శైలిని నిరూపించుకుంటున్నాడు. ఐదు రకాల అరల్లో చాయ్‌ను తయారుచేయడానికి మణిక్కం 16 ఏండ్లకుపైగా శ్రమించాడు. జనాలందరకీ భిన్నంగా ఉండే టీని అందించాలనే ఉద్దేశంతో ఆయన దీనిని తయారుచేశాడు. ఒకే కప్పులో విడివిడిగా అందిస్తుండటం వల్ల మణిక్కం చాయ్‌కు భలే డిమాండ్ పెరుగుతున్నది. చాయ్ ప్రియుల అభిరుచి మేరకు ఒకే కప్పులో టీ, పాలు, డికాక్షన్, నీరు,బూస్ట్ కలవనీయకుండా ఐదు రంగులలో, ఐదు అరల్లో అందిస్తున్నాడు. ఇంటి వద్దనే టీ స్టాల్ ఏర్పాటుచేసి కోరినవారికి కోరిన విధంగా అరలతో కూడిన తేనీటిని అందిస్తూ అందరి మన్ననలను పొందుతున్నాడు. రోజుకు వెయ్యి కప్పులకు పైగా లేయర్డ్ టీ అమ్ముతున్నాడు మణిక్కం.


వారు గాలిని తింటున్నారు!

మీరు.. 'గాలి'ని తింటారా? పోనీ.. వేడి వేడిగా వేయించిన గాలి అయితే ఓకేనా? మీ ఇష్టం, నిర్ణయం మీదే! ఏంటి? గాలిని తినడమేంటని ఆశ్చర్యపోతున్నారా? వినడానికి కొంచెం చిత్రంగానే ఉన్నా.. అక్కడ మాత్రం 'గాలి'ని ఆవురావురుమని ఆరగిస్తున్నారు.



ఔను, మీరు విన్నది నిజమే. అక్కడ 'గాలి'ని ఆహారంగా వడ్డిస్తారు. దానిని వేడి వేడిగా ఆరగిస్తుంటారు. 'ఇదేం విడ్డూరం? గాలిని ఎవరైనా తింటారా? దాన్ని నూనెలో వేయించగలుగుతారా?' అని సందేహించకండి. ఇటలీలోని క్యాస్టెల్‌ఫ్రాంకో వెనెటో నగరంలోని ఫెవా రెస్టారెంట్‌కు వెళ్లాల్సిందే. ఎందుకంటే ఇక్కడ స్వచ్ఛమైన 'గాలి' కోరుకునేవారికి.. ఆ గాలినే ఆహారంగా వడ్డిస్తున్నారు. 'మా రెస్టారెంట్‌కు రండి, కడుపు నిండా 'గాలి'ని ఆరగించి వెళ్లండి' అని రెస్టారెంట్ నిర్వాహకులు కోరుతున్నారు. మొదట్లో వింతగానే ఉన్నా..ఇప్పుడు చాలా ఫేమస్. ఈ 'గాలి' వంటకాన్ని 'ఎరియా ఫ్రిట్టా', 'ఫ్రైడ్ ఎయిర్' అని పిలుస్తున్నారు. వీటిని ఎలా తయారు చేస్తారంటే.. కర్రపెండలం దుంప పైపొరను గుండ్రంగా చుట్టి కాసేపు మైక్రో ఓవెన్‌లో పెడతారు. అది గట్టిపడిన తర్వాత నూనెలో వేపుతారు. ఆ తర్వాత వాటిని ఒక పాత్రలోకి తీసుకుని 'ఓజోన్' గాలిని నింపుతారు. అలా సుమారు 10 నిమిషాల పాటు గాలి పంపుతారు. ఇందులో ప్రత్యేకమైన, ఆరోగ్యకరమైన పెర్‌ఫ్యూమ్‌ను వాడతారు. ఆ తర్వాత వాటిని దూదిపై ఉంచి కస్టమర్లకు వడ్డిస్తారు. ఆ దూదిని వాళ్లు 'మేఘాలు'గా పేర్కొంటారు. దీని ధర 30 అమెరికా డాలర్లు (మన కరెన్సీలో రూ.2,011). ఈ 'ఫ్రైడ్ ఎయిర్'ను మొదట్లో ఉచితంగానే ఇచ్చేవారు. వీటికి బాగా డిమాండ్ పెరగడంతో రెగ్యులర్ మెనూలో దీన్ని చేర్చారు. ఇంకెందుకు ఆలస్యం మీరెప్పుడైనా ఇటలీకి వెళ్తే.. ఈ 'గాలి' ఆహారాన్ని రుచి చూడండి.

వింత మనుషులు!



మీరు నీళ్లలో నిండా మునిగి కండ్లు తెరిచి చూడగలరా? ఎంత ఎత్తు నుంచైనా భయపడకుండా అమాంతం కింద దూకేయగలరా? చలికి వణకకుండా ఆరుబయట తిరుగగలరా? ప్రాణవాయువు తక్కువగా వున్న ఎత్తైన ప్రదేశంలో హాయిగా జీవించగలరా?.. ఏంటీ ప్రశ్నలు అనుకుంటున్నారా? అసలు మనిషనేవాడు ఎవరైనా అలా ఉండగలరా? అని తిరిగి ప్రశ్నించాలనిపిస్తుందా? కొన్ని ప్రాంతాల్లో నివసించే కొన్ని జాతుల వాళ్లు అలా నీళ్లలో కూడా చూడగలరు. ప్రాణవాయువు తక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా హాయిగా బతికేయగలరు. వారి గురించి ఇంకా చాలా విశేషాలున్నాయి. ఆ ముచ్చట్లన్నీ.. ఈ రోజు 'విశేష'లో మీకోసం..

ముఖం కడుక్కునేటప్పుడు కళ్లలో నీళ్లు పడుతాయేమో అని కళ్లు మూసుకొని కడుక్కుంటాం. కంటిలో ఏదైనా చిన్న వస్తువు పడినా తల్లడిల్లిపోతాం. కానీ మాకెన్ జాతి ప్రజలు అలా కాదు. సముద్రంలో నిండా మునిగి కళ్లు తెరిచి చేపలను వేటాడుతారు. అసలు మామూలు మనుషులకు నీళ్లలో మునగగానే కళ్లు సరిగ్గా కనిపించవు. అన్నీ మసక మసకగా కనిపిస్తుంటాయి. కానీ మాకెన్ జాతి వారికి ఆ సమస్య ఉండదు. బయట మనకు దృశ్యం ఎలా కనిపిస్తుందో.. నీళ్లలో కూడా వారికి స్పష్టంగా కనిపిస్తుంది. అండమాన్ తీర ప్రాంతాల్లో నివసించే మాకెన్ జాతి ప్రజల ప్రత్యేకత ఇది. మూడు తెగల కలయికతో ఈ మాకెన్ జాతి ఏర్పడింది. నీటిలో ఉండే గుర్రాలను పోలిన జంతువులను నీటి గుర్రాలు అని పిలిచినట్టు.. ఆ చుట్టుపక్కల ఇతర తెగల ప్రజలు వీరిని 'నీటి మనుషులు' అని పిలుస్తారు. వీరు భూమ్మీద కంటే నీటిలోనే ఎక్కువగా సంచరిస్తారు. చేపలు, తిమింగలాలు, కొన్నిరకాల నీటిజీవులు మాత్రమే నీళ్లలో కూడా దూరంగా ఉన్న వస్తువులను కూడా స్పష్టంగా చూడగలవు. ఈ మాకెన్ జాతి ప్రజలు పుట్టుకతోనే ఆ లక్షణంతో పుట్టారు. 2003లో కరెంట్ అనే బయాలజీ మ్యాగజైన్ వారు జరిపిన ఓ అధ్యయనంలో వీరి గురించి చర్చ జరిగింది.

వీరి ఎముకలు స్టీల్ కంటే దృఢం..



వయసు మీద పడుతున్న కొద్దీ ఎముకల్లో బలం తగ్గిపోతుంది. ఏ మాత్రం పట్టు తప్పి కిందపడినా.. కాలో, చెయ్యో విరుగడం ఖాయం. విరిగిన ఆ ఎముకను మళ్లీ అతికించడమంటే ఇసుకలోంచి నూనె తీసినంత కష్టం. కానీ.. ఆఫ్రికా ఖండానికి చెందిన ఆఫ్రికేనర్ అనే జాతి ప్రజలు దీనికి భిన్నం. వారి జన్యువుల్లో ఎస్ఓఎస్‌టీ అనే జన్యువు పుష్కలంగా ఉంటుంది. వయసు మీద పడుతున్న కొద్దీ మామూలు మనుషుల్లో జన్యువుల పనితీరు, ఉత్పత్తి మందగిస్తుంది. కానీ వీరిలో మాత్రం మరింత ఉత్సాహంగా జన్యువులు ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల వారి శరీరాల్లో స్క్లెరాస్టిన్ అనే ప్రొటీన్ ఉత్పత్తి అవుతుంది. అది కాస్త ఎముకల దృఢత్వానికి, శరీరం భారీగా, దృఢంగా మారడానికి దారి తీస్తుంది. అందుకేనేమో.. చాలామంది ఆఫ్రికా జాతుల వారు భారీ కాయాలతో కనిపిస్తారు.

ఎత్తంటే వీరికి ఎంతో ఇష్టం..

కొంతమంది ఎత్తైన ప్రదేశం నుంచి కిందికి చూడాలంటే భయపడిపోతారు. మరికొంతమంది అసలు ఎత్తైన ప్రాంతానికి వెళ్లాలంటేనే వణికిపోతారు. కానీ. హిమాలయాల్లో ఉండే ఆండియన్ జాతి ప్రజలు ఇందుకు భిన్నం. సముద్రమట్టానికి ఐదువేల అడుగుల ఎత్తులో కూడా వీరు హాయిగా జీవించేస్తారు. అంత ఎత్తైన ప్రదేశంలో ప్రాణవాయువు తక్కువగా ఉంటుంది. శ్వాస తీసుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. కానీ వీరు మాత్రం ఆడుతూ పాడుతూ బతికేస్తారు. ఇంతకీ ఇక్కడ రహస్యమేంటో తెలుసా.. వీరిలో ఊపిరితిత్తుల సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. దీంతో వారు ఒక్కసారి శ్వాస తీసుకుంటే శరీరానికి అవసరమైన దాని కంటే ఎక్కువ ఆక్సీజన్ అందుతుంది. దీంతో ఎక్కువసేపు శ్వాస తీసుకోకుండా ఉండగలరన్న మాట. పుట్టుకతోనే పర్వత ప్రాంతాల్లో, ఎత్తైన ప్రాంతాల్లో పెరుగడం వల్ల వీరు ఈ లక్షణాలతో అతీంద్రియ శక్తులున్న మనుషుల్లా బతికేస్తున్నారు.



చలినే వణికిస్తారు..



ప్రస్తుతం బయట ఎంత చలిగా ఉందో మనం ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాం. ఉష్ణోగ్రత 20 డిగ్రీలకు పడిపోతేనే మనం ఓ.. వణికిపోతున్నాం. ఎందుకంటే మన శరీరం 35 నుంచి 37 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉంటుంది. అంతకన్నా ఉష్ణోగ్రత తగ్గితే శరీరం వణకడం మొదలుపెడుతుంది. అయితే.. దీనికి భిన్నంగా ఆర్కిటిక్ ప్రాంతాల్లో నివసించే ప్రజలు గడ్డకట్టే చలికి అలవాటు పడిపోయారు. వీరిని ఇన్యూట్స్, నెనెట్స్ అంటారు. ఇతర ప్రాంతాల ప్రజల కంటే వీరి శరీర ధర్మం భిన్నంగా ఉంటుంది. వీరి చర్మంలో స్వేదగ్రంథులు తక్కువగా ఉంటాయి. వీరి చర్మం ఇతర జాతుల చర్మం కంటే వేడిగా ఉంటుంది. వీరి శరీరంలో జీవక్రియలు కూడా చాలా వేగంగా జరుగుతాయి. అందుకే వీరిని చలి ఏమీ చేయలేదు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా వీరు హాయిగా ఆడుతూ పాడుతూ గడిపేస్తారు. ఈ ఇన్యూట్స్, నెనెట్ జాతి ప్రజలకు ఈ లక్షణం జన్యుపరంగా సంక్రమించింది. వారి ప్రాంతానికి వెళ్లి వారిలా జీవించాలని ఎవరైనా ప్రయత్నిస్తే ప్రాణాలు గడ్డకట్టుకుపోతాయి.

... ప్రవీణ్‌కుమార్ సుంకరి

వైరల్ వీడియో



సకుటుంబ సపరివార సమేతంగా పేరుతో జరిగిన సంక్రాంతి ఈవెంట్ యూట్యూబ్‌లో అత్యధిక వ్యూస్ సాధించింది. ఒక్కరోజులోనే మూడు మిలియన్లకు పైగా మంది చూశారు.

Sakutumba Saparivara Samethamga | ETV Sankranthi Special Event | Full Episode | 15th January 2019

Total views : 3,180,913+

Published on Jan 14, 2019

సుడోకు

డైలీ సుడోకు 38 సమాధానం

3	7	6	1	4	2	9	5	8
5	8	4	6	7	9	2	1	3
9	1	2	8	3	5	4	7	6
6	9	1	2	5	4	3	8	7
8	4	5	3	6	7	1	9	2
2	3	7	9	1	8	5	6	4
4	6	9	5	8	3	7	2	1
7	2	8	4	9	1	6	3	5
1	5	3	7	2	6	8	4	9

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -39

	7			8				2
2		3						8
	8	9		1			4	5
	4		3				1	
	1		6		4	8	5	9
					7			
		5			1		3	
								1
		8					6	4

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

యూపీఎస్సీ మెడికల్ ఆఫీసర్లు

కేంద్రప్రభుత్వ పరిధిలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెడికల్ ఆఫీసర్లు తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.




పోస్టులు–ఖాళీలు–అర్హతలు:

- **పోస్టు:** మెడికల్ ఆఫీసర్ (జీడీఎంవో)–327
- ఈ పోస్టులు ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ (ఢిల్లీ ఎన్‌సీఆర్) పరిధిలో ఉన్నాయి.
- **పేస్కేల్:** రూ.15,600–39,100+జీపీ. రూ. 5400/–
- **అర్హతలు:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణత. ఎంసీఐ నిబంధనల ప్రకారం ఇతర అర్హతలు ఉండాలి.
- **పోస్టు:** అసిస్టెంట్ ప్రొఫెసర్
- **విభాగాల వారీగా ఖాళీలు:** అనెస్థీషియా–4, కార్డియాలజీ–1, సీటీవీఎస్–2, గ్యాస్ట్రోమెడిసిన్–1, గ్యాస్ట్రోసర్జరీ–1, నెఫ్రాలజీ–1, న్యూరాలజీ–1, సైకియాట్రి–1, పల్మనరీ మెడిసిన్–1, సర్జికల్ ఆంకాలజీ–1, రేడియాలజీ–1, యూరాలజీ–1 ఖాళీ ఉన్నాయి.
- **అర్హతలు:** ఎంబీబీఎస్‌తోపాటు సంబధిత అంశంలో పీజీ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు కనీసం మూడేండ్ల అనుభవం ఉన్నవారు అర్హులు.
- వీటితోపాటు ఇంజినీర్&షిప్ సర్వేయర్ కమ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (టెక్నికల్)–1, సైంటిస్ట్ బీ (జూనియర్ జియోఫిజిసిస్ట్)–1, సీనియర్ లెక్చరర్ (అనెస్థీషియాలజీ–2, ఫోరెన్సిక్ మెడిసిన్–2, జనరల్ మెడిసిన్–1, పీడియాట్రిక్స్–1, పాథాలజీ–2, రేడియో డయాగ్నసిస్–2 ఖాళీలు.
- **నోట్:** అర్హతలు ఆయా పోస్టులకు వేర్వేరుగా ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 31
- ప్రింట్ కాపీని పంపడానికి చివరితేదీ: ఫిబ్రవరి 1
- **ఫీజు:** రూ.25 (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఎటువంటి ఫీజులేదు)
- **వెబ్‌సైట్:** http://www.upsconline.nic.in

వరంగల్ నిట్‌లో

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.




- అడ్వాన్స్‌డ్ అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ప్రాజెక్టులో భాగంగా కింది పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు.
- ప్రాజెక్టు ఇంజినీర్–2
- **అర్హతలు:** ఎంటెక్‌లో మెటలర్జీ/మెటీరియల్స్ లేదా మెకానికల్
- **జీతం:** నెలకు రూ. 36,400/–
- టెక్నికల్ అసిస్టెంట్–2
- **అర్హతలు:** డిప్లొమా (మెటలర్జీ/మెకానికల్)
- **జీతం:** నెలకు రూ. 25,000/–
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** https://www.nitw.ac.in

జిప్‌మర్‌లో 70 ఖాళీలు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్&రిసెర్చ్ (జిప్‌మర్)లో గ్రూప్ బీ,సీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- మొత్తం ఖాళీలు–70.
- గ్రూప్ బీ పోస్టులు:
- జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్–3, టెక్నికల్ అసిస్టెంట్ (న్యూక్లియర్ మెడిసిన్)–2, టెక్నికల్ అసిస్టెంట్–1, నర్సింగ్ ఆఫీసర్–60 ఖాళీలు.
- గ్రూప్ సీ పోస్టులు:
- గ్రేడ్–2 స్టెనోగ్రాఫర్–3, ఎంటీఎస్ (కాబ్లర్)–1 ఖాళీ ఉన్నాయి.
- **అర్హతలు:** జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టుకు– పీజీలో హిందీ/ఇంగ్లిష్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత. హిందీ నుంచి ఇంగ్లిష్ లేదా ఇంగ్లిష్ నుంచి హిందీలోకి అనువదించగల సామర్థ్యం ఉండాలి. టెక్నికల్ అసిస్టెంట్ న్యూక్లియర్ మెడిసిన్ పోస్టుకు డిగ్రీలో న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ చదివి ఉండాలి. లేదా డిగ్రీస్థాయిలో ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత. నర్సింగ్ ఆఫీసర్ పోస్టుకు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో డిగ్రీ లేదా డిప్లొమా ఉత్తీర్ణత. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ యాక్ట్ ప్రకారం ఏదైనా రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉండాలి. వయస్సు 35 ఏండ్లు మించరాదు.



- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 13
- **వెబ్‌సైట్:** www.jipmer.puducherry.gov.in

నాన్ టీచింగ్ పోస్టులు

బెర్హంపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.



- **పోస్టులు:** రిజిస్ట్రార్–1, లైబ్రేరియన్–1, సూపరింటెండింగ్ ఇంజినీర్–1, డిప్యూటీ రిజిస్ట్రార్–1, మెడికల్ ఆఫీసర్–1, అసిస్టెంట్ రిజిస్ట్రార్–3, నర్స్–1, అసిస్టెంట్ ఇంజినీర్–1, సూపరింటెండెంట్–1, టెక్నికల్ అసిస్టెంట్–1, సైంటిఫిక్ అసిస్టెంట్–1, లైబ్రేరి ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–1, జూనియర్ సూపరింటెండెంట్–2, ల్యాబొరేటరీ టెక్నీషియన్–2, జూనియర్ అసిస్టెంట్ (మల్టీస్కిల్)–1
- **అర్హతలు:** ఆయా పోస్టులకు వేర్వేరుగా ఉన్నాయి, వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** ఫిబ్రవరి 9
- హార్డ్‌కాపీలను పంపడానికి **చివరితేదీ:** ఫిబ్రవరి 18
- **వెబ్‌సైట్:** https://www.iiserbpr.ac.in

నిట్‌లో ఎంబీఏ

ప్రయాగ్‌రాజ్‌లోని మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్ నిట్)లో ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ప్రకటన విడుదలైంది.

- **కోర్సు:** ఎంబీఏ (2019–20)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా డిగ్రీ కనీసం 60 శాతం లేదా తత్సమాన సీపీఐతో ఉత్తీర్ణత. డిగ్రీ చివరిసంవత్సరం పరీక్షలు రాయనున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు క్యాట్–2018లో అర్హత సాధించి ఉండాలి.
- సీట్ల సంఖ్య–62
- **ఎంపిక:** క్యాట్–2018 స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా
- **జీడీ, ఇంటర్వ్యూ తేదీ:** ఏప్రిల్ 7
- **తరగతులు ప్రారంభం:** జూలై 22
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 22
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీ ప్రింట్‌ను పంపడానికి **చివరితేదీ:** మార్చి 1
- **వెబ్‌సైట్:** www.mnnit.ac.in

నమస్తే తెలంగాణ
రైతుబడి
[హైదరాబాద్]
గురువారం 17 జనవరి 2019
raithubadi@ntnews.com

షేడ్‌నెట్స్‌లో కూరగాయల సాగు

ఎండకాలం కూరగాయల ధరలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత వల్ల చాలామంది రైతులు కూరగాయల సాగు చేయడానికి మొగ్గు చూపడం లేదు. ఈ నేపథ్యంలో రైతులను కూరగాయల సాగువైపు మళ్లించి, వినియోగదారులకు అందుబాటు ధరలో కూరగాయలు లభించడానికి ఉద్యానశాఖ రైతులకు రాయితీలు ఇస్తున్నది.



షేడ్‌నెట్స్ వల్ల ఉపయోగాలు

కూరగాయల పంటల్లో అధిక దిగుబడులు రావాలంటే వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండాలి. సాధారణంగా రైతులు పండించే కూరగాయలకు 22-36 ఉష్ణోగ్రతలు అనుకూలం. కానీ ఎండకాలంలో పగటి ఉష్ణోగ్రతలు 36-45 వరకు ఉంటాయి. దీంతో అధిక వేడితో కూరగాయల పంటల్లో పూత, పిందే రాలుతుంది. తద్వారా దిగుబడి తగ్గుతుంది. కాబట్టి ఈ సమయంలో షేడ్‌నెట్స్ వాడటం వల్ల అధిక ఉష్ణోగ్రతల నుంచి కూరగాయల పంటలకు రక్షణ కల్పించవచ్చు. దీనిద్వారా 15-20శాతం నీటిని కూడా ఆదా చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అలాగే నాణ్యమైన, దీర్ఘకాలం పంటలు పండించవచ్చు.

ఎండకాలంలో సాగు చేసే పంటలు

షేడ్‌నెట్స్ కింద ఎండకాలం టమాటా, వంకాయ, పచ్చిమిరప, క్యాప్సికం, బీర, సోర, కాకర, ఆకుకూరలు, కొత్తిమీర తదితర పంటలను పండించుకోవచ్చు. చిన్న, సన్న కారు రైతులు షేడ్‌నెట్స్ సాగు చేసుకోవచ్చు. రైతు ఒక్కసారి కొనుగోలు చేస్తే దాదాపు ఐదేండ్ల వరకు దీన్ని వాడుకోవచ్చు.

మోనో మోనో 120 జిఎస్‌ఎం నాణ్యత కలిగిన షేడ్‌నెట్స్ రైతులకు ఒక చదరపు మీటరుకు పూర్తి ధర గరిష్ఠంగా రూ.39.40పైసలు(జీఎస్టీతో కలిపి) ఉంటుంది. ఇందులో చదరపు మీటరుకు రాయితీ రూ.17.50పైసలు రైతు వాటా రూ.22.40పైసలు చెల్లించాలి. అంటే ఎకరానికి రాయితీ రూ.70వేలు పోను రూ.89,600 రైతు చెల్లించాలి. ఒక రైతు కనిష్ఠంగా 10 గుంటల నుంచి ఒక ఎకరం వరకు లబ్ధి పొందవచ్చు. రాయితీ పొందడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతరులు అందరూ అర్హులే. పట్టపాసు పుస్తకం, ఆధార్, బ్యాంక్ కౌంట్ జిరాక్స్‌లు, రాయితీ పోను మిగిలిన సొమ్ము డీడీల రూపంలో సమీప ఉద్యానశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.
మరింత సమాచారం కోసం ఉద్యాన శాఖ అధికారుల ద్వారా తెలుసుకోవచ్చు.

ఉద్యానశాఖ అధికారుల ఫోన్‌నెంబర్లు
రాకేశ్ (7997725109), అనితాశ్రీ (7997725110), విష్ణు (7997725111)

-గుండెల రాజు, 72889 85757
మహబూబాబాద్ వ్యవసాయం



షేడ్‌నెట్స్‌లో కూరగాయల సాగు



మనదేశం రొయ్యల ఎగుమతిలో మంచి పురోగతి సాధించింది. ఈ రొయ్యల్లో ఎక్కువ భాగం చెరువుల్లో పెంచినవి. సముద్రపు రొయ్యల్లో సంక్రమించిన వైరస్ రోగాలు, పర్యావరణ సమస్యల కారణంగా రొయ్యల పెంపకం ఆశించిన ప్రగతి సాధించడం లేదు. వీటికి ప్రత్యామ్నాయంగా మంచినీటిలో పెరిగే రొయ్యల పెంపకంపై మన రాష్ట్రంలో రైతులు ఎక్కువ ఆసక్తి చూపెడుతున్నారు. మంచినీటి రొయ్యలు రాష్ట్రంలోని నదులు, రిజర్వాయర్లలో ఎక్కువ సంఖ్యలో లభిస్తాయి. పెంపక చెరువులో వీటికి కలిగే రోగాలు చాలా తక్కువ. అలాగే తేలికగా నివారించుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మంచినీటి రొయ్యల పెంపకానికి చేయూతనిస్తున్నది. దీంతో వీటి పెంపకం చేపట్టి రైతులు మంచి లాభాలను పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

మంచినీటి రొయ్యలు లాభదాయకం

■ ప్రతికూల పరిస్థితులను తట్టుకునే రకం నీలకంఠ ■ పెంపకపు చెరువుల్లో అవసరాన్ని బట్టి ఎరేటర్‌లు వాడాలి ■ మిశ్రమ పెంపకం ఉత్తమం

మంచినీటి రొయ్యలు నదులు, చెరువులు, కుంటలు కాలువల్లో నీటి అడుగు భాగాన నివశిస్తాయి. దేశంలో అనేక జాతుల మంచినీటి రొయ్యలు ఉన్నాయి. అయినప్పటికీ వాటిలో కొన్నిరకాలు మాత్రమే చెరువుల్లో పెంపకానికి అనువైనవి. అవి 1. మేక్రోబ్రేకియం రోసెన్‌బర్గై (నీలకంఠ రొయ్య) 2. మేక్రోబ్రేకియం మాల్కంసోని 3. మేక్రోబ్రేకియం చోప్రాయ్. వీటిలో నీలకంఠ (స్కాంపి) వేగంగా పెరుగడమే కాకుండా ప్రతికూల పరిస్థితిని తట్టుకునే శక్తి కలిగిన రకం. ఈ జాతి రొయ్యల్లో మగ రొయ్యలు 33 సెం.మీలు, ఆడ రొయ్యలు 28 సెం.మీల సైజు పెరుగుతాయి.

చెరువు నిర్మాణం: 0.5-1.0 హెక్టారు (1-1.25 ఎకరాలు)లోతు 1.2-1.5 మీటర్‌లు విస్తీర్ణం కలిగిన చెరువులు అనుకూలంగా ఉంటాయి.

పెంపకపు యాజమాన్యం: నర్సరీ చెరువుల్లో 3-4 సెం.మీ (3 గ్రామల పరిమాణం) రొయ్య పిల్లలను(జువైనల్స్) విసురు వలలో గానీ, లాగుడు వలలోగానీ పట్టి పెద్ద చెరువు (గో అవుట్)కు మార్చాలి. హెక్టారు విస్తీర్ణంలో 20-30 వేల పిల్లలను స్టాక్ చేసుకుని పెంచుకోవచ్చు. హెక్టారుకు 40-60వేల పిల్లలను స్టాక్ చేసినట్లైతే తప్పనిసరిగా నాలుగుఎరేటర్‌లను వాడాలి. వీటికి తగిన పరిమాణంలో అదనపు ఆహారాన్ని అందించాలి.

ఏకలింగ రొయ్యల (మోనోసెక్స్ కల్చర్) సాగు: మంచినీటి రొయ్యల్లో మగ రొయ్యలు, ఆడ రొయ్యల కన్నా ఎక్కువ బరువు పెరుగుతాయి. అధిక దిగుబడులు పొందడానికి నర్సరీలలో రొయ్య పిల్లలను ఎకరానికి 16000-24000 వరకు వేసి నర్సరీ సాగు చివరిలో ఆడ, మగరొయ్యలను వేరు చేయాలి. వాటిని వేరు వేరు సాగు చెరువుల్లో ఎకరాకు 2500-5000 వరకు సరాసరి బరువు 5-10 గ్రాములు వేసి పెంచడం వల్ల తక్కువ కాలంలోనే ఆడ రొయ్యలు 50-60 గ్రాములు మగ రొయ్యలు 80-100 గ్రాములు సరాసరి బరువును చేరుకుంటాయి.

పాలికల్చర్ విధానంలో: ఒక హెక్టార్ విస్తీర్ణానికి

ఖర్చులు	
రొయ్య పిల్లలకు / చేపపిల్లలకు	: 20,000
అదనపు ఆహారం	: 1,00,000
కూలీల ఖర్చు	: 80,000
పట్టుబడి	: 12,000
ఇతర ఖర్చులు	: 12,000
మొత్తం	**2,24,000**
దిగుబడి	
రొయ్యలు (హెక్టారు విస్తీర్ణంలో) 500 కేజీలు	
500 x 300	= 1,50,000
చేపలు	= 4,000 కేజీలు
4000x80	= 3,20,000
మొత్తం	**4,70,000**
నికర ఆదాయం (హెక్టారుకు):	
4,70,000 - 2,24,000	= 2,46,000 రూపాయలు

మిశ్రమ పెంపకం (పాలికల్చర్): మిశ్రమ పెంపకంలో దేశవాళీ చేపలతో పాటు మంచినీటి రొయ్యలను పెంచవచ్చు. దీన్నే పాలికల్చర్ అంటారు. హెక్టారుకు 10,000 చొప్పున నర్సరీలో పెంచిన రొయ్య పిల్లలు 4000 (సరాసరి బరువు 200 గ్రాములు) గల కార్ప్ చేపలను కలిపి మిశ్రమ పెంపకం ద్వారా సుమారు 500 కిలోల రొయ్యలు, 3500-4000 కిలోల చేపలను ఉత్పత్తి చేయవచ్చు. మిశ్రమ పెంపకంలో రొయ్యలకు అదనంగా మేత ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎందుకంటే చేపలకు ఇస్తున్న ఫీడ్‌లో కొంత రొయ్యలు ఇబ్బంది లేకుండా వినియోగించుకుంటాయి. మంచినీటి రొయ్యలు సర్వభక్షకులు, నీటిలోని నాచు, సహజంగా లభ్యమయ్యే ప్లాంక్టాన్ (ప్లవకాలు) నీటి పురుగులు, సేంద్రియ మురుగు పదార్థాలను ఆహారంగా తీసుకుంటాయి.

రొయ్యల సైజు వ్యత్యాసం: మంచినీటి రొయ్యల పెంపకంలో ముఖ్యంగా నీలకంఠ రొయ్యల పెంపకంలో సైజు వ్యత్యాసాల యాజమాన్యం ముఖ్యమైంది. పెరుగుదల అసమానతలు మగ వాటిలో ఎక్కువ. ఈ అసమతుల్య పెరుగుదలను హెటిరోజీనస్ ఇండివిడువల్ గ్రోత్ (హెచ్.ఐ.జీ) అంటారు. మగ వాటిలో మూడు రకాల రూపాంతరాలు కలవు.
1.చిన్నమగవి 2. నారింజరంగ డెక్కలు కలవి. 3.నీలి రంగు డెక్కలు కలవి.
1. చిన్నమగవి: ఇవి చిన్న డెక్కలు కలిగిన పెరుగుదల లేని (స్టంటెడ్) మగవి. వీటి డెక్కలు శరీరముకన్నా 0.4-0.9 రెట్లు అధికం లేదా డెక్కలు లేకుండా ఉంటాయి.
2. నారింజ రంగు డెక్కలు కలవి: ఇవి నారింజ రంగులో డెక్కలు కలిగి శరీర పొడవు కన్నా 0.8-1.4 రెట్లు పొడవైన డెక్కలు కలిగి ఉంటాయి.
3. నీలిరంగు డెక్కలు కలవి: ఇవి నీలిరంగు పొడవైన డెక్కలు కలిగి ఉంటాయి. వీటి డెక్కలు శరీర పొడవులో 1.4-2.0 రెట్లు ఉంటాయి.

ఈ రూపాంతరాల్లో చిన్న మగవి మృదుత్వంగాను, నారింజ రంగు డెక్కల మగవి కొంచెం బలం కలిగి, నీలి రంగు డెక్కల మగవి అన్నింటి కన్నా ఎక్కువ బలం కలిగి ఉంటాయి. నీలి రంగు డెక్కలు దశ పెరుగుదలలో చివరి దశ. కాబట్టి వెంటనే పట్టుబడి చేయాలి.

మార్కెటింగ్: మంచినీటి రొయ్యలు 100-120 రోజుల పెంపకం తర్వాత మార్కెటింగ్ చేయవచ్చు. పెరుగుదలలో వ్యత్యాసాన్ని బట్టి ప్రతి 15-20 రోజులకు పెద్ద సైజు మగ రొయ్యలను మార్కెటింగ్ చేసుకోవాలి.

– నట్టె కోటేశ్వర్‌రావు, 9989944945
గరిడేపల్లి,సూర్యాపేట జిల్లా

మంచి లాభాలు



మంచినీటి రొయ్యల పెంపకం చేపట్టాలనుకునే రైతులకు నీలకంఠ రొయ్య లాభదాయకంగా ఉంటుంది. ఇది వేగంగా పెరుగడమే కాకుండా ప్రతికూల పరిస్థితులను సైతం తట్టుకుంటుంది. వీటి పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. అంతేకాదు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయబడిన చెరువులలో ఉచితంగా వీటి పిల్లలను వదిలింది. దిగుబడులు కూడా ఆశాజనకంగానే ఉన్నాయి. రొయ్యలతో పాటు కార్ప్ చేపలైన బొచ్చె, రాగండి, వెండిచేప వంటి వాటిని మిశ్రమంగా పెంపకం చేపడితే మరింత మంచి ది. చేపల పెంపకానికి ప్రభుత్వం అంది స్తున్న ప్రోత్సాహాన్ని వినియోగించుకుంటూ రొయ్యల పెంపకాన్ని చేపట్టి మంచి లాభాలను పొందవచ్చు.

-బూర్గు లవకుమార్,9849063796
కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి

మునగ చెట్లలో పురుగుల నివారణ

రైతులు మునగసాగు చేపట్టడం ఎంతో మేలు. రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించి మునగ సాగు చేపట్టడం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చు. చాలామంది రైతులు వరి పంటనే సాగు చేస్తారు. రైతులు ఎప్పుడూ వరిపైరునే సాగు చేయడం వల్ల యాసంగిలో రైతులకు సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నది. కాబట్టి రైతులు ఎప్పుడూ వరి పంటపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల ను సాగు చేయడం ఎంతో మేలు. రైతులకు మునగ సాగు ఎంతో లాభాధాయకంగా ఉంటుందని త్రిపురారం వ్యవసాయ విస్తరణాధికారి స్వాతి సూచిస్తున్నారు. మునగసాగు చేసే రైతులు తగిన యాజమాన్య పద్ధతులను పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందని వారు సూచించారు.

ఎరువుల యాజమాన్యం

ప్రతి పాదులో 10 కిలోల పశువుల ఎరువుతో పాటు 250 గ్రాముల వేపపిండి, 250 గ్రాముల సూపర్ ఫాస్పేట్ కలిపి వేయాలి. మొక్కలు 75-90 సెంటీ మీటర్లు పొడవు పెరిగిన తరువాత కొమ్మలను కత్తి రిస్తే ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

తెగుళ్లు, పురుగుల నివారణ

మునగను ఆశించే పురుగుల్లో గొంగలిపురుగు ప్రధానమైనది. గొంగలిపురుగు నివారణకు క్వినోల్‌ఫాస్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దీంతో పాటు ఒక్కొక్క చెట్టుకు పాదులో 30 గ్రాములు కార్టాలిప్‌పొడి, కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలి. కాయతొలుచు ఈగ నివారణకు పూత ప్రారంభ దశలో జోలోన్ అదేవిధంగా, పూర్తిగా పూత వచ్చిన తరువాత రోగార్, పిందెకట్టిన దశలో పిప్రోనిల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచి కారీ చేయాలి.

-నగిరి హరీష్, త్రిపురారం



కరివేపాకు సాగు దీర్ఘకాలిక ఆదాయం

కరివేపాకు సువాసన, ఔషధ విలువ గల మొక్క. విదేశీ ఆదాయం పొందే మొక్కల్లో ఒకటి. కరివేపాకు ఆకులను కూరల్లో వాడుతారు.

కరివేపాకు మొక్కలను విస్తృత నేల రకాల్లో సాగు చేయవచ్చు. అధిక సేంద్రియ పదార్థాలతో కూడిన ఇసుక నేలలు ఈ సాగుకు అనుకూలం. నేల ఉదజని సూచిక 6.0-7.5 మధ్య ఉండాలి. 25 నుంచి 37 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు గల ప్రదేశాల్లో దీన్ని సాగు చేయవచ్చు.

ఏడాది వయస్సు ఉన్న మొక్కలను పొలంలో (30X30X 30 సెం.మీ లోతు, ఎత్తు, వెడల్పు గుంతలను తయారు చేసుకోవాలి.) గుంతకు గుంతకు మధ్య 1.2 నుంచి 1.5 మీటర్ల వరకు దూరంలో నాటుకోవాలి.

మొక్కలను నాటే ముందు నేలను నాలుగైదు సార్లు దున్నాలి. మొక్కలు పొలంలో నాటిన వెంటనే నీళ్లు పెట్టాలి. తర్వాత మూడురోజులకొకసారి, తర్వాత వారానికి ఒకసారి నీరు అందించాలి.
సాధారణంగా అకర్బణ ఎరువులు కరివేపాకు సాగులో వాడరు. కానీ అధిక దిగుబడుల కోసం 10 కిలోల పశువుల ఎరువు, 60 గ్రాముల నత్రజని, 89 గ్రాముల ఫాస్పరస్, 40 గ్రాముల పొటాషియం ప్రతి మొక్కకు ఏడాదికి సరిపడే విధంగా చూసుకోవాలి.

మొక్క మీటరు ఎత్తు పెరిగినప్పుడు టెర్మినల్ మొగ్గను కత్తిరించి శాఖలను ప్రోత్సాహపరుచాలి. ఒక్క మొక్కకు 5-6 శాఖల వరకు నిర్వహించాలి. తర్వగా మందపాటి ఎదుగుదల కోసం కత్తిరింపులు అవసరం.



పప్పుధాన్యాలు, ఆకుకూరలను అంతర పంటలుగా వేసుకోవచ్చు. కరివేపాకు ఆకులను గొంగళి పురుగులు తిని నష్టపరుస్తాయి. దీని నివారణకు మలాథియాన్ 2. మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు నివారణకు 1 గ్రాము కార్బండిజాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత పదిరోజుల వ్యవధి ఇచ్చి ఆకు కోయాలి.

మొదటి సంవత్సరంలో నాటిన 10-12 నెలల్లో కోతకు వస్తుంది. ఎకరానికి 100-160 కిలోల దిగుబడి వస్తుంది. రెండో ఏడాది ప్రతి నాలుగు నెలలకొకసారి 700 కిలోల చొప్పున ఎకరానికి 2100 కిలోల దిగుబడి వస్తుంది. మూడో ఏడాదిలో 2100 కిలోల దిగుబడి వస్తుంది. నాల్గవ ఏడాదిలో ప్రతి మూడు నెలలకు ఒక కోతకు 2000 కిలోల చొప్పున సంవత్సరానికి 8000 కిలోల చొప్పున దిగుబడి వస్తుంది. 20-25 ఏండ్ల పాటు ఈ పంటను లాభదాయకంగా సాగుచేసుకోవచ్చు.



– జి. షారోన్ రోజ్

రైతుబడికి ఆహ్వానం

రైతు పంట పొలాలే జీవితంగా వ్యవసాయంలో రేయింబవళ్లు పనిచేస్తాడు. తమవైన అనుభవాలు, గుణపాఠాలతో మెరుగైన, మేలైన పంట విధానాలకు జీవం పోస్తాడు. ఇలాంటి అనుభవాలు పదిమందితో పంచుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుంది. కాబట్టి రైతు సోదరులు తమవైన అనుభవాలు, గుణపాఠాలతో పాటు, తమ సృజనాత్మక పనిలో భాగంగా కొత్తగా ఆవిష్కరించిన పనిముట్ల గురించి రైతుబడికి రాసి పంపించగలరు.



రచనలు పంపవలసిన చిరునామా 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. raithubadi@ntdaily.news, Fax-040-23291118


విశాల్, అనీషా

హైదరాబాద్ అమ్మాయితో పెళ్లి..

హీరో విశాల్ పెళ్లిపీటలెక్కనున్నారు. హైదరాబాద్‌కు చెందిన అనీషాను వివాహమాడనున్నారు. కాబోయే శ్రీమతితో దిగిన ఓ ఫొటోను బుధవారం ట్విట్టర్ ద్వారా పంచుకున్న ఆయన త్వరలో తమ పెళ్లి తేదీని వెల్లడిస్తామని పేర్కొన్నారు. 'అనీషాను పెళ్లిచేసుకోబోతున్నాను. చాలా సంతోషంగా ఉంది. నా జీవితంలో చోటుచేసుకుంటున్న పెద్ద మార్పు ఇది' అని విశాల్ తెలిపారు. 'కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి సరైన తోడు దొరికింది. విశాల్ మంచి మనసు నన్ను ఆకట్టుకున్నది' అని అనీషా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా చెప్పింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త కుమార్తె అయిన అనీషా నటిగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రూపొందిన 'పెళ్లిచూపులు', 'అర్జున్‌రెడ్డి' చిత్రాల్లో సహాయనటిగా కనిపించారు. ఈ నెలలోనే హైదరాబాద్‌లో విశాల్, అనీషా నిశ్చితార్థం నిర్వహిస్తామని, పెళ్లికూడా ఇక్కడే జరుపనున్నామని విశాల్ తండ్రి జీకే రెడ్డి చెప్పారు.


కృష్ణ, విజయనిర్మల, నవీన్ విజయకృష్ణ

నవీన్‌లో మంచి ఈజ్ వుంది!

నవీన్ విజయకృష్ణ, శ్రీనివాస్ అవసరాల కథానాయకులుగా నటిస్తున్న చిత్రానికి 'ఊరంతా అనుకుంటున్నారు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బాలాజీ సానల దర్శకుడు. మేఘా చౌదరి, సోఫియాసింగ్ కథానాయికలు. శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పి.ఎల్.ఎన్. రెడ్డి, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. బుధవారం హీరో నవీన్ విజయకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా చిత్ర టైటిల్ లోగోను, ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నటులు కృష్ణ, విజయనిర్మల విడుదల చేశారు. కృష్ణ మట్లాడుతూ 'టైటిల్ బాగుంటే సగం సినిమా హిట్టయినట్టే. ఈ సినిమాకు 'ఊరంతా అనుకుంటున్నారు' అనే నేటివ్ టైటిల్ దొరికింది. ఇంగ్లీష్ పదాలతో ఎక్కువ టైటిల్స్ వస్తున్న ఈ తరుణంలో ఇలాంటి టైటిల్‌తో రావడం బాగుంది. చిన్నతనం నుంచి నవీన్ సినీ వాతావరణంలో పెరిగాడు. తనలో మంచి ఈజ్ వుంది. పాటలు, ఫైట్‌లు అన్నీ బాగా చేయగలుగుతున్నాడు. నటుడిగా అతనికి మంచి భవిష్యత్తు వుంటుంది. నరేష్ జడ్జిమెంట్ బాగుంటుంది. తను కథ విన్నానని, బావుందని చెబుతున్నాడు అంటే సినిమాలో విషయం వున్నట్టే. నవీన్‌కు ఈ సినిమాతో ఫ్యాన్ ఫాలోయింగ్ రావాలి' అన్నారు.


'సైరా నరసింహారెడ్డి' చిత్రంలో విజయ్ సేతుపతి

అనుష్క హారర్ థ్రిల్లర్

'భాగమతి' తర్వాత అనుష్క చిత్రమేది సెట్స్‌మీదకు రాలేదు. ఆమె కథానాయికగా నటించనున్న తాజా చిత్రం మార్చి నెలలో అమెరికాలో ప్రారంభంకానుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి హేమంత్ మధుకర్ దర్శకత్వం వహిస్తారు. మాధవన్, అంజలి, షాలినిపాండే ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. 'హారర్ థ్రిల్లర్ కథాంశమిది. తెలుగు, తమిళం, హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులతో భారీ స్థాయిలో తెరకెక్కించబోతున్నాం. మార్చి నెలలో చిత్రీకరణ ప్రారంభించి ఈ ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం' అని చిత్ర బృందం పేర్కొంది. కోన వెంకట్, గోపీసుందర్, షనీల్ డియో, గోపిమోహన్, నీరజ కోన ఈ చిత్రానికి సాంకేతిక నిపుణులు. ఇతర నటీనటులు, టెక్నీషియన్స్ వివరాల్ని త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, కోన వెంకట్.




దివ్యాంశ కౌశిక్, నాగచైతన్య

ప్రేమానుభవాల మజిలీ

జీవిత గమనంలో ఎన్నో మజిలీలుంటాయి. ప్రతి మజిలీ ఏవో కొన్ని జ్ఞాపకాల్ని మిగుల్చుతుంది. ఇక ప్రేమ ప్రయాణం ప్రతి ఒక్కరి జీవితంలో ప్రత్యేకమైనది. విరహ వేదనలు, సంయోగవియోగాలు, ఎడబాటు తెచ్చే మనోవేదన, ఏదో తెలియని సంఘర్షణ..వెరసి బాధలోనూ మాధుర్యాన్ని పంచుతుంది ప్రణయ ప్రయాణం. అలాంటి మధురమైన అనుభవాలకు వెండితెర దృశ్యరూపమే మా 'మజిలీ' అన్నారు శివ నిర్వాణ. ఆయన దర్శకత్వంలో నాగచైతన్య, సమంత జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్‌పెద్ది నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ప్రేక్షకులముందుకురానుంది. దివ్యాంశ కౌశిక్ మరో కథానాయికగా నటిస్తున్నది. ఈ చిత్ర రెండో లుక్‌ను సంక్రాంతి కానుకగా విడుదల చేశారు. క్రికెట్ బ్యాట్ పట్టుకొని ప్రేయసి సమక్షంలో ఆనందభరితుడై ఉన్న నాగచైతన్య లుక్ అందరిని ఆకట్టుకుంటున్నది. వైజాగ్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'దేర్ ఈజ్ లవ్..దేర్ ఈజ్ పెయిన్' అనే క్యాప్షన్ వస్తున్న ఈ సినిమాలో ప్రేమతాలూకు హృద్యమైన భావాల్ని ఆవిష్కరించామని దర్శకుడు చెప్పారు. ఇప్పటికే ఎనభైశాతం చిత్రీకరణ పూర్తయిందని నిర్మాతలు తెలిపారు రావు రమేష్, సుబ్బరాజు, పోసాని కృష్ణమురళి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: విష్ణు శర్మ, ఆర్ట్: సాహి సురేష్, సంగీతం: గోపీ సుందర్, రచన–దర్శకత్వం: శివ నిర్వాణ.

వంద రూపాయలతో మొదలై..


రమేష్‌ప్రసాద్

తెలుగు సినిమాకు కొత్త సొబగుల్ని అద్దిన తొలితరం దర్శకనిర్మాతల్లో ఎల్.వి. ప్రసాద్ ఒకరు. టాకీ సినిమాలతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా బహుముఖప్రజ్ఞాశాలిగా కీర్తిని గడించారు. నేడు ఆయన 111వ జయంతి. ఎల్.వి ప్రసాద్ సినీ ప్రయాణాన్ని గురించి ఆయన తనయుడు రమేష్‌ప్రసాద్ వెల్లడిస్తూ 'నాన్న పెద్దగా చదువుకోలేదు. తెలుగు తప్ప మరో భాష తెలియదు. కానీ సినిమాలపై ఇష్టంతో కేవలం వంద రూపాయలతో ముంబాయిలో అడుగుపెట్టారు. గేట్‌కీపర్, ఆఫీస్‌బాయ్, అసిస్టెంట్ కెమెరామెన్, సహాయదర్శకుడు, నటుడు.. ఇలా ఉపాధి కోసం అనేక పనులు చేశారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని సినిమా రంగంలో స్థిరపడ్డారు. గృహప్రవేశం, బిదాయి, మిలాన్, మిస్సమ్మ, పల్నాటి యుద్ధం వంటి తెలుగు, హిందీ, తమిళ భాషల్లో పలు సినిమాల్ని తెరకెక్కించి దర్శకనిర్మాతగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్రవేశారు నాన్న గేట్‌కీపర్‌గా పనిచేసిన థియేటర్‌లోనే ఆయన దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'కిలోనా' ఇరవై ఐదు వారాలు ఆడింది' అని తెలిపారు.


జోయ్, రిచా గంగోపాధ్యాయ

నిశ్చితార్థం జరిగింది!

రానాను హీరోగా పరిచయం చేస్తూ శేఖర్ కమ్ముల రూపొందించిన చిత్రం 'లీడర్'. ఇదే చిత్రంతో పరిచయమైంది ఢిల్లీ సోయగం రిచా గంగోపాధ్యాయ. తొలి సినిమాతోనే మంచి గుర్తింపును సొంతం చేసుకున్న రిచా తెలుగు, తమిళ, బెంగాలీ భాషల్లో దాదాపు తొమ్మిది చిత్రాల్లో నటించింది. 2013లో నాగార్జున హీరోగా నటించిన 'భాయ్' తరువాత కొంత విరామం తీసుకున్న ఆమె ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిపోయింది. ఆ తరువాత నుంచి సినిమాలకు దూరంగా వుంటూ వస్తున్న రిచా తాజాగా ట్విట్టర్ ద్వారా తన పెళ్లి వార్తను వెల్లడించింది. బిజినెస్ స్కూల్‌లో పరిచయమైన జోయ్ అనే వ్యక్తితో తన నిశ్చితార్థం జరిగినట్లు ప్రకటించి తనకు కాబోయే భర్తతో కలిసి దిగిన ఫొటోను అభిమానులతో పంచుకుంది. అయితే ఇంకా పెళ్లి తేదీని ఖరారు చేయలేదని, నా జీవితంలో కొత్త దశ మొదలు కాబోతోందని, దాని కోసం అంతులేని ఆనందంతో ఎదురుచూస్తున్నాని తెలిపింది.